శుక్రవారం
13•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 258
• పేజీలు : 16 + 16

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా పెద్దపల్లి కలెక్టరేట్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## సింగరేణి సీఎండీపై విమర్శలు అర్థరహితం

- ఖండించిన అధికారుల సంఘం
- శ్రీధర్ హయాంలోనే రూ.1,767 కోట్లకు చేరిన సంస్థ లాభాలు
- ప్రభుత్వరంగ సంస్థల్లో నం.1గా నిలిపారంటూ ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణిని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, ప్రభుత్వరంగ సంస్థల్లో నంబర్‌వన్‌గా నిలిపిన సీఎండీ ఎన్ శ్రీధర్‌ను నిందించడంపై సింగరేణి అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. అవినీతి, అక్రమాలకు పాల్పడి ఉద్యోగాలు కోల్పోయిన వ్యక్తులు సీఎండీపై చేస్తున్న ఆరోపణలు అర్థరహితం అని మండిపడింది. హైదరాబాద్‌లో గురువారం కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి బ్రాంచి ఉన్నతస్థాయి కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జక్కం రమేశ్, ప్రధాన కార్యదర్శి ఎన్వీ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ.. సీఎండీ శ్రీధర్ సారథ్యంలో కంపెనీ అమ్మకాలు రూ.14,078 కోట్ల నుంచి రూ.25,071 కోట్లకు పెరిగాయని, లాభాలు రూ.490 కోట్ల నుంచి రూ.1,767 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఇక ఉత్పత్తి 52 మిలియన్ టన్నుల నుంచి 64 మిలియన్ టన్నులకు పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు ఏ రాజేశ్వర్‌రెడ్డి, ఏవీ రెడ్డి, ఎస్‌కే సలీం, సముద్రాల శ్రీనివాస్, వీవీ మధుకర్, చంద్రమౌళి, రమేష్‌బాబు, మంచాల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

## ఇరిసెట్ డీజీగా గోయల్

- ఐఆర్‌ఎస్‌ఈఈ అధికారిగా మూడుదశాబ్దాలు భారతీయ రైల్వేలో సేవలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్) డైరెక్టర్ జనరల్‌గా ఎస్కే గోయల్‌ను నియమించారు. ఇరిసెట్‌కు మొదటి డైరెక్టర్ జనరల్‌గా నియమితులైన ఆయన గురువారం దక్షిణమధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యాను మర్యాదపూర్వకంగా కలిశారు. 1982 బ్యాచ్‌కు చెందిన గోయల్ ఐఆర్‌ఎస్‌ఈఈ అధికారిగా భారతీయ రైల్వేలో ముఖ్యమైన పదవులు చేపట్టారు. సదరన్ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్‌గా, 1984లో అసిస్టెంట్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్‌గా, రైల్వేబోర్డులో సిగ్నల్ ప్రాజెక్టు విభాగం ఈడీగా, సదరన్ రీజియన్ రైల్‌టెల్ కార్పొరేషన్ ఈడీగా, దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ సిగ్నల్ అండ్ టెలికామ్ ఇంజినీర్(ప్రాజెక్టులు)గా పనిచేశారు. రైల్వేబోర్డు ఈడీగా పనిచేసిన కాలంలో అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లోని కార్నేగీమిలన్ వర్సిటీలో అడ్వాన్స్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు.



# అప్రమత్తంగా ఉండాలి

- పెరుగుతున్న కొవిడ్-19 కేసులు
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కోరారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు చేపడుతున్న చర్యలపై రోజువారీ సమీక్షలో భాగంగా గురువారం బీఆర్కే భవన్‌లో మంత్రి.. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి, ప్రత్యేక అధికారి శ్రీదేవి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీపీహెచ్ జీ శ్రీనివాసరావు, ఐపీఎం డైరెక్టర్ శంకర్‌తో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. గాంధీ దవాఖానలో కొవిడ్-19 పాజిటివ్‌తో చేరిన వ్యక్తికి పూర్తిగా నయమైందని, త్వరలో డిశ్చార్జ్ చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం ఒక్క పాజిటివ్ కేసు కూడా లేదన్నారు. ఇతర దేశాలనుంచి వచ్చేవారు కచ్చితంగా 14 రోజులు ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉండాలని సూచించారు. విదేశాల నుంచి వచ్చేవారి ద్వారా మాత్రమే తెలంగాణ గడ్డమీదకు కొవిడ్-19 వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు. సోషల్‌మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఫోన్ ద్వారా కోరారు. బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. కాన్ఫరెన్సులు, సెమినార్లను కొద్దిరోజులు వాయిదా వేసుకోవాలన్నారు.

### నిట్ విద్యార్థికి కరోనా పరీక్షలు

**వరంగల్ నిట్‌క్యాంపస్:** వరంగల్ అర్బన్‌లోని కర్నూలుకు చెందిన పరిశోధక విద్యార్థి అమెరికాలో జరిగిన జాతీయ సదస్సుకు హాజరై ఈ నెల 1న తిరిగి వచ్చారు. ఆ వెంటనే కర్నూలుకు వెళ్లి ఈ నెల 8న వరంగల్ నిట్‌కు చేరుకున్నారు. ఇక్కడికి రాగానే జ్వరం, దగ్గు, జలుబు రావడంతో మంగళవారం హన్మకొండలోని ప్రైవేటు దవాఖానలో చేరారు. కరోనా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో గురువారం ఎంజీఎంకు తరలించారు. అక్కడి డాక్టర్లు నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం గాంధీ దవాఖానకు పంపించారు. నిట్ క్యాంపస్ మెడికల్ విభాగం పరిసరాల్లో బ్లీచింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టారు. నిట్‌లో ఉన్న వారెవరికీ కరోనా వైరస్ సోకలేదని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.



నిట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిలో కొవిడ్-19 లక్షణాలు ఉన్నాయన్న అనుమానంతో నమూనాలను హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు పంపించారు. ఏపీలోని

## ఇటలీలో తెలుగువారికి కేటీఆర్ భరోసా

### క్షేమంగా రప్పించాలని విదేశాంగమంత్రికి ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటలీలో చిక్కుకున్న భారత్‌కు చెందిన విద్యార్థులను క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌కు రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా గురువారం ఉదయం విజ్ఞప్తిచేశారు. ఇటలీ ఎయిర్‌పోర్టులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు ఎలాగైనా సహాయం చేయాలని బాధిత విద్యార్థులు చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించారు. మొత్తం 66 మంది తెలుగు విద్యార్థులు.. అందులో 26 మంది హైదరాబాద్‌వాసులున్నట్టు బాధితులు పేర్కొన్నారు. కరోనా నెగెటివ్ సర్టిఫికెట్ ఉంటేనే బోర్డింగ్ పాస్ ఇస్తామంటూ రోమ్ విమానాశ్రయ అధికారులు ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి కేటీఆర్.. 'ఇటలీలోని ఇండియా ఎంబసీ అధికారులను అప్రమత్తం చేసి, దిక్కు తోచని స్థితిలో ఉన్న విద్యార్థులకు సహాయం చేయాలి' అని కేంద్ర మంత్రికి ట్వీట్‌చేశారు.

## కరోనా కట్టడికి చర్యలు

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. కరోనాతోపాటు స్వైన్‌ఫ్లూ, డెంగీ, మలేరియా తదితర వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని దాఖలైన అన్ని పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మరోమారు విచారణ చేపట్టింది. మురికివాడల్లో పారిశుద్ధ్య చర్యలు, నీటి సరఫరా చేయాలని హై కోర్టు తెలిపింది. శానిటైజర్లు, మాస్కుల ధరలను పెంచి అమ్ముతున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కరోనాపై అవగాహన బృందాల ఏర్పాటు, పనివిభజన, ఇతర చర్యల వివరాలు ఇవ్వాలని కోరింది. ఎన్ని ప్రైవేటు దవాఖానల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారన్న వివరాలతో ఈ నెల 23 వరకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. కరోనా నిర్ధారణ, ప్రజలకు అవగాహన కల్పించేందుకు తీసుకున్న చర్యలను ధర్మాసనానికి వివరించారు. గాంధీ, ఫీవర్, వరంగల్ ఎంజీఎం, ఉస్మానియా దవాఖానల్లో వైరస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో రోజుకు 500 మందికి నిర్ధారణ పరీక్షలు చేసే సామర్థ్యం ఉన్నదని తెలిపారు. కేంద్రం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ రాజేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 44 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కరోనా కట్టడికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరు బాగున్నదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

## మూడు కిలోల కోడి రూ.50కే!

**జవహర్‌నగర్:** కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తుండగా వ్యాధిభయంతో జనం కోడి మాంసం తినడం తగ్గించారు. దీంతో చికెన్ విక్రయాలు అమాంతం పడిపోయాయి. ఫౌల్ట్రీఫాం నిర్వాహకులు నష్టాన్ని కొంతవరకైనా పూడ్చుకొనేందుకు ఇండ్లవద్దకే వచ్చి రూ.50కే మూడు కిలోల కోడిని విక్రయిస్తున్నారు. హైదరాబాద్ జవహర్‌నగర్‌లోని అంబేద్కర్‌నగర్‌లో గురువారం గూడ్స్ ఆటోలో కోళ్లను తీసుకువచ్చి విక్రయించగా, స్థానికులు పెద్దఎత్తున కొనుగోలుచేశారు.



మంత్రి కేటీఆర్ మంజూరుచేసిన రూ.లక్ష ఎల్వోసీని హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న లక్ష్మీనర్సయ్యకు అందజేస్తున్న దమ్మన్నపేట ఉప సర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి

## నిరుపేదకు కేటీఆర్ అండ

### వెన్నెముక శస్త్రచికిత్సకు రూ.లక్ష ఎల్వోసీ మంజూరు

**గంభీరావుపేట:** వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఓ నిరుపేదకు మంత్రి కే తారకరామారావు అండగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఈరవేని లక్ష్మీనర్సయ్య రెండేండ్ల క్రితం గల్ఫ్ వెళ్లారు. మస్కట్‌లోని బల్దియా కంపెనీలో పారిశుద్ధ్య పనులు చేస్తుండగా గత నెల పదో తేదీన వెన్నెముకలో తీవ్రమైన నొప్పి వచ్చింది. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించిన కంపెనీ.. స్వదేశానికి పంపించింది. కుటుంబసభ్యులు ఆయనను కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, వెన్నెముకకు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని చెప్పారు. లక్ష్మీనర్సయ్య తల్లి గౌరవ్వ, భార్య కృష్ణవేణి కూడా కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. రెక్కల కష్టం తప్ప మరే ఆస్తులులేని వీరు.. సమస్యను ఉపసర్పంచ్ అరుట్ల అంజిరెడ్డికి వివరించారు. దీంతో ఆయన సమస్యను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. నిరుపేద సమస్యపై పెద్ద మనస్సుతో స్పందించిన మంత్రి కేటీఆర్ రూ.లక్ష ఎల్వోసీ మంజూరుచేశారు. గురువారం ఎల్వోసీ పత్రాన్ని హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న లక్ష్మీనర్సయ్యకు అంజిరెడ్డి అందజేశారు. తమకు అండగా నిలిచిన మంత్రి కేటీఆర్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



గురువారం తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ బార్ అసోసియేషన్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ చౌహాన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఉన్నారు.



గురువారం బేగంపేట విమానాశ్రయంలో నిర్వహించిన 2020 ఫ్లైయింగ్ ఆల్ వింగ్స్ ఇండియా కార్యక్రమంలో విమానాల విన్యాసాలు

## మతం మారినా పేదరికం పోదు

### గురుకులాల్లో దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లపై హైకోర్టు వ్యాఖ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మతం మారినంత మాత్రాన పేదరికం, వెనుకబాటుతనం పోదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మతం మారిన దళిత క్రిస్టియన్ల పిల్లలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాలుచేస్తూ హైదరాబాద్ కుర్మగూడకు చెందిన పీ శ్రీనివాస్ దాఖలుచేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున ఎన్ హరినాథ్ వాదనలు వినిపిస్తూ హిందువు మతం మారితే రిజర్వేషన్ కోల్పోతాడని పేర్కొన్నారు. దళిత క్రిస్టియన్ల పేరిట రిజర్వేషన్ కల్పించడం చట్టవిరుద్ధమన్నారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం.. దళితులు మతం మారినంత మాత్రాన ధనవంతుడు కాలేడని వ్యాఖ్యానించింది. వెనుకబడినవర్గాల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం కొంత రిజర్వేషన్ కల్పిస్తే తప్పేమిటని ప్రశ్నించింది. సాంఘిక సంక్షేమశాఖ తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఈ రిజర్వేషన్ కేవలం సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని ఒకటి నుంచి ఐదో తరగతి ప్రవేశాలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. రిజర్వేషన్ల అంశంపై కౌంటర్ దాఖలుచేయాలని సూచించిన హైకోర్టు.. విచారణను నాలుగువారాలకు వాయిదావేసింది.

## పసుపు మార్కెటింగ్‌లో కేంద్రం విఫలం: మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పసుపును ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పసుపు నాణ్యత పెంపు, మార్కెటింగ్, వినియోగం, దీర్ఘకాలిక ప్రణాళిక, మద్దతు ధరలపై ఆయన గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులతో అసెంబ్లీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పసుపు పంటలో నాణ్యతను పెంచడంతోపాటు, ఎగుమతులపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వమే పసుపును తీసుకొని, ప్రాసెసింగ్ చేసే అవకాశాల మీద దృష్టిసారించాలన్నారు. మహిళాసంఘాలకు పసుపు ప్రాసెసింగ్ పనులను అప్పగించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సూచించారు. నిపుణుల కమిటీని నియమించి, పసుపు వినియోగం అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి, ఉద్యానశాఖ సంచాలకుడు వెంకట్రామిరెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, సంజయ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోవర్ధన్ గౌడ్, జీవన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సీ ప్లేన్ డిజైన్ సెంటర్

### స్వీడన్ సంస్థ రెవిన్ ఏవియేషన్ ప్రకటన ■ బేగంపేట విమానాశ్రయంలో ఎయిర్‌షో ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ పరిసరాల్లో సీప్లేన్ (సముద్రపు విమానం) డిజైన్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు స్వీడన్‌కు చెందిన రెవిన్ ఏవియేషన్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ నిల్స్ పిల్‌బ్లాడ్ చెప్పారు. వింగ్స్ ఇండియా ఎయిర్‌షో-2020లో భాగంగా గురువారం బేగంపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీప్లేన్ డిజైన్ యూనిట్‌ను ఏర్పాటుచేయడానికి హైదరాబాద్ అనువైన ప్రదేశమని భావిస్తున్నట్టు చెప్పారు. విమానాశ్రయాల ఏర్పాటుకు భూమికొరత ఏర్పడుతున్న నేపథ్యంలో సీప్లేన్‌లకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. దీనిపై పదేండ్లపాటు అధ్యయనం చేశామని చెప్పారు. సీప్లేన్‌లను ఎయిర్ అంబులెన్స్‌లుగా కూడా వినియోగించవచ్చన్నారు.



'రెవిన్' వ్యవస్థాపక డైరెక్టర్ నిల్స్ పిల్‌బ్లాడ్

2013 లో సీప్లేన్‌లను కొనుగోలుచేసిన కేరళ ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చే పర్యాటకులను అలరిస్తున్నదని చెప్పారు. ఇద్దరు పైలట్లు, 10మంది ప్రయాణికులు కూర్చునేవిధంగా విమానాలను రూపొందించామని తెలిపారు.

### వింగ్స్ ఇండియా ప్రారంభం

నాలుగురోజులపాటు జరిగే వింగ్స్‌ఇండియా ఎయిర్‌షో-2020 గురువారం ప్రారంభమైంది. మొదటిరోజు రెండు బృందాలు ఎయిర్‌షో నిర్వహించాయి. సాధారణ ప్రజలను అనుమతించకపోవడంతో ఎయిర్‌షో వెలవెలపోయింది. కరోనా నేపథ్యంలో ఇతరదేశాల ప్రతినిధుల రాకపై కూడా ఆంక్షలు విధించారు. దీంతో విమానాలు కూడా అతి తక్కువగా వచ్చాయి. వైమానిక రంగానికి చెందిన ప్రముఖ కంపెనీలు తమ సంస్థల గురించి, వాటి ప్రత్యేకతలను తెలుపుతూ నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి.

## కాంగ్రెస్ రేవంత్ సొంతం కాదు

- నిన్నమొన్నొచ్చి అంత హడావుడొద్దు: ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో ప్రచారం చేయించుకోవడం ఆపాలని, అలాచేస్తే సీఎం కాలేరని.. ప్రజాబలం ఉండాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అంత ప్రజాబలం ఉంటే టీడీపీలోనే ఎందుకు ఉండలేదని ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. తాము టీఆర్‌ఎస్‌లో చేరాలనుకుంటే ఎవరూ ఆపలేరని స్పష్టంచేశారు. నిన్నమొన్న వచ్చిన రేవంత్ హడావుడి చేయడం సరికాదని హితవుపలికారు. కాంగ్రెస్ రేవంత్ ఒక్కరికే సొంతం కాదని విమర్శించారు. అసత్య ప్రచారాలు ఆపకపోతే అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సీఎం కేసీఆర్ వ్యూహాలను అంచనా వేయడం అంత తేలికైనపని కాదన్నారు.

### రేవంత్ సమాధానం చెప్పాలి: వీహెచ్

రేవంత్ చేసిన ఆరోపణలకు కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని, 111 జీవోపై ఆరోపణలకు రేవంత్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత వీహెచ్ అన్నారు. రేవంత్ అనుచరులు సోషల్‌మీడియాలో చేస్తున్న ఆరోపణలపై గురువారం వీహెచ్ స్పందించారు. రేవంత్‌రెడ్డిపై అనేక కేసుల్లో విచారణ జరుగుతుందని, వాటిని కూడా కాంగ్రెస్ పార్టీ సమస్యలుగా చూపిస్తారా? అని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ ఫాంహౌస్‌పై డ్రోన్ ఎగురవేయడం, ఫొటోలు తీయడం తప్పేనని స్పష్టం చేశారు.

## రైతుల ఆదాయం రెట్టింపు

- శరవేగంగా ఫుడ్‌ప్రాసెసింగ్ రంగం అభివృద్ధి
- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు
- సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపుకానుందని కౌన్సిల్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సదరన్ రీజియన్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో నాబార్డ్ తెలంగాణ, కల్గుడి సహకారంతో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ 'ఫుడ్ అండ్ ఆగ్రో ప్రాసెసింగ్' రంగంపై సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ భారీగా పెట్టుబడులను ఆకర్షించిందని అన్నారు. దేశంలో ఆహారసేవల మార్కెట్ 4,23,865 కోట్ల రుపాయలుగా 2018-19లో నమోదైందని, ఇది 19 శాతం వృద్ధిరేటుతో 2022-23 నాటికి 5,99,782 కోట్లకు చేరనుందని చెప్పారు. కిసాన్ సంపద యోజన ద్వారా ఫుడ్‌ప్రాసెసింగ్‌లో వృద్ధిని వేగవంతం చేయడంతోపాటు రైతులకు అత్యుత్తమ ధరలను ఇస్తుందని సీఐఐ ఫారిన్ ట్రేడ్ అదనపు డైరెక్టర్ జనరల్ సీతారాంరెడ్డి తెలిపారు. తెలంగాణలో అత్యంతవేగంగా వృద్ధిచెందుతున్న 14 రంగాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ఒకటని తెలంగాణ ఎగుమతుల ప్రోత్సాహం విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుదీన్‌పాల్ తెలిపారు. రవాణా ఖర్చులు ఎక్కువున్నచోట ఫుడ్ క్లస్టర్ల సహాయకారిగా ఫార్మర్స్-ప్రొడ్యూసర్ కంపెనీలు ఉంటాయని ఇండియన్ చాంబర్ రీజియన్ హెడ నవీన్ మద్దిశెట్టి అన్నారు.

# విభజన 'ధర్మ' విరుద్ధం!

### మళ్లీ మొదటికి విద్యుత్ ఉద్యోగుల విభజన ■ 1,157 మంది తిరిగి తెలంగాణకే కేటాయింపు
### మార్గదర్శకాలకు విరుద్ధంగా అనుబంధ ఉత్తర్వులు ■ జస్టిస్ ధర్మాధికారి ఉత్తర్వులపై విద్యుత్ సంఘాల ఆగ్రహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ ఉద్యోగుల విభజనలో తిరిగి జరుగుతున్నదని తెలంగాణ విద్యుత్ సంస్థల ఉద్యోగులు, కార్మికులు మండిపడుతున్నారు. జస్టిస్ ధర్మాధికారి బుధవారం ఇచ్చిన అనుబంధ ఉత్తర్వులు ధర్మవిరుద్ధమంటున్నారు. జస్టిస్ ధర్మాధికారి గత డిసెంబర్ 26న ఇచ్చిన తుది ఉత్తర్వుల్లో 655 మందిని ఏపీకి, 502 మందిని తెలంగాణకు కేటాయించారు. తుది ఉత్తర్వులకు బుధవారం అనుబంధ ఉత్తర్వులు జారీచేశారు. ఏపీకి కేటాయించినవారిలో 71 మందిని వివిధ కారణాలతో తెలంగాణకు కేటాయించారు. మిగిలిన 584 మందిని ఏపీ తీసుకోవాలని చెప్తూనే.. అదే సంఖ్యలో (584) ఏపీ ఉద్యోగులను తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1,157 మందిని మళ్లీ తెలంగాణకే పంపించడాన్ని తెలంగాణవాదులు ఖండిస్తున్నారు. అవసరమైతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామంటున్నారు.

### ఆదినుంచి ఏపీ పేచీ

ఉద్యోగుల విభజనను ఏపీ ఉన్నతాధికారులు మొదటి నుంచి అడ్డుకుంటూనే ఉన్నారు. ఏపీ స్థానికత కలిగిన 1,175 మందిని తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుతో 2018 నవంబర్‌లో ఏర్పాటైన జస్టిస్ ధర్మాధికారి కమిటీ ఉద్యోగుల విభజనను చేపట్టింది. ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులతో ఏర్పాటైన సబ్ కమిటీ అంగీకారంతో 2019 డిసెంబర్ 26న తుది ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రిలీవ్ చేసిన మొత్తం ఉద్యోగుల్లో ఏపీకి ఆప్షన్ ఇచ్చిన 655 మందిని ఏపీకి కేటాయించింది. 502 మందిని తెలంగాణకు అలాట్‌చేసింది. సమస్యను పరిష్కరించుకోవాలనే సదుద్దేశంతో తెలంగాణ ఉన్నతాధికారులు అందుకు అంగీకరించారు. దీనిపై కొర్రీలు పెట్టిన ఏపీ మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్లగా.. జస్టిస్ ధర్మాధికారి వద్దకే వెళ్లాలని, మళ్లీ చర్చించి నిర్ణయం తీసుకోవాలని తేల్చిచెప్పింది. సమస్య పరిష్కారానికి పలు అంశాల్లో తెలంగాణ విద్యుత్ సంస్థలు మానవీయ దృక్పథంతో వ్యవహరించాయి. అయిన్నప్పటికీ అనుబంధ ఉత్తర్వుల పేరుతో మరో 584 మందిని ఏపీ నుంచి తెలంగాణకు కేటాయించడంపై కార్మికులు మండిపడుతున్నారు.





జస్టిస్ ధర్మాధికారి కమిటీ నివేదిక తుది నివేదికపై చర్చిస్తున్న టీఈఈఏ నాయకులు

### నివేదికపై విద్యుత్‌సంఘాల మండిపాటు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జస్టిస్ ధర్మాధికారి కమిటీ తుది నివేదిక ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని, దీనిని తిరస్కరిస్తున్నట్టు తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ (టీఈఈఏ), తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ), విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) ప్రకటించాయి. ఆయా సంఘాలు గురువారం హైదరాబాద్‌లో వేర్వేరుగా సమావేశమై కమిటీ నివేదికపై చర్చించాయి. ఆయా సమావేశాల్లో టీఈఈఏ సంఘం అధ్యక్షుడు ఎన్ శివాజీ, ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్య, టీఎస్‌పీఈఏ అధ్యక్ష కార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, సదానందం, వీఏవోఏటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, టీఎస్ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు డీ వీరాస్వామి, కార్యదర్శి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం
13•3•2020
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







# భిక్ష కాదు మా హక్కు

## కేంద్రం నిధుల్లో రాష్ట్రాలకు వాటా లేదా? కేంద్రాన్ని నమ్ముకుంటే శంకరగిరిమాన్యాలే

- కాంగ్రెస్ పాలనపై విసుగుతోనే బీజేపీకి అధికారం
- దేశాన్ని పాలించడంలో రెండుపార్టీలూ అట్టర్‌ఫ్లాప్
- ఏది చెప్తే అది నమ్మడానికి చదువురాని వాళ్లం కాదు
- కేంద్రంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పన్నులు వసూలుచేసే బాధ్యత మాత్రమే కేంద్రానిది.. ఆ పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిందేనని సీఎం కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చేది భిక్ష కాదని.. రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కుఅని పేర్కొన్నారు. నాడు సీఎస్టీ పేరుతో కాంగ్రెస్.. నేడు జీఎస్టీ పేరుతో బీజేపీ వాస్తవంగా రాష్ట్రాలకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే నిధుల అంశంలో బీజేపీ నేతల విమర్శలపై ఘాటుగా స్పందించారు. యాభై, అరవై ఏండ్ల తర్వాత.. అదీ కాంగ్రెస్ పాలనపై విసుగుతో కేంద్రంలో బీజేపీకి ప్రజలు అవకాశమిచ్చారు కానీ.. ప్రేమతో కాదని వ్యాఖ్యానించారు. లేకలేక వచ్చిన ఆ అవకాశాన్ని

మిగతా 9వ పేజీలో



గురువారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసిన రాజ్యసభ టీఆర్‌ఎస్ అభ్యర్థులు కేఆర్ సురేశ్‌రెడ్డి, కే కేశవరావు




ఒక్కరోజే 11 లక్షల కోట్లు ఖతం

- భీకర నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- తొలిసారిగా సెన్సెక్స్ 2,919 పాయింట్లు పతనం
- ఏడాది కనిష్ఠానికి సూచీ.. నిఫ్టీ 868 పాయింట్లు క్షీణత
- ఏడాదిన్నర కనిష్ఠానికి పడిపోయిన రూపాయి

8



గురువారం శంషాబాద్‌లోని విమానాశ్రయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్‌లో మంత్రి కే తారకరామారావు

# పైలట్లకు ఇక్కడే శిక్షణ

- శంషాబాద్‌లో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ ప్రారంభం
- విమాన పరిశ్రమకు హైదరాబాద్ అనువు: మంత్రి కేటీఆర్

4

# సుస్థిరాభివృద్ధిలో టాప్

- ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల ప్రకారమే అప్పు
- గణనీయంగా పెరిగిన తలసరి ఆదాయం
- సంక్షేమానికి ఒక్కరూపాయి తగ్గించలేదు
- కాంగ్రెస్ భ్రమలను బడ్జెట్ బద్దలుకొట్టింది
- బడ్జెట్‌పై జనంలో ఆశ.. ప్రతిపక్షాల్లో నిరాశ
- బడ్జెట్‌పై చర్చకు మంత్రి హరీశ్ సమాధానం

9



## ప్రత్యేక సెలవుగా సమ్మెకాలం

- ఆర్టీసీపై సర్కారు ఉత్తర్వులు
- 55 రోజులకు రూ.235 కోట్లు
- నేడు ఉద్యోగుల ఖాతాల్లో వేతనం

4



## కరోనా తొలికాటు

- వైరస్‌తో 76 ఏండ్ల కర్ణాటకవాసి మృతి
- మరణానికి ముందు హైదరాబాద్‌కు బాధితుడు
- దేశంలో 74 కేసులు

5




## ఐపీఎల్ జరిగేనా?

- గుబులు రేపుతున్న కరోనా వైరస్
- ప్రేక్షకులు లేకుండానే మ్యాచ్‌లు?
- విదేశీ ఆటగాళ్ల రాకపై సందేహాలు
- గవర్నింగ్ కౌన్సిల్‌దే తుది నిర్ణయం

వివరాలు ఆటలో

### చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

| | |
|---|---|
| ఫారం ధర- 15.00 | రిటైల్ లైవ్ -37.00 |
| డ్రెస్‌డ్- 54.00 | స్కిన్‌లెస్- 61.00 |

### గుడ్ల ధరలు (వందకు) (రూ.)

| | |
|---|---|
| హైదరాబాద్- 295.00 | రంగారెడ్డి-295.00 |
| మెదక్- 295.00 | కరీంనగర్- 298.00 |
| వరంగల్ - 298.00 | డజన్ ధర-54.00 |









epaper.ntnews.com



గురువారం అసెంబ్లీలో టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులు కే కేశవరావు, కే ఆర్ సురేశ్‌రెడ్డిని అభినందిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యేలు

## నీలాంటి సోదరి దొరకడం అదృష్టం

■ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ సంతోష్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ ఎంపీ కవితకు ఎంపీ జే సంతోష్‌కుమార్ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆదరణీయ, దయగల నీలాంటి సోదరిని కలిగి ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను అని ట్విట్ చేశారు. నీవు చూపే ప్రేమానురాగాలు ఎప్పటికీ మరిచిపోలేనని, ఆ భగవంతుడి ఆశీర్వాదం సమృద్ధిగా లభించాలని ఆకాంక్షించారు. మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతోపాటు ప్రజాసేవలో చిరకాలం ఉండేలా భగవంతుడు దీవించాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.

## ప్రత్యేక సెలవుగా సమ్మెకాలం

■ నేడు ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాల్లోకి సమ్మెకాల వేతనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకాలాన్ని ప్రత్యేక సెలవుగా పరిగణిస్తూ టీఎస్‌ఆర్టీసీ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సమ్మెకాలానికి సంబంధించిన 55 రోజుల జీతభత్యాలను శుక్రవారం కార్మికుల ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకోసం ఆర్థికశాఖ రూ. 235 కోట్లను బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది అక్టోబర్ 5 నుంచి నవంబర్ 28 మధ్యకాలంలో జరిగిన సమ్మెకాలాన్ని ప్రత్యేక సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్)గా పరిగణిస్తున్నట్టు ఆర్టీసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సమ్మెకాలంలో మరణించిన వారికి, ఉద్యోగవిరమణ చేసినవారికి కూడా తుది వేతన లెక్కింపులో ఈ 55 రోజుల వేతనం కలుస్తుందని స్పష్టంచేసింది.



# పెద్దలసభకు కేకే, కేఆర్

## టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

■ పేర్లు ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. నేడు నామినేషన్లు దాఖలు

■ ఏకగ్రీవం కానున్న రెండు రాజ్యసభ స్థానాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని రెండు రాజ్యసభస్థానాలకు టీఆర్‌ఎస్ అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం ప్రకటించారు. టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కే కేశవరావును మరోసారి అవకాశం ఇవ్వగా.. ఉమ్మడి ఏపీ మాజీస్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డిని రెండో అభ్యర్థిగా ఎంపికచేశారు. వీరిద్దరూ శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. తమను అభ్యర్థులుగా ఖరారుచేసిన సీఎం కేసీఆర్‌కు కేశవరావు, సురేశ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అభ్యర్థులిద్దరినీ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు, మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు అభినందించారు. అనుభవం, ప్రజాసేవపట్ల వారికున్న దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ ఈసారి అభ్యర్థులను ఎంపికచేసినట్టు తెలుస్తున్నది. సామాజిక కోణంలోనూ సమతూకాన్ని పాటిస్తూ ఒక బీసీని, ఒక ఓసీ అభ్యర్థిని ఎంపికచేశారు. కేశవరావు రాజకీయాల్లో తలపండినవారు కాగా, సురేశ్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలకు తగిన బలం లేకపోవడంతో అవి తమ అభ్యర్థిని పోటీకి పెట్టే అవకాశాలు లేవు. దీంతో టీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఈ నెల 16న నామినేషన్లు పరిశీలించనున్నారు. 18న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదేరోజు ఇరువురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశాలున్నాయి.

### రాజ్యసభలో గులాబీ దండు

రాజ్యసభలో రాష్ట్రం నుంచి మొత్తం ఏడుగురు సభ్యులు టీఆర్‌ఎస్‌కు చెందినవారే ప్రాతినిధ్యం వహించనున్నారు. గత నాలుగు దశాబ్దాల్లో ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఒకే పార్టీకి చెందిన సభ్యులు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించటం ఇదే మొదటిసారి. టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుల్లో నలుగురు బీసీలే కావడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2016, 2018లోజరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అన్ని స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. తాజాగా ఎన్నికయ్యే ఇద్దరు సభ్యులతో పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ బలం 16కు చేరుకోనుంది. లోక్‌సభలో టీఆర్‌ఎస్‌కు 9మంది సభ్యులున్న సంగతి తెలిసిందే.

### తలపండిన నేత కేశవరావు

డాక్టర్ కంచర్ల కేశవరావు 1939 జూన్ 4న జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 1972 నుంచి 1979 వరకు రాష్ట్ర కనీసవేతనాల బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. 1979 నుంచి 1985 వరకు శాసనమండలి సభ్యుడిగా ఉన్న కేకే ఏడాదిపాటు డిప్యూటీ చైర్మన్‌గా ఉన్నారు. 1992 నుంచి 1994 వరకు రాజీవ్‌గాంధీ టెక్నాలజీ మిషన్ చైర్మన్‌గా పనిచేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి ఏపీపీసీసీ అధ్యక్షుడిగా, బెంగాల్ తదితర రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా వ్యవహరించారు. మొదటిసారి 2006లో కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. 2013లో కేసీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. 2014 ఏప్రిల్‌లో టీఆర్‌ఎస్ పక్షానరాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం పరిశ్రమలపై ఏర్పాటుచేసిన పార్లమెంటరీ స్థాయీసంఘం చైర్మన్‌గా ఉన్నారు. టీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్‌గా, పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### అనుభవశాలి సురేశ్‌రెడ్డి

నిజామాబాద్ జిల్లాకు చెందిన కేతిరెడ్డి సురేశ్‌రెడ్డి 1959 మే 25న జన్మించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, విమలదేవి ఆయన తల్లిదండ్రులు. భార్య పద్మజారెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. 1984లో రాజకీయ ప్రవేశంచేసిన ఆయన 1989 నుంచి వరుసగా 1994, 1999, 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1990లో లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా, 1997లో పీఏసీ చైర్మన్‌గా పనిచేశారు. 2004 నుంచి 2009 వరకు ఉమ్మడి ఏపీ స్పీకర్‌గా వ్యవహరించారు. 2009, 2014లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2018 సెప్టెంబర్ 7న టీఆర్‌ఎస్‌లో చేరారు.

# రక్షణ కంపెనీలతో ఉపాధి

■ హైదరాబాద్ డిఫెన్స్ హబ్‌లో 'టాటా' చేరడం సంతోషం

■ పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు

■ నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థకు భూమిపూజ



నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ భూమిపూజలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రక్షణరంగానికి సంబంధించిన కంపెనీల స్థాపనతో తెలంగాణలోని యువతకు భారీ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. దేశ డిఫెన్స్ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్ (టీఏఎస్‌ఎల్)కు చెందిన నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ లిమిటెడ్ (ఎన్ఐఎస్‌ఎల్) సంస్థ చేరడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ భూమిపూజలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. నగరంలో ఇప్పటికే పన్నెండుకుపైగా డీఆర్డీవో వంటి అతిపెద్ద ల్యాబ్‌లతోపాటు రక్షణరంగానికి చెందిన 25 వరకు పెద్ద ప్రైవేటు కంపెనీలు, వెయ్యికిపైగా ఎమ్మెస్ఎంఈలు ఉన్నాయని తెలిపారు. ఆరేండ్లుగా హైదరాబాద్‌లో టాటాగ్రూప్ కంపెనీల వృద్ధి అద్భుతంగా ఉన్నదని చెప్పారు. మరోసారి టీఏఎస్‌ఎల్‌కు చెందిన ఏరోస్పేస్ కంపెనీని హైదరాబాద్‌లో స్థాపించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 600 మందికి ఉపాధి కలుగుతుందని కేటీఆర్ వెల్లడించారు. హైదరాబాద్ నగరంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నందుకు టాటాగ్రూప్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ చైర్మన్ నర్సింహారెడ్డి, కంపెనీ ఎండీ, సీఈవో సుకారన్‌సింగ్‌తో కలిసి పాల్గొన్నారు.

## పైలట్లకు ఇక్కడే శిక్షణ

■ శంషాబాద్‌లో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ ప్రారంభం

■ విమాన పరిశ్రమకు హైదరాబాద్ అనువు: మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో వైమానికరంగానికి మంచి భవిష్యత్ ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. తాత్కాలికంగా కొంత ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. గురువారం శంషాబాద్‌లోని జీఎంఆర్ విమానాశ్రయం ఆవరణలో పైలట్ల శిక్షణాకేంద్రం ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానరంగ పరిశ్రమలు, అనుబంధ రంగాలకు హైదరాబాద్ అనువైన కేంద్రంగా ఉన్నదని తెలిపారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు విమానయాన పరిశ్రమలకు మంచి ఊతమిస్తాయని చెప్పారు. ప్రస్తుతం హర్యానాలోని గుర్గావ్‌లో మాత్రమే ఇటువంటి సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో నెలకొల్పింది రెండోది. పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ అనుమతితో యూరోపియన్ ఏజెన్సీ శంషాబాద్ విమానాశ్రయంలోని ఎకరం స్థలంలో ఈ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. అచ్చం విమానాలను పోలినట్లు ఉండే సిమ్యులేషన్ ఫ్లైట్‌లో కొత్తగా ఎంపికైన పైలట్లకు శిక్షణనిస్తారు. తాము అత్యంత నిష్ణాతులైన శిక్షకులతో విమానాలను నడుపటంలో శిక్షణనిస్తున్నామని ఎఫ్ఎస్‌టీసీ కెప్టెన్ సంజయ్ మాండవియా తెలిపారు.



శంషాబాద్‌లో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు.

# త్వరితగతిన రైల్వే పనులు

### లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా డిమాండ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం లో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం లోక్‌సభలో రైల్వేపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి ఆరేండ్లయినా విభజనచట్టంలోని హామీలు నెరవేరలేదన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి అతీగతి లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రైల్వే నెట్‌వర్క్‌లు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్ కొత్త రైల్వేలైనుతోపాటు, పటాన్‌చెరువు –సంగారెడ్డి, వికారాబాద్ –వాడి –కృష్ణా, పెద్దపల్లి –భువనగిరి, భువనగిరి –శంకర్‌పల్లి, విష్ణుపురం –జాన్‌పహాడ్, మానకొండూరు –మక్కెడ్ –పరర్భణి, నిజామాబాద్ –మద్కేడ్, నిజామాబాద్ –నిర్మల్ –ఆదిలాబాద్, గద్వాల –మాచర్ల తదితర లైన్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు రవాణాకు ఉపయోగపడే భద్రాచలం – కొవ్వూరు రైల్వే లైన్ ఎన్నోఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నదని గుర్తుచేశారు. దీనికోసం సింగరేణి సంస్థ ఇప్పటికే 50శాతం నిధులను తన వాటాగా రైల్వేలకు చెల్లించిందని చెప్పారు.

# వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్

### ఎంపీ రంజిత్‌రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) మొదటిదశను లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు పొడిగించాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం లోక్‌సభలో రైల్వేపద్దులపై చర్చ లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి కొత్తగా రైల్వేలైన్ల కోసం నిధులు రావడంలేదన్నారు. రాష్ట్రంలోనే చివరిదైన చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని నవాంగిస్టేషన్‌లో ఉదయం 6.30 గంటలకు ఒకే ఒక్క రైలు ఆగుతుందని, ఆ తర్వాత వచ్చేవేవీ ఆగడంలేదనిచెప్పారు. గరీబ్‌రథ్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను తాండూరులో నిలపాలని, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను వికారాబాద్‌లో ఆపాలని కోరారు.

### పీఎంజేవీకే క్లాస్‌రూంలు

పీఎంజేవీకే కింద తెలంగాణకు 103 అదనపు తరగతి గదులు, 50 అంగన్‌వాడీ కేంద్రాలు, 11 కామన్‌సర్వీస్ సెంటర్లు, 340 కంప్యూటర్లు ఇచ్చినట్టు కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. పీఎంజేవీకే పథకంపై చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

# గురుకులాలాల పనితీరు అద్భుతం

■ ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

■ బడులనూ ఇదే తరహా మార్చాలి: విద్యా పరిరక్షణ కమిటీ వినతి



రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి బృందం సభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ చక్రధర్‌రావు తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల పనితీరు అద్భుతంగా ఉన్నదని, అవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ మెరుగైన విద్యను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లో వినోద్‌కుమార్‌ను కలిశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాలలు బాగున్నాయని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలు ఇదే తరహాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. గురుకులాల మెరుగైన పనితీరు వల్ల వాటిలో ప్రవేశాలకు విపరీతమైన పోటీ ఏర్పడిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల పరిధిలోకి తీసుకొచ్చి, విద్యార్థులకు ఉదయం టిఫిన్, సాయంత్రం అరటిపండు, పాలు ఇచ్చి బడిలోనే హోంవర్క్ చేయించాలని కోరారు. అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, అందులో భాగంగానే ఈచ్‌వన్ –టీచ్‌వన్‌ను చేపట్టిందని వినోద్‌కుమార్ వారికి తెలిపారు. ఆయనను కలిసినవారిలో ప్రొఫెసర్లు హరగోపాల్, చక్రధర్‌రావు, లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురామ్, ప్రదీప్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయవర్సిటీ వీసీ ప్రవీణ్‌రావుకు ఎమ్మెస్ స్వామినాథన్ అవార్డు



వీసీ ప్రవీణ్‌రావు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు.. ఎమ్మెస్ స్వామినాథన్ అవార్డుకు ఎంపికయ్యారు. భారతీయ వ్యవసాయ పరిశోధనామండలి విశ్రాంత ఉద్యోగుల సంఘం, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ అవార్డును అందజేస్తున్నాయి. దేశంలో వ్యవసాయరంగ ప్రగతికి తోడ్పాటునందిస్తున్న శాస్త్రవేత్తలు, వృత్తినిపుణులకు రెండేండ్లకోసారి ఈ అవార్డును ఇస్తారు. ఐకార్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్ఎస్ పరోడా నేతృత్వంలోని ఎంపిక కమిటీ వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక రంగాలలో నిష్ణాతులైన 13మంది నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించింది. వ్యవసాయ పరిశోధన, బోధన, విస్తరణ, పరిపాలనలో పనితీరు ఆధారంగా ప్రవీణ్‌రావును ఈ అవార్డుకు ఎంపికచేసినట్టు కమిటీ ప్రకటించింది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి వీసీగా ప్రవీణ్‌రావు తీసుకున్న పలు విప్లవాత్మకమైన నిర్ణయాలతో వర్సిటీ దేశంలో ఆరోస్థానంలో నిలిచింది.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సీడీపీ నిధులు

■ రూ.93.12 కోట్లు విడుదల.. ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) కింద రూ.93.12 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసింది. రాష్ట్రంలోని 120 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎమ్మెల్సీల నియోజకవర్గాల అభివృద్ధికిగానూ చివరి విడుతగా రూ.69,85,55,773 విడుదలచేశారు. మరో 20 మంది ఎమ్మెల్సీలకు (గవర్నర్ కోటాలో నామినేట్ అయిన ఆరుగురు, ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన 14 మంది) చెందిన నియోజకవర్గాల అభివృద్ధికి రూ. 23,26,45,227 విడుదలచేస్తూ గురువారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులను గతంలో మంజూరైన పనులను పూర్తిచేసేందుకు మాత్రమే వినియోగించాలని, కొత్త పనుల కోసం వాడకూడదని సూచించారు.

## ఆన్‌లైన్ 'ఫ్యాన్సీ'తో అధికాదాయం

■ త్వరలో రాష్ట్రమంతటా ప్రవేశపెట్టేందుకు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆన్‌లైన్‌లో ఫ్యాన్సీ నంబర్ వేలంతో ఆదాయం పెరిగింది. పలు నంబర్లకు ఊహించని రీతిలో రెట్టింపు ధర పలికింది. గత నెల 10వ తేదీన మొదలైన ఆన్‌లైన్ ఫ్యాన్సీ నంబర్ల ఈ–బిడ్డింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ పరిధిలోని ఐదు ఆర్టీఏ కార్యాలయాల్లో మొదలుపెట్టిన ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో త్వరలో రాష్ట్రమంతటా అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్సీ నంబర్లకు మాన్యువల్‌గా వేలం పాట వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల రావాల్సినంత ఆదాయం రావడంలేదని గ్రహించిన ప్రభుత్వం.. ఆన్‌లైన్ ద్వారా వేలంపాట చేపట్టాలని నిర్ణయించింది.



### ఆదాయం పెంచడమే లక్ష్యం: పువ్వాడ అజయ్‌కుమార్

వాహనదారులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు రవాణాశాఖ ఆదాయాన్ని కూడా పెంచుతున్నాం. ఇప్పటికే పలు సేవలను ఆన్‌లైన్ చేయడంతో వాహనదారులకు పలు ఇబ్బందులు తొలిగిపోయాయి.

# నిద్రలేని భారతం!

### నగరాల్లో తగ్గిపోతున్న నిద్ర సమయం

### కంటినిండా నిద్రకు నోచుకోని భాగ్యనగరం

### సెంచరీ మ్యాట్రెస్సెస్, వీవ్‌మేకర్ సంస్థల సర్వేలో వెల్లడి

### నేడు ప్రపంచ నిద్ర దినోత్సవం



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మానసిక, శారీరక ఆరోగ్యానికి తగినంత నిద్ర అత్యంత అవసరం. ప్రతి మనిషి రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలని ఆరోగ్య నిపుణులు చెప్తుంటారు. కానీ, నాగరిక జీవితంలో నిర్దేశించిన ప్రమాణాల కంటే తక్కువ నిద్రపోతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. మార్చి 13 ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంచరీ మ్యాట్రెస్సెస్, వీవ్‌మేకర్ సంస్థలు దేశంలోని పది ప్రధాన నగరాల్లో నిర్వహించిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, కొచ్చి, అహ్మదాబాద్, భువనేశ్వర్, ఇండోర్, విశాఖపట్నం, రాయ్‌పూర్ నగరాల్లో సర్వే చేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు. 2018లో వారాంతపు దినాల్లో రోజుకు సగటు నిద్ర సమయం 7.66 గంటలు ఉండగా, 2019లో 6.85 గంటలకు పడిపోయినట్టు సర్వే నిర్ధారించింది. మిగిలిన వారంరోజుల్లో రోజుకు సగటున 7.48లపాటు నిద్రించగా ప్రస్తుతం అది 6.76 గంటలకు పడిపోయిందనేది సర్వే సారాంశం. 25 నుంచి 35 ఏండ్ల వయస్సు మహిళల్లో నిద్రలేమి సమస్య మరింత పెరిగినట్టు సర్వే తేల్చింది. మహిళలు 2018లో వారాంతపు దినాల్లో సగటున 7.70 గంటలు నిద్రించగా 2019లో 6.60 గంటలకు పడిపోయినట్టు పేర్కొంది. పురుషులు 2018లో వారాంతపు దినాల్లో సగటున 7.66 గంటలు నిద్రించగా 2019లో 6.58 గంటలకు తగ్గినట్టు గుర్తించింది.

### హైదరాబాదీలకూ నిద్ర కరువే!

హైదరాబాద్ నగరంలోనూ నిద్రలేమి సమస్య పెరుగుతున్నది. 2018తో పోల్చుకుంటే 2019లో హైదరాబాద్‌లో నిద్రకు కేటాయించిన సమయం 21శాతం తగ్గినట్టు సర్వే వెల్లడించింది. హైదరాబాద్‌లో వీకెండ్స్‌లో 2018లో సగటున 8.13 గంటలు నిద్రించగా 2019లో 6.88 గంటలకు పరిమితమైంది. మిగిలిన వారం రోజుల్లో 2018లో రోజుకు సగటున 7.88 గంటలుగా ఉన్న నిద్ర సమయం 2019లో 5.08 గంటలకు కుదించుకుపోయిందనేది సర్వే సారాంశం.

**పది నగరాల్లో వారాంతపు దినాల్లో మనిషి సగటు నిద్ర**

| | |
|---|---|
| 2018 | 7.66 గంటలు |
| 2019 | 6.85 గంటలు |

**పది నగరాల్లో వర్కింగ్ డేస్‌లో మనిషి సగటునిద్ర**

| | |
|---|---|
| 2018 | 7.48 గంటలు |
| 2019 | 6.76 గంటలు |

**హైదరాబాద్‌లో**

**వారాంతాల్లో మనిషి సగటు నిద్ర**

| | |
|---|---|
| 2018 | 8.13 గంటలు |
| 2019 | 6.88 గంటలు |

**వర్కింగ్ డేస్‌లో మనిషి సగటునిద్ర**

| | |
|---|---|
| 2018 | 7.88 గంటలు |
| 2019 | 5.08 |

**41%** మంది నగరవాసులు నిద్ర నుంచి లేవడానికి నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. విశ్రాంతి చాలలేదని ఫీలవుతున్నారు.

**26%** మంది బెడ్ మీదకు వెళ్లిన తర్వాత కూడా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు వినియోగించడం వల్ల నిద్రచాలడం లేదని చెప్తున్నారు.

**51%** మంది క్రమం తప్పిన నిద్ర, పరుపుల తయారీలో శాస్త్రీయత లేకపోవడం వల్ల వెన్నెముక నొప్పితో బాధపడుతున్నారు.

## లోకం పోకడ




## ముహూర్తం

సూర్యోదయం: 6.25 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం చతుర్థి ఉదయం 8.51 వరకు, తదుపరి పంచమి శనివారం ఉదయం 6.18 వరకు, నక్షత్రం: స్వాతి మధ్యాహ్నం 2.00 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: ఉదయం 6.02 నుంచి 7.29 వరకు, రాహుకాలం: ఉదయం 10.53 నుంచి మధ్యాహ్నం 12.22 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.48 నుంచి 9.35 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.46 నుంచి 1.33 వరకు, వర్జ్యం: రాత్రి 7.12 నుంచి రాత్రి 8.41 వరకు.

## నటులు టామ్‌హంక్స్ దంపతులకు వైరస్



**శాన్‌ఫ్రాన్సిస్కో:** హాలీవుడ్ నటుడు టామ్‌హంక్స్, ఆయన భార్య, నటి రీటా విల్సన్‌కు కరోనా సోకింది. ఈ విషయాన్ని హంక్స్ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. ఇటీవల తాము ఆస్ట్రేలియా వెళ్లినట్టు చెప్పారు. అక్కడ అలసట, ఒంటినొప్పి, తుమ్ములు, స్వల్పంగా జ్వరం లక్షణాలు కనిపించడంతో కరోనా పరీక్షలు చేయించుకొన్నామని అన్నారు. వైద్యులు తమను ఐసోలేషన్ వార్డులో ఉంచారని, వారి సూచనలు పాటిస్తున్నామని తెలిపారు.

## ఇరాన్‌లో ఆరువేల మంది భారతీయులు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రభావిత దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయుల్ని తీసుకురావడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ అన్నారు. ఆ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సుమారు ఆరు వేల మంది భారతీయులు ఉన్నారని ఇందులో *1100* మంది యాత్రికులు, *300* మంది విద్యార్థులు, వెయ్యి మంది మత్స్యకారులని చెప్పారు. ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను తీసుకురావడానికి వచ్చే మూడ్రోజుల్లో ఆ దేశానికి మూడు విమానాల్ని పంపనున్నట్టు అధికారులు చెప్పారు. మరోవైపు కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు అవసరమైన వైద్య సామగ్రిని పంపించాల్సిందిగా భూటాన్, మాల్దీవులు, ఇరాన్ నుంచి విజ్ఞప్తులు వచ్చాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు.

## స్కూళ్లు, థియేటర్లు బంద్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ 'అంటువ్యాధి' అని ఢిల్లీ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో ఢిల్లీలోని అన్ని విద్యాసంస్థలు, థియేటర్లు, షాపింగ్ మాల్స్ ను ఈ నెల 31 వరకు మూసి వేయాలని ఆదేశించింది. పరీక్షాకేంద్రాలను మినహాయించింది.

## పర్యటనలు రద్దు

**వాషింగ్టన్:** కరోనా నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ మంత్రి మార్క్ఎస్పర్ భారత పర్యటనను రద్దుచేసుకున్నారు. ఆయన ఈ నెల 15-16 తేదీల్లో పర్యటించాల్సి ఉన్నది. మరోవైపు బ్రిటన్ మినహా ఐరోపా దేశాల పర్యాటకులపై నెలరోజుల నిషేధం విధిస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. శుక్రవారం జరుగాల్సిన మానవ హక్కుల కౌన్సిల్ 43వ వార్షిక సమావేశాన్ని ఐరాస రద్దు చేసింది.

## సెల్‌ఫోన్లపై మరింత పన్ను!



**న్యూఢిల్లీ:** కేంద్రప్రభుత్వం ఆదాయం పెంపు మార్గాలపై దృష్టి సారించింది. ఈమేరకు వివిధ శాఖల అధికారుల కమిటీ సిఫారసుల మేరకు వివిధ వస్తువులపై దశలవారీగా వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)ను పెంచేందుకు సిద్ధమవుతున్నది. శనివారం జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మొబైల్ ఫోన్లు, రసాయన ఎరువులు, దుస్తులపై జీఎస్టీని *18* శాతానికి పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే వీటి ధరలు పెరుగుతాయి. తయారీ వస్తువులపై ప్రస్తుతం జీఎస్టీ ఐదు లేదా *12*శాతం, వాటి విడిభాగాలు, ఇన్‌పుట్ సర్వీసులు, క్యాపిటల్‌గూడ్స్‌పై గరిష్ఠంగా జీఎస్టీ *18* లేదా *28* శాతం ఉంది. మొత్తం తయారీ వస్తువుల కన్నా వాటి విడిభాగాలపై పన్ను అధికంగా ఉంటే.. దానిని రీఫండ్ చేయాలని ఉత్పత్తిదారులు అధికారులను కోరుతూ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం సెల్‌ఫోన్లపై *12*శాతం జీఎస్టీ అమల్లో ఉంది.



## ట్రంప్‌ను కలిసిన అధికారికి కరోనా



ట్రంప్‌తో ఫబియో

**బ్రసీలియా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల భేటీ అయిన ఓ బ్రెజిల్ అధికారికి కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని బ్రెజిల్ అధ్యక్షుని కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. బ్రెజిల్ దేశాధ్యక్షుడు జైర్ బోల్సొనారోకు మీడియా కార్యదర్శిగా పనిచేస్తున్న ఫబియో వాజన్‌గర్టెన్ గత శనివారం అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ట్రంప్‌తో ఫ్లోరిడా రీసార్ట్‌లో సమావేశమయ్యారు. పర్యటన అనంతరం అస్వస్థతకు గురైన అధికారికి పరీక్షలు నిర్వహించగా కరోనా సోకినట్టు తేలింది. కాగా అతనితో అధ్యక్షుడు బోల్సొనారోతో పాటు ఇతర సిబ్బంది కూడా పర్యటనకు వెళ్లినట్టు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, కరోనా నేపథ్యంలో.. జపాన్ రాజధాని టోక్యోలో త్వరలో జరుగనున్న ఒలంపిక్స్ క్రీడల్ని ఏడాది పాటు వాయిదా వేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహానిచ్చారు.

## కెనడా ప్రధాని భార్యకు వైరస్?

**అట్టావా:** కెనడా ప్రధాని సతీమణి సోఫీ గ్రెగోయిర్ ట్రూడోకు కరోనా సోకినట్లు సమాచారం. బ్రిటన్‌లోని ఓ కార్యక్రమంలో ప్రసంగించి బుధవారం తిరిగి వచ్చిన ఆమెకు ఫ్లూ లక్షణాలు కనిపించగా, పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రధాని జస్టిన్ ట్రూడో ఇంటి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. పలువురు నేతలతో జరుగాల్సిన సమావేశాలను ఆయన రద్దు చేసుకున్నారు.

## భారత్‌లో కరోనా పుట్టివుంటే అంతే..!

### బ్రిటన్ ఆర్థికవేత్త జిమ్ ఓ నీల్ వివాదస్పద వ్యాఖ్యలు



**లండన్:** 'కరోనాను భారత్‌లో పుట్టించనందుకు దేవుడికి ధన్యవాదాలు' అంటూ బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త జిమ్ ఓ నీల్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. సీఎన్‌బీసీలో బుధవారం జరిగిన చర్చలో మాట్లాడుతూ.. భారత్‌లో కరోనా మొదలై ఉంటే ప్రభుత్వ యంత్రాంగం చైనా మాదిరిగా స్పందించి ఉండేది కాదన్నారు. కరోనాను చైనా నియంత్రించిన విధానాన్ని పశ్చిమదేశాలు ఆచరించాలని సూచించారు. కాగా, జిమ్ వ్యాఖ్యలను భారత విదేశాంగశాఖ అధికారి విశ్వేష్‌నేగి ఖండించారు. అసత్యం, బాధ్యతా రహితమైనవని విమర్శించారు. కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు.

# కరోనా తొలి కాటు

## వైరస్ సోకి 76 ఏండ్ల కర్ణాటకవాసి మృతి

- మరణానికి ముందు హైదరాబాద్‌కు వచ్చిన బాధితుడు
- దేశంలో 74కు చేరిన కొవిడ్-19 కేసులు
- వ్యాక్సిన్ కనిపెట్టేందుకు రెండేండ్లు పట్టొచ్చు: కేంద్రం
- కరోనా నియంత్రించదగిన మహమ్మారి: డబ్లూహెచ్‌వో



జమ్ములోని ప్రభుత్వ దవాఖానకు వచ్చినవారికి శానిటైజర్ అందజేస్తున్న వలంటీర్

**న్యూఢిల్లీ, మార్చి 12:** ప్రాణాంతక కరోనా(కొవిడ్-19) మహమ్మారి భారత్‌లో ఒకరిని బలితీసుకున్నది. కర్ణాటకలో ఇటీవల చనిపోయిన 76 ఏండ్ల వృద్ధుడు కరోనా బాధితుడని అధికారులు తెలిపారు. దేశంలో ఈ వైరస్ నిర్ధారిత కేసుల సంఖ్య గురువారంనాటికి 74కు చేరింది. కరోనా వైరస్ 'ఓ నియంత్రించదగిన మహమ్మారి' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్లూహెచ్‌వో) పేర్కొంది.

**కర్ణాటకలో కరోనా మృతి**

దేశంలో తొలి కరోనా మరణం నమోదైంది. కర్ణాటకలోని కలబుర్గికి చెందిన 76 ఏండ్ల ఓ వృద్ధుడు మంగళవారం చనిపోయాడు. అయితే, అతనికి కరోనా సోకినట్టు ఆ రాష్ట్ర అధికారులు గురు0వారం ధ్రువీకరించారు. కాగా మృతుడు మరణించడాని కంటే ముందు హైదరాబాద్‌లోని రెండు ప్రైవేటు దవాఖానల్లో చికిత్స తీసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. మరోవైపు, వృద్ధుడు చికిత్స తీసుకున్న దవాఖానల్లోని సిబ్బందిని పర్యవేక్షణలో ఉంచామని, ఇప్పటి వరకూ ఎవ్వరికీ వైరస్ సోకినట్టు గుర్తించలేదని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ జి శ్రీనివాసరావు తెలిపారు. మృతిచెందిన వృద్ధుడితో 43 మంది కాంటాక్ట్‌లో ఉన్నట్టు తేలింది. తొలి కరోనా మరణానికి హైదరాబాద్‌తో సంబంధం ఉన్నట్టు తేలడంతో తెలంగాణ ప్రభుత్వం అన్ని దవాఖానల్ని అప్రమత్తం చేసింది. కాగా వృద్ధుడు సౌదీ అరేబియా నుంచి గతనెల 29న దేశానికి వచ్చినట్టు అధికారులు పేర్కొనారు. మరోవైపు, కరోనా వైరస్ నిర్ధారిత కేసుల సంఖ్య 74కు చేరుకున్నట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటివరకూ ఢిల్లీ-6, ఉత్తర్‌ప్రదేశ్-10, కర్ణాటక-4, మహారాష్ట్ర-11, లడక్-3, రాజస్థాన్, తెలంగాణ, తమిళనాడు, జమ్ముకశ్మీర్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కోటి చొప్పున కరోనా కేసులు నమోదవ్వగా.. కేరళలో ఇప్పటివరకూ 17 కరోనా కేసులు నమోదయ్యాయని ఇందులో ముగ్గురు వ్యక్తులు కోలుకోవడంతో వాళ్లను డిశ్చార్జి చేశామని ఆ శాఖ తెలిపింది. మరోవైపు, కరోనాను నియంత్రించేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపడితే ఈ వైరస్ 'ఓ నియంత్రించదగిన మహమ్మారి' అని డబ్లూహెచ్‌వో తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల్లోని 1,26,000మందికి కరోనా సోకిందని వెల్లడించింది. ఇటలీలో మృతుల సంఖ్య వెయ్యి దాటింది. గురువారం 189 మంది మృతి చెందారు. దీంతో మరణాల సంఖ్య 1,016కు పెరిగింది. ఇరాన్‌లో మృతుల సంఖ్య 429గా నమోదైంది. ఇంకోవైపు, కరోనా కారణంగా ఐరోపా-రష్యా దేశాలు తమ మార్స్ ప్రయోగాన్ని రెండేండ్లు వాయిదా వేసకున్నాయి.

### భయం వద్దు



కరోనా వైరస్ వ్యాప్తిపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజలందరూ భయాన్ని విడిచిపెట్టి.. ముందు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ప్రజలు అనవసరమైన విదేశీ ప్రయాణాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరోనాను అరికట్టేందుకు సంబంధిత మంత్రిత్వ శాఖలు, ఆయా రాష్ట్రాలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. కేంద్ర మంత్రులు ఎవరూ కూడా కొన్ని రోజుల పాటు విదేశీ ప్రయాణాలు చేయరని మోదీ పేర్కొన్నారు. ప్రజలెవరూ గుమిగూడవద్దని, దీంతో వైరస్‌ను అరికట్టొచ్చన్నారు.

### కరోనా కట్టడికి వ్యాక్సిన్

కరోనాను అరికట్టేందుకు ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్టు ఆ దేశ మీడియాలో గురువారం కొన్ని కథనాలు ప్రసారమయ్యాయి. మరికొద్ది రోజుల్లో దీనిపై వాళ్లు ఓ ప్రకటన చేయనున్నట్టు సమాచారం.

**నిర్ధారణ కాలేదు**

కరోనా వైరస్‌ను అరికట్టే వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు కనీసం రెండేండ్ల సమయం పడుతుందని కేంద్రం పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతల వద్ద వైరస్‌లు సాధారణంగా జీవించలేవని అయితే కరోనా విషయంలో ఇది ఇంకా నిర్ధారణ కాలేదని వెల్లడించింది. కరోనా నేపథ్యంలో ఇంటివద్ద నుంచే పనిచేయాలని ట్విట్టర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగులను ఆదేశించింది.



### కొత్తగా 139 మరుగుజ్జు గ్రహాల గుర్తింపు

***వాషింగ్టన్:*** *మన సౌరవ్యవస్థలోని సుదూర ప్రాంతంలో మరో 139 మరుగుజ్జు గ్రహాలున్నట్టు అమెరికాలోని పెన్సిల్వేనియా వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. ఇవి గ్రహాలుగా రూపాంతరం చెందే దశలోనే ఉన్నాయని చెప్పారు. శాస్త్రవేత్తలు అంతరిక్షంలోని మెరుస్తున్న పదార్థాలను పరిశీలించి అవి గ్రహాలో కావో నిర్ధారిస్తుంటారు.*



### ఆ గ్రహంపై 'ఇనుము' వర్షం

**లండన్:** వర్షం అంటే నీళ్లు అని అందరికీ తెలిసిందే. కానీ.. ఓ గ్రహంపై మాత్రం 'ఇనుము' వర్షంగా పడుతోందని స్విట్జర్లాండ్‌లోని జెనీవా యూనివర్సిటీ పరిశోధకులు చెప్తున్నారు. భూమికి 640 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'డబ్ల్యూఏఎస్పీ-76బీ' గ్రహంపై వారు పరిశోధనలు జరిపారు. ఇక్కడ పగటి ఉష్ణోగ్రతలు 2,400 డిగ్రీ సెల్సియస్ కన్నా ఎక్కువగా ఉంటాయి. ఈ ఉష్ణోగ్రత వద్ద ఇనుము వంటి లోహాలు సైతం ఆవిరవుతాయి. రాత్రివేళ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతాయి. దీంతో ఆవిరి రూపంలో ఉన్న లోహాలు గడ్డకట్టి.. వర్షంగా కురుస్తాయని శాస్త్రవేత్తలు వివరించారు.



### స్కాట్లాండ్‌లో అరుదైన డైనోసార్ శిలాజాలు

***లండన్:*** *అభివృద్ధి చెందుతున్న దశలో ఉన్న డైనోసార్ల శిలాజాల పాదముద్రల్ని స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు గుర్తించారు. 17.4 నుంచి 16.4 కోట్ల సంవత్సరాల క్రితం ఈ జీవులు స్కాట్లాండ్‌లోని 'స్కై' ద్వీపంలో సంచరించినట్టు అంచనా వేస్తున్నారు. ఈ డైనోసార్లు మధ్య జురాసిక్ యుగంలోని 'స్టెగోసారస్' వర్గానికి చెందినవని భావిస్తున్నారు.*

# ఎవరినీ శంకించం!

- పౌరులను సందేహించేలా ఎన్పీఆర్ నవీకరణ ఉండబోదు
- ఢిల్లీ హింసాకాండ కారకులెవరైనా కఠిన చర్యలు తప్పవు
- రాజ్యసభలో చర్చకు హోంమంత్రి అమిత్‌షా సమాధానం

పార్లమెంట్‌కో బాక్



**న్యూఢిల్లీ, మార్చి 12:** జాతీయ పౌర పట్టిక (ఎన్పీఆర్) నవీకరణ ప్రక్రియలో దేశ పౌరులను ఎవరినీ శంకించబోమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఎన్పీఆర్ ప్రక్రియలో ఏ పౌరుడిపైనా సందేహస్పద వ్యాఖ్యను రికార్డు చేయబోమని తెలిపారు. ఇందులో భాగంగా పౌరులు తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి ఏ పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. ఢిల్లీలో హింసాకాండపై రాజ్యసభలో గురువారం జరిగిన స్వల్ప కాలిక చర్చకు అమిత్‌షా సమాధానమిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తెచ్చిన నేపథ్యంలో కొందరు చేసిన ద్వేష పూరిత ప్రసంగాలే ఢిల్లీలో హింసకు బీజం వేశాయన్నారు. ఎన్పీఆర్ కింద ఏ సమాచారం ఇవ్వాలన్నది ప్రజల ఇష్టమని చెప్పారు. కావాలంటే ఎన్పీఆర్‌పై విపక్ష నేతల సందేహాలను నివృత్తి చేస్తానని అమిత్‌షా అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన మత ఘర్షణల్లోనే 76 శాతం మంది మృతి చెందారని, అల్లర్లను ప్రోత్సహించడం బీజేపీ విధానం కాదని చెప్పారు. దేశంలో ట్రంప్ పర్యటిస్తున్న వేళ ప్రభుత్వమే హింసాకాండను ఎందుకు ప్రోత్సహిస్తుందని ప్రశ్నించారు. ఢిల్లీలో విదేశీ కరెన్సీ పంపిణీ అయ్యిందని, ద్వేషాన్ని వ్యాపింపజేసేందుకు ఫిబ్రవరి 24న వేల సోషల్ మీడియా ఖాతాలు సృష్టించారన్నారు. ఇవన్నీ పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తాయన్నారు. ఓటర్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌ల ఆధారంగా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా దాడులతో సంబంధం ఉన్న 1992 మందిని గుర్తించామని చెప్పారు. 2647 మందిని అరెస్ట్ చేసి, 712 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు. ఢిల్లీ హింసాకాండ విషయమై అనుమానితులను గుర్తించేందుకు ఆధార్ సమాచారాన్ని వాడలేదని, వ్యక్తిగత గోప్యతా మార్గదర్శకాలను ఉల్లంఘించలేదన్నారు.

**న్యాయ విచారణకు ఆదేశించండి**

అంతకుముందు చర్చలో పాల్గొన్న విపక్షాల సభ్యులు ఢిల్లీ హింసాకాండపై న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. హింసాకాండను అడ్డుకోవడంలో జాప్యం చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ సభ్యుడు కపిల్ సిబల్ చర్చను ప్రారంభిస్తూ విద్వేషపు వైరస్ యువతలో వ్యాపిస్తే ప్రజాస్వామ్యం ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎంకే సభ్యుడు తిరుచి శివ మాట్లాడుతూ హింసాకాండ పట్ల ప్రేక్షకపాత్ర వహించిన ఢిల్లీ పోలీసులను బాధ్యులను చేయాలన్నారు. టీఆర్ఎస్ సభ్యుడు బండా ప్రకాశ్ మాట్లాడుతూ దాడులను ప్రోత్సహించిన వారిని అరెస్ట్ చేసి తగు చర్యలు చేపట్టాలన్నారు. కరోనా వైరస్ కంటే మతతత్వం తక్కువ హానికరమేమీ కాదన్నారు.

## గోప్యత హక్కును హరించడం తగదు

**న్యూఢిల్లీ:** సీఏఏ వ్యతిరేక అల్లర్లలో విధ్వంసానికి పాల్పడిన నిరసనకారుల ఫోటోలు, పేర్లు, చిరునామాలతో యూపీ ప్రభుత్వం పోస్టర్లు ఏర్పాటు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. నిరసనకారుల గోప్యతా హక్కు హరించడం తగదని పేర్కొంది. పోస్టర్లను వెంటనే తొలిగించాలంటూ అలహాబాద్ హైకోర్టు ఈ నెల 9న ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్‌లు లలిత్, అనిరుద్ధ బోస్‌తో కూడిన ధర్మాసనం గురువారం దీనిపై విచారణ జరిపింది. ప్రభుత్వ ఆవేదన తమకు అర్థమైందని చెప్పింది. అయితే ఈ విషయంలో అతిగా ప్రవర్తించారని అభిప్రాయపడింది. ప్రభుత్వ చర్యను సమర్థించే చట్టమేదీ లేదని స్పష్టం చేసింది. ఒకవేళ ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే ఆ పత్రాలను సీజేఐ వద్ద ఉంచాలని పేర్కొంది.


స్లీప్ అప్నియాని నివారించండి
సంపూర్ణ ఆరోగ్య జీవనాన్ని పొందండి

STAR HOSPITALS
Expertise • Excellence • Empathy




ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ప్రజలు సాధారణ నిద్రలేమి సమస్యలతో సతమతమవుతున్నారు. తేలికగా తీసుకునే ఈ సమస్య భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్యానికి దారి తీస్తుంది. నిద్ర యొక్క అవసరం మరియు దాని ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహనని పెంపొందించడానికి స్టార్ హాస్పిటల్స్ ప్రముఖ ENT వైద్యులు డా. శ్రీనివాస కిషోర్ గారు ఈ నిద్ర రుగ్మతలపై చర్చించనున్నారు.

ఇటీవల ఇండియా టుడే నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, ప్రపంచంలో 20% మంది నిద్ర రుగ్మతలతో బాధపడుతున్నారు. ఈ నిద్ర సమస్యలలో చాల మంది ప్రధానంగా ఎదుర్కొనే సమస్య స్లీప్ అప్నియా. ఈ స్లీప్ అప్నియా అనేది నిద్రించేటప్పుడు శ్వాస తీసుకోవడంలో ఏర్పడే అస్వస్థత. ఈ స్లీప్ అప్నియా ఉన్నవారిలో నిద్రించే సమయంలో కొద్ది సేపు శ్వాస ఆగిపోతుంది.ఈ సమస్య ఉన్నవారిలో శ్వాసనాళం లేదా గొంతుకి చుట్టుపక్కల అధికంగా చేరిన కొవ్వు వలన ఈ సమస్య వస్తుంది.అందువలన గొంతు ద్వారం మూసి వేయబడి శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది.

లక్షణాలు

ఈ సమస్యలో బిగ్గరగా గురక పెట్టడం, అలసట, పగటి పూట అధికమైన నిద్ర వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్రించే సమయంలో స్లీప్ అప్నియా ఉన్నవారిలో శ్వాస ఆగిపోతుందని వారికి తెలియదు. అందువలన వారు నిద్రలో ఉలిక్కిపడి లేవడం, గట్టిగా శ్వాస పీల్చుకోవడం వంటి పరిస్థితులకు గురవుతారు. అంతే కాకుండా విశ్రాంతి లేని నిద్ర, ఉక్కిరిబిక్కిరి అవడం, ఉదయం తీవ్రమైన తలనొప్పి, జ్ఞాపక శక్తి మందగించడం వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ సమస్య అధికంగా ఊబకాయం ఉన్నవారిలో కనపడుతుంది. ఎక్కువగా మద్యపానం మరియు ధూమపానం ఉన్నవారిలో ఈ సమస్య మరింత తీవ్రతరం అవుతుంది.

చికిత్స

మీరు నిద్రించేటప్పుడు మీ శ్వాస మార్గాన్ని తెరిచి ఉంచే పరికరంతో స్లీప్ అప్నియాకు అత్యంత ప్రభావవంతమైన చికిత్స ఉంటుంది.ఈ పరికరంతో చికిత్స చేయడాన్ని "నిరంతర సానుకూల శ్వాస మార్గ పీడనం" లేదా CPAPచికిత్స అని అంటారు. ఈ CPAP పరికరాన్ని ఉపయోగించే స్లీప్ అప్నియా ఉన్నవారు ఎక్కువ విశ్రాంతి తీసుకునే అనుభూతిని పొందుతారు.

నోటిలో అమర్చబడే "ఓరల్ అప్లియన్సెస్" అని పిలువబడే మరొక పరికరం కూడా అందుబాటులో ఉంది. మీరు నిద్రపోతున్నప్పుడు మీ వాయుమార్గాన్ని తెరిచి ఉంచడానికి ఇది సహాయ-పడుతుంది.

సూచనలు

- నిద్రపోతున్నప్పుడు మీ వెనుకభాగం కిందకు ఉండేలా చూసుకోండి
- మీ అధిక బరువును తొలగించుకోండి
- మద్యం మరియు ధూమపాన అలవాట్లని మానుకోండి

పైన చెప్పినట్టుగా మీరు అధిక బరువు లేదా ఊబకాయం కలిగి ఉంటే, ఆ బరువును తగ్గించుకోవడం వలన మీరు స్లీప్ అప్నియా నుండి ఉపశమనం పొందడానికి సాయపడుతుంది. కానీ బరువు తగ్గడం మీకొక సవాలుగా ఉంటుంది. అందువలన మీరు బరువు తగ్గడానికి ఇతర చికిత్సలు అవసరం.



డా. శ్రీనివాస్ కిషోర్ సిస్లా
కన్సల్టెంట్ ఇ.ఎన్.టి. మరియు హెడ్ & నెక్ సర్జన్
స్టార్ హాస్పిటల్స్, రోడ్ నెం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్. ఫోన్: 040-44777700


## ఛత్తీస్‌గఢ్‌లో జవాన్ హత్య

### మావోయిస్టుల ఘాతుకం

**చర్ల రూరల్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఓ జవాన్‌ను అపహరించి దారుణంగా హత్య చేశారు. సుక్మా జిల్లా దోర్నపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. మావోయిస్టులు బుధవారం రాత్రి కడితి కన్నా అనే డీఆర్జీ జవాన్‌ను అపహరించి హత్య చేశారని ఎస్పీ శలభ్ సిన్హా తెలిపారు. గురువారం ఆర్గట్టా గ్రామ సమీపంలో జవాన్ మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలీసు బలగాలు ఆ ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయన్నారు.

## తపాలాశాఖ నుంచి ఉచిత డిజిటల్ లాకర్ సేవలు

**కోల్‌కతా:** తపాలాశాఖ దేశంలోనే తొలిసారిగా ఉచిత డిజిటల్ పార్సిల్ లాకర్ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో గురువారం ప్రయోగాత్మకంగా ఈసర్వీసును అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో వచ్చిన పార్సిల్‌ను వినియోగదారులు తమకు అనువైన సమయంలో తీసుకోవచ్చు. ఈవిధానంలో భాగంగా వినియోగదారుడి చిరునామా ఆధారంగా అతడికి ప్రత్యేక లాకర్ నంబర్‌ను ఇస్తారు. ఆ ఖాతాదారుడికి వచ్చిన లేఖలు, పార్సిళ్లను సంబంధిత డిజిటల్ లాకర్‌లో వేస్తారు. సదరు ఖాతాదారుడికి ఎస్సెమ్మెస్ పంపుతారు. సంబంధిత ఖాతాదారుడు వారం రోజుల్లో ఎప్పుడైనా ఆపార్సిల్ లేదా లేఖలను తీసుకునేందుకు లాకర్ ఉపకరిస్తుంది.



## ఖాదీ వాచీలు మాకు లేవా?

### లోక్‌సభలో గడ్కరీని కోరిన సభ్యులు

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో గురువారం ఖాదీ చేతి గడియారాల అంశం సభ్యుల మధ్య నవ్వులు పూయించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ లోక్‌సభ స్పీకర్ దంపతులకు ఇటీవల రెండు ఖాదీ వాచీలు ఇచ్చినట్టు చెప్పారు. దీంతో మాకు ఇవ్వారా? అంటూ ఇతర సభ్యులు గడ్కరీని అడుగడంతో నవ్వులు పూశాయి. ఈ వాచీలు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, టైటాన్ సంయుక్త భాగస్వామ్యంతో తయారవుతున్నట్టు గడ్కరీ చెప్పారు. సిల్వర్ ఫ్రేమ్‌లో.. ఖాదీతో తయారుచేసిన డయల్, దానిపై చరఖా చిహ్నం ఉంటాయన్నారు. వాచీ బెల్ట్ సైతం ఖాదీదేనన్నారు. మహిళలు తయారు చేస్తు న్న ఈ వాచీ విలువ రూ.5 వేలన్నారు. సభ్యులకు రాయితీపై అందజేస్తామన్నారు.

## ఒంటరితనంతో వృద్ధులకు ప్రమాదం

***లండన్:*** *ఏకాంత జీవితం గడిపే వృద్ధుల్లో ఒంటరితనం వల్ల కలిగే నష్టాలు ఎక్కువగా ఉంటాయని బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన మానసిక నిపుణులు నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ముఖ్యం గా 70 ఏండ్లు దాటిన పురుషుల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని వాళ్లు పేర్కొన్నారు. భావోద్వేగాలను సమతూకంతో స్వీకరించే వ్యక్తులపై ఒంటరితనం అంతగా ప్రభావం చూపదని, ఏకాంతంగా జీవించే మధ్య వయస్కుల్లో భిన్నమైన వ్యక్తిత్వం ఉంటుందని పేర్కొన్నారు.*

## జస్టిస్ మురళీధర్ బదిలీపై చర్యలు తీసుకోండి

**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మురళీధర్‌ను ఆగమేఘాల మీద రాత్రి సమయంలో బదిలీ చేయడాన్ని అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం తప్పుబట్టింది. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఓ లేఖ రాసింది. న్యాయమూర్తిని అకస్మాత్తుగా బదిలీ చేయడంపై చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరింది. కాగా ఢిల్లీలో మత ఘర్షణలు జరుగడానికి కొద్ది రోజుల ముందు విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన ముగ్గురు బీజేపీ నేతలపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ఇటీవల సంబంధిత కేసుపై విచారణ సందర్భంగా జస్టిస్ మురళీధర్ పోలీసులను ప్రశ్నించారు. మరుసటి రోజే ఫిబ్రవరి 26న బదిలీ చేశారు.

## ఏప్రిల్ 1 నుంచి కాగిత రహిత హాజరు

***న్యూఢిల్లీ:*** *ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏప్రిల్ 1 నుంచి కాగిత రహిత హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా గురువారం తెలిపారు. పరీక్షల ఫలితాలు, హాజరు రికార్డులను డిజిటలీకరించే ప్రక్రియ జరుగుతున్నదని, ఉపాధ్యాయులకు టాబ్స్‌ను త్వరలో అందజేస్తామని చెప్పారు.*



## తల్లి విచారంతో పిల్లల్లో కుంగుబాటు

**హ్యూసన్:** దైనందిన జీవితంలో తల్లిదండ్రులు ఎదుర్కొనే ఆందోళనలు వారి పిల్లలపైనా ప్రభావం చూపుతాయని ఓ అధ్యయనం వెల్లడించింది. తమ కారణంగానే తమ తల్లి విచారంగా ఉందని భావించే పిల్లల్లో కుంగుబాటు ఎక్కువగా ఉంటుందని అమెరికాలోని సౌతర్న్ మెథడిస్ట్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. అందరి చిన్నారుల్లో ఇవే లక్షణాలు ఉంటాయని చెప్పలేమన్నారు.



జాతీయ పౌర పట్టిక చేపట్టి మరో పది ప్రశ్నలు అడుగుతారు. దేనికైనా సంతృప్తికరమైన సమాచారం లేదనుకుంటే వారిని 'డీ లిస్ట్' (అనుమానిత జాబితా)లో పెడుతారు. వారినే లక్ష్యంగా చేసుకుంటారు. ఈ సీఏఏ ముస్లింలకు మాత్రమే వ్యతిరేకమైనది కాదు, పేదలకూ ప్రమాదకరమైనది.

**కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత**

జాతీయ పౌర పట్టిక సందర్భంగా ఎవరినీ ఏ సమాచారం కోసం ఒత్తిడి చేయం. ఇబ్బంది కలుగుతుందనుకున్న సమాచారాన్ని ఏ అధికారితోనూ పంచుకోవాల్సిన అవసరం లేదు. ఒక సమాచారం ఇవ్వనంతమాత్రాన పౌరులను 'డీ లిస్ట్'లో చేర్చబోం.

**అమిత్ షా, కేంద్ర హోం మంత్రి**



**చరిత్రలో నేడు**



1781

'యురేనస్' గ్రహాన్ని కనుగొన్న విలియం హెర్షెల్.

1877

'ఇయర్ ఫోన్స్'ను కనుగొన్న చెస్టర్ గ్రీన్‌వుడ్.





1933

నాజీ జర్మనీ ప్రభుత్వంలో సమాచార, ప్రచార శాఖ మంత్రిగా జోసెఫ్ గోబెల్స్.

ప్రపంచమంతా మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటూ ఉంటే, నేపాల్‌లోని కపిలవస్తులో ఒక 51 ఏండ్ల మహిళపై యాసిడ్ దాడి జరిగింది. చిన్న గొడవ ఈ యాసిడ్ దాడికి దారితీసింది. గతంలోనూ ఇటువంటి దాడులు జరిగాయి. యాసిడ్ దాడికి గురైన మహిళ జీవితాంతం ఆ ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. కొందరు బహిరంగంగా కనిపించరు. యాసిడ్ అమ్మకాలను నియంత్రించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. యాసిడ్ దాడికి పాల్పడిన వారికి కూడా కఠినమైన శిక్ష ఉండాలి.

**ది హిమాలయన్ టైమ్స్**

ఢాకాలోని రూపానగర్‌లో అగ్ని ప్రమాదం జరిగి 200 గుడిసెలు తగులబడ్డాయి. అదృష్టవశాత్తూ ప్రాణహాని జరుగలేదు. గుడిసె ప్రాంతాల్లో తరచూ ఇటువంటి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. గుడిసె ప్రాంతాల్లోకి మంటలార్పే యంత్రాలు రావడానికి తగినదారులు లేకపోవడం సమస్యగా ఉన్నది. దరిదాపుల్లో నీటి లభ్యత కూడా లేకపోవడం వల్ల స్థానికులు నిస్సహాయంగా చూస్తూ ఉండవలసి వస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా పేదల కోసం గృహ విధానాన్ని అమలుచేయాలి. పక్కా ఇండ్లు నిర్మించినట్టయితే, వారు భయపడుకుంటూ నిద్రించవలసి ఉండదు.

**ది డైలీ స్టార్**



# దుర్మార్గుడికి శిక్ష

దశాబ్దాల పాటు దాదాపు వంద మంది మహిళలపై లైంగికదాడికి పాల్పడిన హాలీవుడ్ దిగ్గజం వెయిన్‌స్టీన్‌కు రెండు కేసులలో 23 ఏండ్ల జైలు శిక్ష పడటంతో, 'తొడలు విరిగిపడిన దుర్యోధనుడి'లా ఆయన దీనాలాపన చేసిన దృశ్యాన్ని ప్రపంచమంతా గమనించింది. మాజీ ప్రొడక్షన్ అసిస్టెంట్ మిమి హలేయిపై లైంగికదాడి జరిపినందుకు, ఒకప్పటి వర్ధమాన నటి జెస్సికా మాన్‌పై లైంగికదాడికి పాల్పడినందుకు ఆయన 67 ఏండ్ల వయసులో జైలుశిక్ష అనుభవించవలసి వస్తున్నది. ఈ కేసులో వెయిన్‌స్టీన్ అప్పీలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, అపర కీచకుడిగా ఆయనపై పడిన ముద్ర మాత్రం చెరిగిపోనిది. 2017 అక్టోబర్‌లో లైంగికదాడుల ఆరోపణలు వచ్చిన తర్వాత ఆయనను చలనచిత్ర కళలు, శాస్త్రాల అకాడమీ నుంచి బహిష్కరించారు. ఇప్పుడు పడిన జైలుశిక్షే కాకుండా మరికొన్ని కేసుల్లో విచారణ సాగుతున్నది. ఆయన బారిన పడిన వారిలో ప్రముఖ తారామణులు కూడా ఉన్నారు. వెయిన్‌స్టీన్ మహిళల పట్ల అత్యంత హీనంగా వ్యవహరిస్తారని బహిరంగంగానే చెప్పుకునేవారు. టాక్ షోలలో మహిళలు ఆయన హోటల్ గదికి పిలిస్తే వెళ్ళవద్దంటూ హాస్యోక్తులు విసిరిన సందర్భాలున్నాయి. ఇంత నిర్లజ్జగా వ్యవహరించినా ఆయనపై ఏ ఒక్కరూ ధైర్యంగా నేరారోపణ చేయలేకపోయారు. హాలీవుడ్‌లో అగ్రశ్రేణి నిర్మాత అయిన వెయిన్‌స్టీన్‌ను ఎదిరించడమంటే తమ సినీ జీవితానికి చరమగీతం పాడినట్టేననే అభిప్రాయం ఉండేది. కానీ అనూహ్యరీతిలో ఒక్కొక్కరూ బయటకువచ్చి తాము అనుభవించిన క్షోభను వెళ్ళబోసుకోవడంతో వెయిన్‌స్టీన్ లీలలు సీరియల్ కథనంలా బయటకువచ్చాయి. తానెవరిపైనా లైంగికదాడి జరుపలేదని, వారి సమ్మతితోనే జరిగిందంటూ ఆయన చేసుకున్న సమర్థింపును ఎవరూ నమ్మడం లేదు.


**మీ టూ ఉద్యమం వల్ల మహిళలపై లైంగికదాడులు ఆగిపోతాయా? సమాజం మారిపోయిందా అనే ప్రశ్నలు కొందరిలో తలెత్తవచ్చు. హాలీవుడ్‌లో కూడా వేధింపులు, లోబరుచుకోవడం ఇక ముందు కూడా ఉండవచ్చు. కానీ మీ టూ ప్రభావం అసలే లేకుండా పోదు. అవకాశం దొరికిన వెంటనే మహిళలను వేధించడం మునుపటంత యథేచ్ఛగా సాగదని చెప్పవచ్చు. హాలీవుడ్‌లోని పలువురు ప్రముఖులు తమ ప్రాభవాన్ని కోల్పోవడానికి ఈ ఉద్యమం కారణమైంది. ఒక్క అమెరికాలోనే కాదు, ప్రపంచమంతటా, ఒక్క హాలీవుడ్‌లోనే కాదు అన్నిరంగాల్లో మహిళలను వేధిస్తే ఏ క్షణాన్నయినా అది బయటపడి మెడకు చుట్టుకోవచ్చుననే భయం కీచకుల్లో వ్యాపించింది.**


తనపై వచ్చిన ఆరోపణలు ప్రచురితం కాకుండా నిరోధించడానికి, ఆరోపణలు చేసే వారి నోరు నొక్కడానికి వెయిన్‌స్టీన్ ప్రైవేటు డిటెక్టివ్‌లను ఉపయోగించుకున్న తీరు కూడా బయటపడ్డది. తనపై ఆరోపణలు చేసే పాత్రికేయులు, మహిళల గతాన్ని తవ్వితీసి వారిని ఇబ్బందులు పెట్టడానికి ఆయన ప్రయత్నించాడు. కానీ తనపై వచ్చిన ఆరోపణల తీవ్రత ముందు నిస్సహాయుడైపోయాడు. వెయిన్‌స్టీన్ బాధితులే కాదు, ఇతరత్రా వేధింపులకు గురైనవారు కూడా తమ గోడు వెల్లడించడంతో 'మీ టూ' ఉద్యమం మొదలై ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. దాదాపు ఎనభై ఐదు దేశాల్లో మహిళలు ముందుకు వచ్చి తాము అనుభవించిన వేధింపులను ధైర్యంగా వెల్లడించడం మొదలుపెట్టారు. దీంతో ఆయా సంస్థల్లో వేధింపులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పలేదు. యురోపియన్ పార్లమెంటు కూడా వేధింపులపై చర్చ జరుపవలసి వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం- ప్రపంచవ్యాప్తంగా మూడో వంతు మహిళలు వేధింపులకు గురవుతున్నారు. 54 శాతం మహిళలు అవాంఛనీయమైన చేష్టలను ఎదుర్కొంటున్నట్టు 2017లో అమెరికాలోని ఒక వార్తా చానెల్, ఒక పత్రిక జరిపిన సర్వేలో తెలిసింది. 95 శాతం ఉదంతాల్లో దోషులకు శిక్ష పడటం లేదు. మహిళలను వేధిస్తుంటే మిగిలిన మగవారు చూస్తూ ఊరుకోకుండా, జోక్యం చేసుకోవాలనే అభిప్రాయాన్ని కూడా ఈ ఉద్యమం కలుగచేసింది. లైంగిక బాధితులు ఒంటరివారు కాదనీ, వేధింపులను బయటపెట్టడానికి సిగ్గుపడవలసిందేమీ లేదనీ ఒక ఉద్యమకారిణి ఎలుగెత్తి చాటారు. సాధారణంగా మహిళలపై వారికి తెలిసిన వారే వేధింపులకు దిగుతుంటారు. అందువల్ల నిర్భయంగా తిరస్కరించడాన్ని మహిళలకు చిన్నప్పటినుంచే అలవాటుచేయాలని ఆమె సూచించారు.

మీ టూ ఉద్యమం వల్ల మహిళలపై లైంగికదాడులు ఆగిపోతాయా? సమాజం మారిపోయిందా అనే ప్రశ్నలు కొందరిలో తలెత్తవచ్చు. హాలీవుడ్‌లో కూడా వేధింపులు, లోబరుచుకోవడం ఇక ముందు కూడా ఉండవచ్చు. కానీ మీ టూ ప్రభావం అసలే లేకుండా పోదు. అవకాశం దొరికిన వెంటనే మహిళలను వేధించడం మునుపటంత యథేచ్ఛగా సాగదని చెప్పవచ్చు. హాలీవుడ్‌లోని పలువురు ప్రముఖులు తమ ప్రాభవాన్ని కోల్పోవడానికి ఈ ఉద్యమం కారణమైంది. ఒక్క అమెరికాలోనే కాదు, ప్రపంచమంతటా, ఒక్క హాలీవుడ్‌లోనే కాదు అన్నిరంగాల్లో మహిళలను వేధిస్తే ఏ క్షణాన్నయినా అది బయటపడి మెడకు చుట్టుకోవచ్చుననే భయం కీచకుల్లో వ్యాపించింది. వేధింపులకు గురైన మహిళలు ముందుకువచ్చి చెప్పగలిగే మానసిక స్థైర్యాన్ని కూడా ఈ ఉద్యమం ఇవ్వగలిగింది. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది మహిళలు తమ దైన్యాన్ని ప్రపంచం దృష్టికి తేవడానికి మీ టూ ఉద్యమం దోహదపడ్డది. అన్నిరంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగిపోతున్న తరుణంలో వారికి తగిన భద్రత కల్పించవలసిన బాధ్యత సమాజం మీద ఉన్నది. 'మహిళలపై వేధింపులు' చర్చనీయాంశమైంది. మహిళలను గౌరవించాలనే భావనను సమాజంలో ప్రోది చేయగలిగినపుడు మాత్రమే ఈ సమస్యకు అసలైన అంతిమ పరిష్కారం లభిస్తుంది.

**జనగళం**

### బాధ్యతారహిత ప్రకటన

'కరోనా' వైరస్ యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్నది. ఈ వ్యాధి నుంచి తమ ప్రజలను రక్షించుకునేందుకు కరోనా ప్రభావిత దేశాలు అవిరళ కృషిచేస్తున్నవి. చైనాను తీసుకున్నట్లయితే అత్యాధునికమైన టెక్నాలజీతో పది రోజుల్లో వెయ్యి పడకల దవాఖానను నిర్మించుకొని కరోనా రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నది. ఇదిలా ఉంటే కరోనా వైరస్ ప్రభావం ఉన్న దేశాల నుంచి వచ్చే భారతీయులను కరోనా లక్షణాల్లేవని వైద్యులు నిర్ధారిస్తేనే దేశంలోకి అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటం హేయనీయం. కరోనా లక్షణాలున్న భారతీయుడు విదేశాల్లోంచి వస్తే వారికి మెరుగైన చికిత్స అందించి కాపాడుకోవాల్సింది పోయి కేంద్రం ఇలా బాధ్యతారహితంగా ప్రకటించటం విడ్డూరం.

**- మడిగ రామస్వామి, అంతారం, చేవెళ్ల**

### వెంటనే మరమ్మతులు చేయాలె

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రజలు తాగడానికి మంచినీళ్లు లేక ఎన్ని తిప్పలు పడ్డారో స్వయంగా చూసిన సీఎం కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 'మిషన్ భగీరథ' పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పుడు మారుమూల గ్రామాలకు కూడా 'మిషన్ భగీరథ' నీరు అందుతున్నది. అయితే అక్కడక్కడా 'మిషన్ భగీరథ'పైపులు లీకేజీ అయి చుక్కచుక్కా ఒడిసి పట్టుకున్న నీళ్లు రోడ్డు పాలవుతున్నాయి. కాబట్టి సంబంధిత అధికారులు లీకేజీ పైపులకు వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- చుంచు అరుణ్‌కుమార్, వెల్గనూర్, మంచిర్యాల జిల్లా**

### కల్తీని అరికట్టాలె

నగరాల్లోని హోటళ్లలో ప్రతి నిత్యావసర వస్తువులో కల్తీ రాజ్యమేలుతున్నది. పాల నుంచి మొదలు వంటనూనె వరకు కల్తీ వస్తువులు తయారు చేస్తున్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు కల్తీని అరికట్టి కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజల ప్రాణాలను రక్షించినవారమవుతాం.

**- జవ్వాజి సుధాకర్, కురిక్యాల, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

అంతర్జాతీయం



**క్రిస్ చేకూరి**

# వివక్షకు వికృత రూపం

నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి ప్రయాణికులతో కూడిన గ్రాండ్‌ప్రిన్సెస్ నౌక ఓక్‌లాండ్ డాక్‌యార్డ్‌లో నిలిచి ఉన్నది. అది కాలిఫోర్నియా నుంచి వ్యాధిగ్రస్థులైన కొందరితో వచ్చింది. కరోనా వైరస్ సోకిన వారిని నౌకను దిగడానికి ముందు పరీక్షించి తగు చికిత్సలు, మందులు ఇవ్వవలసిన ఆవశ్యకత ఏర్పడింది. స్థానిక అధికారులు ఓడలోని వారికి ఇచ్చేందుకు ఔషధాలను విమానం ద్వారా తరలించాల్సి ఉన్నది. కానీ ట్రంప్ అధికారగణం మాత్రం వారికి వైద్యసాయం అందించటంలో తగురీతిలో స్పందించిన దాఖలాలు కనిపించలేదు.

అమెరికా అభివృద్ధి, ముందుచూపు, చాతుర్యం, నైపుణ్యాల గురించి ఎంతో పేరున్నది. రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో అమెరికా సాధించిన విజయాలు, శాస్త్ర సాంకేతికరంగాల్లో పురోగతి ఘనమైనవి. అంతరిక్షం మొదలుకొని సమస్తరంగాల్లో అమెరికాకు ఏ దేశం సాటి లేదనేది వాస్తవం. అయినా అమెరికా సాధించిన విజయాల్లో కూడా కొన్ని ఖాళీలున్నాయని వియెత్నాం యుద్ధంలో ఓడిపోయిన తర్వాత తెలిసివచ్చింది. అప్పటినుంచి అమెరికా ఘనతను పునర్నిర్వచించటం మొదలైంది. ఇటీవలికాలంలో అమెరికాను పీడిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు అమెరికా పరిమితులను చాటిచెబుతున్నాయి. వరదలు, హరికేన్లు, టోర్నడోలు అమెరికాను అతలాకుతలం చేస్తున్న తీరు అమెరికా సాధించిన ఘనత, అభివృద్ధిని వెక్కిరించే విధంగా ఉంటున్నది.

గతంలో ఎదుర్కొన్న అనేక సమస్యలను అమెరికా తనదైన శైలిలో పరిష్కరించుకున్నది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అణ్వాయుధాల తయారీలో ముందడుగువేసి ప్రపంచం ముందు నిలిచింది. భూకంపాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అమెరికా అనేక ముందస్తు చర్యలు తీసుకున్నది. అగ్ని ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సంరక్షణ చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్స్ కూడా నిరంతరం నిర్వహిస్తారు. బయటినుంచి చూసేవారికి అమెరికా తీసుకుంటు న్న ముందస్తు జాగ్రత్తలు చూస్తే అబ్బురమనిపిస్తుంది. పాఠశాల నుంచి వివిధ సంస్థల దాకా పటిష్ట రక్షణ చర్యలు తీసుకుంటారు. అణ్వాయుధ దాడి మొదలుకొని వాతావరణ మార్పుల కారణంగా తలెత్తే వైపరీత్యాల దాకా అమెరికా దేనినైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉంటుంది. కానీ.. ప్రస్తుత కోవిడ్-19 విషయమై అమెరికా తీసుకున్న ముందస్తు చర్యలను గమనిస్తే ఏ మాత్రం సిద్ధంగా, క్రియాశీలంగా లేదని తెలుస్తుంది. కరోనా వైరస్ విషయంలో స్థానిక పాఠశాల యాజమాన్యం మొదలు శ్వేతసౌధం దాకా ఘోర వైఫల్యం కనిపిస్తున్నది. చైనా గత రెండు నెలలుగా కరోనాను ఎదుర్కోవటం కోసం చేస్తున్న పోరాటం, ప్రయత్నాలు కండ్ల ముందు కనపడుతున్నా, అమెరికా కనీసంగా ముందుజాగ్రత్త వహించలేదు. ఈ వైఫల్యం మనకేం చెబుతున్నది!

నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి ప్రయాణికులతో కూడిన గ్రాండ్‌ప్రిన్సెస్ నౌక ఓక్‌లాండ్ డాక్‌యార్డ్‌లో నిలిచి ఉన్నది. అది కాలిఫోర్నియా నుంచి వ్యాధిగ్రస్థులైన కొందరితో వచ్చింది. కరోనా వైరస్ సోకిన వారిని నౌకను దిగడానికి ముందు పరీక్షించి తగు చికిత్సలు, మందులు ఇవ్వవలసిన ఆవశ్యకత ఏర్పడింది. స్థానిక అధికారులు ఓడలోని వారికి ఇచ్చేందుకు ఔషధాలను విమానం ద్వారా తరలించాల్సి ఉన్నది. కానీ ట్రంప్ అధికారగణం మాత్రం వారికి వైద్యసాయం అందించటంలో తగురీతిలో స్పందించిన దాఖలాలు కనిపించలేదు. దీంతో ఓడలోని కరోనా బాధిత ప్రయాణికులు ప్రభుత్వ నిర్లక్ష్యానికీ బలయ్యే పరిస్థితి ఏర్పడింది. రోగగ్రస్థులంతా ఓడలోని గదుల్లోనే పరీక్షల కోసం ఎదురుచూశారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ ప్రమాదాన్ని ఎదుర్కొనే సంసిద్ధత లేదు. దీంతో దేశవ్యాప్తంగా ఒకదాని తర్వాత ఒకటి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు మూతపడ్డాయి. ఇతర దేశాలు ముఖ్యంగా ఇటలీ, దక్షిణకొరియాలో ఉన్న కుటుంబ సభ్యులు, మిత్రుల నుంచి చాలా విషాదకరమైన వార్తలు సామాజిక మాధ్యమాల ద్వారా వింటున్న స్థితి ఏర్పడింది.

కరోనా వైరస్ విస్తరణ అమెరికా సమాజంలోని అసమానతలను, లొసుగులను బహిర్గతపరిచింది. సిలికాన్‌వ్యాలీలోని ఉద్యోగులు, కులీన నగరవాసులంతా తమ పనులను ఇండ్లనుంచే చేసుకోవటం ప్రారంభించారు. అభివృద్ధి చెందిన టెక్నాలజీ వెబ్-2.0 సాయంతో పనులు జరుగుతున్నాయి. అమెజాన్, గూగుల్ ఇంకా ఇతర కార్పొరేట్ కంపెనీలన్నీ తమ ఉద్యోగులను తమ ఇండ్లనుంచే పనులు చేయాలని ఆదేశించాయి. విద్యార్థులకు ఆన్‌లైన్ బోధనలు జరుగుతున్నాయి. నీవు విజ్ఞానవంతుడివైతే నీకు పని చేయడానికి ఎప్పటికీ అవకాశం ఉంటుందని చెప్పే అమెరికాలో ఇప్పుడున్న పరిస్థితి ఇది. ఒకవేళ నీకు ఉన్నతవర్గాలకున్న సౌకర్యం లేకపోతే.., నీవు నీ జీవనభృతి కోసం రోడ్డెక్కాల్సి వస్తే వైరస్‌తో సహజీవనం చేయాల్సిందే. ఎస్ఎఫ్ అఖాతం ప్రాంతంలో వేలాదిమంది కనీస పారిశుద్ధ్యం లేక అవస్థలు పడుతున్నారు. విస్తారంగా ఉన్న కార్మికులు, ఇతర పనులు చేసకునేవారూ పనికి దూరంగా ఉండలేక జీవన్మరణ స్థితిని ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు తమ కార్యకలాపాలను నిలిపేస్తే, తమ వద్ద పనిచేసే వారికి దిన కూలీలు చెల్లించలేని స్థితి ఏర్పడింది. నిర్మాణ, రవాణా రంగాల కార్మికులు, చిల్లర వ్యాపారులు అనివార్యంగా పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఉన్నది. జిల్లా, ప్రాంతీయ అధికారులు పాఠశాల విద్యార్థులను ఇండ్లకే పరిమితం కావాలని కోరారు. ఒక పాఠశాలలు మాత్రమే కాదు, దవాఖానలతో సహా ప్రభుత్వరంగంలోని ప్రతి సంస్థ మూతపడింది. న్యూయార్క్ నగరంలోని అనాథలైన వేలాది మంది పాఠశాల విద్యార్థులు స్కూళ్లలో ఒక పూట తిండితో బతుకులు వెళ్ళదీస్తున్నారు. ఈ విద్యార్థులను గాలికివదిలేసి అధికారులు తమ దారిన తాము వెళ్లిపోయారు. నిజానికి ఇలా వ్యవహరించినందుకు, విద్యార్థులకు కనీస వైద్య సాయం అందించనందుకు ట్రంప్ వారిని తగిన విధం గా శిక్షించాలి.




అమెరికాలో జరిగిన వైద్యరంగ, జీవిత బీమా రంగాల ప్రైవేటీకరణ కారణంగా ఏర్పడుతున్న దుష్పరిణామాలు రాబోయేకాలంలో మరింత వికృతంగా ఉండబోతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా బీమా లేని వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఒక కాలిఫోర్నియా నగరాన్నే తీసుకుంటే దక్షిణ అమెరికా నుంచి వలసవచ్చిన వారిలో 40 శాతం మందికి ఎలాంటి వైద్య సదుపాయం అందించే భద్రత లేదు.


అమెరికాలో జరిగిన వైద్యరంగ, జీవిత బీమా రంగాల ప్రైవేటీకరణ కారణంగా ఏర్పడుతున్న దుష్పరిణామాలు రాబోయేకాలంలో మరింత వికృతంగా ఉండబోతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా బీమా లేని వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఒక కాలిఫోర్నియా నగరాన్నే తీసుకుంటే దక్షిణ అమెరికా నుంచి వలసవచ్చిన వారిలో 40 శాతం మందికి ఎలాంటి వైద్య సదుపాయం అందించే భద్రత లేదు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినా దాని ఆసరాగా దండుకునే వారే ఎక్కువయ్యారు కానీ, బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే వారు కరువయ్యారు. అమెరికా ప్రభుత్వంలోని అనేక రంగాలు, వ్యవస్థలు ప్రైవేటుపరమై, వాటి నుంచి ప్రజలకు కష్టకాలంలో అందాల్సిన సేవలు అందకపోగా, ప్రభుత్వ ధనమంతా ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి పోతున్నది. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాలు కూడా ప్రైవేటుపరం చేసిన తీరు అమెరికాలోనే గాక, ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఈ నేపథ్యం లో కోవిడ్-19ను కట్టడి చేయటానికి బదులుగా, ప్రైవేటురంగం గత ఆచరణకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాల్లో మునిగి ఉన్నది.

ఈ విషాద గాథ ఇలా ఉంటే, అమెరికాలోని భిన్న సామాజిక సమూహాల జీవనం మరింత బాధాకరమైనది. ఉదారవాద పరిశీలకులు కూడా ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ట్రంప్ నిర్లక్ష్యానికి మరో కోణం కూడా ఉన్నది. ఎన్నికల్లో లబ్ధి కోసమే వ్యూహాత్మకంగానే ట్రంప్ ప్రభుత్వం వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలున్నాయి. ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి రాబోయే అధ్యక్ష ఎన్నికల కోసం లెక్కలేసుకుంటున్నది. క్రిస్టియన్ సమూహాల ఓట్ల కోసం ప్రణాళికాబద్ధ నిర్లక్ష్యానికి పూనుకుంటున్నది.

మొత్తం మీద కన్సర్వేటివ్‌లు, క్రిస్టియన్ మత బోధకులు కరోనా వైరస్‌ను త్వరలోనే కట్టడి చేస్తామని చెబుతున్నారు. ఒక మతబోధకుడైన క్రిస్టియన్ ఫాదర్ అయితే.. ప్రపంచంలో పతనమైన లైంగిక జీవనం ఫలితమే ఈ వైరస్ అని చెప్పుకొస్తున్నారు. మరికొందరు ఆశాజీవులు ఇది దైవదత్తం కాదంటున్నారు. మరొకరైతే ఇజ్రాయిల్‌కు తగురీతిన సాయంగా నిలిస్తే ఈ దుస్థితి వచ్చేది కాదని చెబుతున్నారు. మరొక జ్యోతిష్కుడైతే.. గర్భవిచ్ఛిత్తి విషయంలో ట్రంప్ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటే కరోనా వచ్చేదికాదని చెబుతున్నాడు.

ముఖ్యమైన విషయమేమంటే.. ట్రంప్ నోటి నుంచి వచ్చే మాటలే ఆ సమాజం నుంచి వస్తున్నాయి. మైనారిటీలకు వ్యతిరేకంగా క్రిస్టియన్ జాతీయవాదం ఎలా ఉంటుందో, ఎలా మాట్లాడుతుందో వ్యక్తమవుతున్నది. వివిధ సామాజిక సమూహాలు, మైనారిటీలు, వలసజీవులు, స్త్రీలు, ప్రజాస్వామికవాదుల పట్ల ట్రంప్ వ్యతిరేక వైఖరిని చాటుకుంటున్నారు. ఒబామా కాలంలో కూడా జ్యోతిష్కులు ఎబోలా వైరస్, ఆఫ్రికా జాతికి చెందిన వ్యక్తిపాలన మూలంగానే వచ్చిందని చెప్పుకొచ్చారు. ఇలాంటివెన్నో కథనాలు అమెరికా సంపన్న కన్సర్వేటివ్ వర్గాల్లో ప్రచారంలో ఉన్నాయి.

అమెరికా ప్రభుత్వం తరపున కోవిడ్-19ను నివారించటానికి బాధ్యత వహిస్తున్న ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ స్వయంగా సంప్రదాయ క్రిస్టియన్. ఇతను ఇప్పటివరకు విస్పష్ట ప్రకటన చేయలేదు. వైరస్ విస్తరణను అడ్డుకోవటం కోసం, బాధితులకు సరైన వైద్యం అందించటం కోసం చాలినంతగా ప్రయత్నిస్తున్న దాఖలాలు కనిపించకపోవటం ఆశ్చర్యకరం. ఈ క్రమంలో అమెరికా శాస్త్రవేత్తల అశక్తత సర్వ త్రా కనిపిస్తున్నది. ఈ సంక్షోభం అమెరికా సమాజానికి సంబంధించినది మాత్రమే కాదు, మొత్తం ఆధునిక సమాజానిది. మన ఆధునికాభివృద్ధి, శాస్త్రసాంకేతిక రంగాలది కూడా. ప్రకృతి వనరులను విస్తారంగా కొల్లగొట్టడం కారణంగా తలెత్తిన విపత్తు. ఈ ధోరణిని విడనాడకుంటే.. మనం మళ్లీ తిరిగిరాని ప్రమాద తీరాలకు చేరుకుంటాం.

**(వ్యాసకర్త: చరిత్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ)**

# ప్రగతి పట్టణం

తెలంగాణం



**ప్రొఫెసర్ తాటికొండ రమేశ్**

తెలంగాణ రాష్ట్రం పసికందు అయితేనేమి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశం నివ్వెరపోయే విధంగా అగ్రగామిగా నిలబడుతున్నది. రాష్ట్రం సాధించుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతిపక్ష పార్టీలు కేసీఆర్ ప్రభుత్వంపై అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తూ అభివృద్ధికి, సంక్షేమానికి, సుపరిపాలనకు అడుగడుగునా అవరోధాలు కల్పిస్తూ బురదజల్లుతున్నాయి. ఏ కార్యక్రమమైనా మొకాలొడ్డటమే కానీ, నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వలేకపోతున్నాయి. దృఢమైన మనసులు, సృజనాత్మక ఆలోచనల గురించి చర్చిస్తాయి. బలహీన మనస్సులు వ్యక్తుల గురించి మాత్రమే చర్చిస్తాయని ప్రముఖ గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ అన్న మాటలు ఈ సందర్భంగా మననం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. సృజనాత్మక చింతనే కాకుండా వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, సాహసోపేతంగా వాటిని అమలుపర్చడంలో ఆయనకు ఆయనే సాటి. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా గతంలో నిర్వహించిన 'పల్లె ప్రగతి' కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. దాని స్ఫూర్తి గా రాష్ట్రంలో మొదటి దఫాగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు చేపట్టిన 'పట్టణ ప్రగతి' కార్యక్రమం విజయవంతమైంది.

దేశంలో పలు మహా నగరాలు, పట్టణాలు వాయు, శబ్ద కాలుష్యంతో, బస్తీలు, ఇరుకైన రోడ్లు, ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు కరువై పట్టణవాసులకు జీవనం దుర్లభంగా మారింది. తెలంగాణలో పట్టణీకరణ శరవేగంగా పెరుగుతున్నది. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 42.6 శాతం ప్రజలు నగరాల్లో జీవిస్తున్నారని 2023 నాటికి ఇది 50 శాతం దాటుతుందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో పెట్టుకొని పట్టణాల్లో పారదర్శకమైన పాలన కోసం, 128 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్ల కోసం నూతన తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019 తీసుకొచ్చారు. దాన్ని అక్షరాల అమలుపరుచడానికి పది రోజుల పట్టణ ప్రగతిని చేపట్టారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఒక మంచి పట్టణం ఎలా ఉండాలనే అంశంపై సంపూర్ణ అవగాహన ఉన్నది. ప్రతిరోజు చెత్తను, మురుగునీటిని నిర్మూలించి పరిశుభ్రంగా ఉంచడం, శుద్ధమైన మంచినీటి సరఫరా జరుగడం, రాత్రుల్లో వీధిలైట్లు వెలుగులు వెదజల్లడం లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే రహదారులపై గుంతలు ఉండకుండా చూసుకోవడం, పట్టణాల్లో పచ్చదనం పెంచడం, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికలు, సమీకృత మార్కెట్లు, యువతకు క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు ఇవన్నీ ఉంటేనే అది మంచి పట్టణం అవుతుందనేది కేసీఆర్ భావన. ఈ ఆలోచనలకు అనుగుణంగానే పట్టణ ప్రగతి కార్యక్రమం ముఖ్యంగా ఐదు అంశాలపై కేంద్రీకరించారు. 1.పారిశుధ్య నిర్వహణ 2.హరిత ప్రణాళిక, 3.విద్యుత్ సరఫరా 4. నగరస్థాయి ప్రణాళికలు, చర్యలు, 5.అక్రమ లేఔట్‌ల గుర్తింపు తదితరాలున్నాయి.

పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలిగించడం, మురుగు కాల్వలను శుభ్రపరుస్తూ మురుగునీరు నిల్వ లేకుండా ప్రవహించేరీతిగా చర్యలు తీసుకున్నారు. దుర్వాసన, ఈగలు దోమల బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడుతున్నారు. ఆరోగ్యం కోసం పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల కూల్చివేత, పబ్లిక్ మూత్రశాలల మరమ్మతులు, నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించేందుకు, పారిశుధ్య నిర్వహణకు 3100 వాహనాలు అవసరమని నిర్ధారించి, ఇప్పటికే అందుబాటులో ఉన్న 600 వాహనాలకు మరో 2,500 వాహనాల కొనుగోళ్లకు అనుమతులు ఇచ్చారు. పారిశుధ్య నిర్వహణతో పాటుగా కాలుష్య నివారణ కూడా తప్పనిసరి. ఇంటింటికి విధిగా మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. పది రోజులుగా కొనసాగిన 'పట్టణ ప్రగతి' కార్యక్రమంలో హరిత ప్రణాళిక వంద శాతం విజయవంతమైందని ప్రజలు సంతోషిస్తున్నారు.




పట్టణాల్లో అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలు, రోడ్లపక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు జరిగి, ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా విద్యుత్ వ్యవస్థను బాగు చేస్తున్నారు. రానున్న 8 నెలల్లో ప్రమాద రహిత విద్యుత్ సరఫరాను పట్టణాల్లో ఉండేవిధంగా అధికారులను కేటీఆర్ పురమాయించారు.


పట్టణాల్లో అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలు, రోడ్లపక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు జరిగి, ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా విద్యుత్ వ్యవస్థను బాగు చేస్తున్నారు. రానున్న 8 నెలల్లో ప్రమాద రహిత విద్యుత్ సరఫరాను పట్టణాల్లో ఉండేవిధంగా అధికారులను కేటీఆర్ పురమాయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నిర్దిష్టమైన ప్రదేశాల్లో పార్కింగ్ సదుపాయలు కల్పిస్తున్నారు. అన్ని పట్టణాల్లో ఉద్యాన వనాల, క్రీడాస్థలాల ఏర్పాటు, ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవుని, మానసిక, శారీరక ఆరోగ్య రక్షణకు వీటి అవసరం ఎంతో ఉన్నది. అందుకే ఇప్పటికే హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి పట్టణాల్లో వీటిని ఏర్పాటుచేశారు. గతంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పట్టణప్రగతిలో గుర్తించారు. రోడ్ల సుందరీకరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం పెంపొందించడం జరిగింది.

'ఈచ్ వన్ టీచ్ వన్' కార్యక్రమానికి అనుగుణంగా పట్టణప్రగతిలో ఇంటింటికీ సర్వే నిర్వహించి నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా మార్చేందు కు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వాధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో, ఉద్యోగ నిబద్ధతతో పని చేసినట్లయితే ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయి. నూతన మున్సిపాలిటీ చట్టంలో పేర్కొన్నట్లు ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో 50 శాతం పనులను పూర్తిచేసి పైసా ఖర్చులేకుండా పట్టణాలకు మహర్దశను తీసుకురావచ్చు. నూతన మున్సిపల్ చట్టం-2019లో నిర్దేశించిన లక్ష్యాలకు, గమ్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ 'బంగారు తెలంగాణ' స్వప్నం త్వరలోనే సాకరమవుతుంది.

**(వ్యాసకర్త: డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, కేయూ)**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## ● ఘనంగా నృసింహుడి ఉత్తర దిగ్యాత్ర



జగిత్యాల జిల్లా ధర్మపురి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను ఉత్తర దిగ్యాత్రలో భాగంగా ఉత్తరాన ఉన్న ఉసిరిక వాగు వద్దకు సేవలను తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. - ధర్మపురి, నమస్తేతెలంగాణ



వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు. (ఇన్‌సెట్‌లో) శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# నయనానందం

### వైభవంగా ఆదిదంపతుల కల్యాణం

**వేములవాడ కల్చరల్ :** వేములవాడ రాజన్న ఆలయంలో గురువారం ఆదిదంపతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, వేలాది మంది శివపార్వతులు, శివనామస్మరణల మధ్య స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆగమశాస్త్ర ప్రకారం సంప్రదాయ పద్ధతిలో ఆద్యంతం సాగిన ఈ కల్యాణ తంతును శివపార్వతులు, భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. ముందుగా ఆలయ అర్చకులు ధ్వజారోహణ కార్యక్రమం, ధ్వజం వద్ద వృషభేశ్వరునికి కల్యాణం చేసిన అనంతరం శూలానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు భాగంలో భక్తుల నీరాజనాల మధ్య ఎదుర్కోలు నిర్వహించారు. ఉదయం 10.50 నిమిషాలకు అభిజిత్ లగ్న సుముహూర్తమున కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూల నుంచి 60 వేలకు పైగా శివపార్వతులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.



## ● అంగన్‌వాడీలో కలెక్టర్ భోజనం



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కిష్టాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించిన కలెక్టర్ వీపీ గౌతమ్, ఐటీడీఏ పీవో హన్మంత్ కొండిబా చిన్నారులతో కలిసి భోజనం చేశారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. -కొత్తగూడ

## ● కరోనా ఎఫెక్ట్.. కోళ్లు ఫ్రీ



కరోనా వైరస్ వస్తుందన్న వదంతుల నుంచి బయటపడేందుకు పౌల్ట్రీ నిర్వాహకులు కోళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గురువారం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం రామాపురంలో పౌల్ట్రీ యజమాని నూకల రామసూర్యప్రకాశ్ దాదాపు 6 వేల పైచిలుకు కోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. రామాపురంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి కోళ్లను తీసుకెళ్లారు. - మేళ్లచెర్వు

# వర్షార్పణం

### పసుపు పంటకు అపార నష్టం

- తడిసిన కందులు, వరి
- ఆసిఫాబాద్, సిద్దిపేట జిల్లాల్లో పిడుగులు
- పలుచోట్ల వడగండ్ల వాన

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. ఫలితంగా గురువారం సాయంత్రం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో పసుపు పంటకు తీరని నష్టం వాటిల్లింది. ఆయా జిల్లాల్లో కందులు, వరి పంటలు తడిశాయి.

**వాంకిడిలో వడగండ్లు**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో గురువారం వడగండ్ల వాన పడింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన వర్షం 40 నిమిషాలపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. మురికి కాల్వలు నిండటంతో పలు ఇండ్లలోకి వరద చేరింది. సిర్పూర్(టి) మండల కేంద్రంలో సుమారు గంటపాటు ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. కేశవపట్నంలో తాటి చెట్టుపై పిడుగుపడింది.



ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో పడ్డ వడగండ్లు

**తడిసి ముద్దయిన పసుపు**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో గురువారం సాయంత్రం వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాల వద్ద సిద్ధం చేస్తున్న పసుపు, యార్డులో నిల్వ చేసిన పసుపు తడిసిపోయింది. అసలే ధరలు అంతంతమాత్రంగా ఉండగా, ఎండిన పసుపు తడవడంతో నాణ్యత తగ్గి ధర మరింత పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ యార్డులో దాదాపు సుమారు రూ.కోటి విలువ చేసే పసుపు ఉన్నట్టు అధికారులు అంచనావేశారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో ఓ మోస్తరు వర్షం కురవగా.. పసుపు తడిసిముద్దయింది. పసుపు కల్లాల్లోకి వర్షపునీరు చేరింది. నల్లవెల్లిలో దాదాపు 25 మంది రైతులకు చెందిన ఆరబెట్టిన పసుపు తడిసిపోయింది. సిరికొండ మండల కేంద్రంతోపాటు రావుట్ల, జగదాంబ తండా, కొండూర్, చీమన్‌పల్లి గ్రామాల్లో అకాల వర్షంతో పొట్ట దశలో ఉన్న వరికి నష్టం వాటిల్లింది. ధర్పల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోనూ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, కరెంటు స్తంభాలు ఒరిగిపోయాయి. మిరుదొడ్డి మండలం భూంపల్లికి వెళ్లే మార్గంలో భారీ వృక్షం కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పిడుగుపాటుకు కొండపాకలో ఎద్దు మృత్యువాతపడింది. గజ్వేల్ మార్కెట్ యార్డులో ఆరబోసిన కందులు తడిసిపోయాయి. గురువారం రాత్రి కరీంనగర్ జిల్లా చొప్పదండి, రామడుగు మండలాలతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో ఓ మోస్తరు వర్షం కురిసింది.



గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో వర్షపు నీటిలో నుంచి పసుపు కొమ్ములను ఎత్తుతున్న మహిళలు

## ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు కేవీ కన్నుమూత



సత్యనారాయణ(ఫైల్)

**హాలియా, నమస్తేతెలంగాణ:** రాజకీయ కురువృద్ధుడు, ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు కేవీ సత్యనారాయణ (91) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న కేవీ నల్లగొండ జిల్లా హాలియాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1929లో పశ్చిమగోదావరి జిల్లా అంకంపాలెంలో జన్మించిన కేవీ సత్యనారాయణ ఆంధ్రా యూనివర్సిటీలో కొంతకాలం ఎకానామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1960లో కేంద్రం ఏర్పాటు చేసిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ అధ్యయన కమిటీలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. 1962లో అధ్యాపక వృత్తికి రాజీనామా చేసిన రాజకీయాల్లోకి వచ్చారు. అనంతరం నల్లగొండ జిల్లా అనుముల మండల కేంద్రంలో వ్యవసాయం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. 1984 నుంచి 1988 వరకు ఏపీపీఎస్సీ సభ్యుడిగా పనిచేశారు. కేవీ అంత్యక్రియలు శుక్రవారం అనుముల గ్రామంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## సర్పంచ్ సస్పెన్షన్

**పెద్దమందడి:** విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బుగ్గపల్లి తండా సర్పంచ్ కవితను గురువారం కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాషా ఆరు నెలలపాటు సస్పెండ్ చేశారు. అభివృద్ధి పనులను పరిశీలించకపోవడం, స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో నివాసం ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు విడుతల్లో చేపట్టిన పల్లెప్రగతిలో పాల్గొనకపోవడం, ఇష్టానుసారంగా వ్యవహరించినందుకు నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## చల్లగరిగె సర్పంచ్‌కు మెమో జారీ

**చిట్యాల:** పల్లెప్రగతిలో భాగంగా పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించనందుకు జయశంకర్ భూపాలపల్లి చిట్యాల మండలం చల్లగరిగె సర్పంచ్ కర్రె మంజులకు కలెక్టర్ మహ్మద్ అబ్దుల్‌అజీం మెమో జారీ చేశారు. గురువారం కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. పల్లెప్రగతిలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఎస్సీ కాలనీలో వాటర్‌ట్యాంక్ వద్ద పేరుకుపోయిన మురుగునీటిని చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించనందుకు సర్పంచ్ మంజులకు మెమో జారీ చేశారు. అలాగే, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఎంపీడీవో నాగలక్ష్మి, ఎంపీవో శంకర్రావు, చల్లగరిగె పంచాయతీ కార్యదర్శి బాబురావు, అలాగే పశుసంవర్ధక శాఖ ఏడీ కుమారస్వామికి మెమోలు జారీ చేశారు.

## ● మత్స్యగిరిపై వైభవంగా విగ్రహప్రతిష్ఠాపన



యాదాద్రి భువనగిరి జిల్లా వెంకటాపురంలోని మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి ధ్వజస్తంభ, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ కేశిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు పట్టువస్ర్తాలను అందజేశారు. - వలిగొండ

## ● డీజిల్ ట్యాంక్ పేలి.. పసుపు లారీ దగ్ధం

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో గురువారం తెల్లవారుజామున పసుపుతో వెళ్తున్న లారీ దగ్ధమైంది. డీజిల్ ట్యాంక్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. లారీతోపాటు దాదాపు 350 పసుపు సంచులు దగ్ధమయ్యాయి. వాటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు. - ముప్కాల్





పాలమూరు డీసీసీబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో చైర్మన్ నిజాంపాషా

## సహకార సంఘాల బలోపేతానికి కృషి

### ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సహకార సంస్థలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కొత్తగా ఎన్నికైన సహకార సంఘాల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు కృషిచేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీబీ మేనేజింగ్ కమిటీ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న విధానాలు, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని పని చేయాలని సూచించారు. ఈనెల 27తో మహబూబ్‌నగర్ డీసీసీబీ వందేండ్లు పూర్తవుతుందన్న సందర్భంగా వేడుకల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా, వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### జమ్ముకశ్మీర్ పోలీసుల అదుపులో

## కుస్తాపూర్ యువకుడు



సరికెల లింగన్న

**జగిత్యాల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** ఐఎస్‌ఐ తీవ్రవాదులకు సాయంచేసిన వ్యక్తికి డబ్బులు పంపించాడన్న ఆరోపణలతో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన సరికెల లింగన్నను గురువారం తెల్లవారుజామున జమ్ముకశ్మీర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జమ్ముకశ్మీర్‌లోని అర్నియా పీఎస్ పరిధిలోగల ఓ ఆర్మీ క్యాంప్‌లో అదే రాష్ట్రానికి చెందిన రాకేశ్‌కుమార్ కూలి పనిచేస్తున్నాడు. అనిత అనే ఐడీ పేరుతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తితో రాకేశ్‌కుమార్ కొన్నిరోజులు చాటింగ్ చేశాడు. తాను జర్నలిస్టునని.. ఆర్మీ క్యాంప్‌లో ఉన్న వస్తువులు, వాహనాలు, ప్రదేశాల ఫొటోలు పంపితే.. వాటిని వార్తలుగా ఇస్తామని అనిత ఐడీతో ఉన్న వ్యక్తి రాకేశ్‌కుమార్ చెప్పాడు. ఇందుకోసం అతని బ్యాంక్ అకౌంట్‌లో రూ.27 వేల నగదు జమ చేశాడు. అనంతరం సైనికుల శిబిరాలు, తదితర వివరాలు, ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఆర్మీ అధికారులు గుర్తించి ఐఎస్‌ఐకు సమాచారం చేరవేస్తున్నాడన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో రాకేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతని బ్యాంక్ ఖాతాను తనిఖీ చేయగా.. జగిత్యాల జిల్లా కుస్తాపూర్ యువకుడు లింగన్న గూగుల్ అకౌంట్ నుంచి రూ.12 వేలు రాకేశ్‌కుమార్ ఖాతాలోకి బదిలీచేసినట్టు గుర్తించి.. విచారణ కోసం అరెస్ట్ చేసి తీసుకువెళ్తున్నట్టు అర్నియా ఎస్సై తెలిపారు.

# మృత్యు శకటాలు

- బైక్‌ను ఢీకొట్టి ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ
- జడ్చర్లలో ముగ్గురు దుర్మరణం
- కాజీపేట సమీపంలో మరో ప్రమాదం.. ఇద్దరు మృతి





జడ్చర్ల సమీపంలో ఇంటిని ఢీకొని బోల్తాపడిన లారీ. (ఇన్‌సెట్‌లో) మృతులు రఫీయొద్దీన్, మల్లయ్య, బంగారయ్య (ఫైల్)

**జడ్చర్ల రూరల్ /మడికొండ:** అతివేగంతో దూసుకొచ్చిన లారీలు మృత్యుశకటాలుగా మారాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ముగ్గురిని, వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట సమీపంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరిని పొట్టనబెట్టుకున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని కర్నూల్ నుంచి పనసపండ్ల లోడుతో వస్తున్న లారీ గురువారం ఉదయం 10 గంటల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోకి చేరుకున్నది. వేగంగా వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డుపైకి ఉన్న డైవర్షన్‌ను గమనించిన డ్రైవర్ ఒక్కసారిగా లారీని తిప్పాడు. ఈ క్రమంలో ముందువెళ్తున్న బైక్‌తోపాటు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టింది. అదుపుతప్పి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్‌కు చెందిన బంగారయ్య(25), వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం మున్ననూరుకు చెందిన మల్లయ్య(35)తోపాటు కావేరమ్మపేట వాసి రఫీయొద్దీన్ (60) అక్కడికక్కడే మృతిచెందారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళల్లో ఒకరు స్వల్పంగా గాయపడ్డారు.

**టిప్పర్, లారీ ఢీకొని ఇద్దరు మృతి..**

వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ శివారులో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై టిప్పర్, లిక్కర్ లోడ్‌తో వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. టిప్పర్ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా, లిక్కర్ లారీ బోల్తా పడింది. ప్రమాదంలో గుంజ రాజు, మీనజ్‌ఖాన్ అక్కడికక్కడే మృతిచెందగా, రాజానంద్ తీవ్రంగా గాయపడ్డాడు.

### గురుకులంలో విద్యార్థి

## కిడ్నాప్ కలకలం

- తప్పించుకొన్న యశ్వంత్
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



యశ్వంత్

**ఖమ్మం రూరల్, నమస్తేతెలంగాణ:** కలకలం సృష్టించిన గురుకులం విద్యార్థి కిడ్నాప్ ఎట్టకేలకు సుఖాంతమైంది. ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లోని నేలకొండపల్లి మండలానికి చెం దిన మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి కుర్రి యశ్వంత్ బీసీ కోటాలో తొమ్మిదోతరగతి చదువుతున్నాడు. గత నెల 29న అనారోగ్యంతో ఇంటికి వెళ్లి ఈనెల 11న బాబాయ్ సహాయంతో తిరిగి పాఠశాలకు వచ్చాడు. కొద్దిసేపటి తరువాత యశ్వంత్ చేతి రుమాలు కొనుగోలు చేసేందుకు దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మత్తుమందు ఇచ్చి వ్యాన్‌లో ఎత్తుకెళ్లారు. విజయవాడ వరకు వెళ్లిన తరువా త మెలకువ రావడం.. అప్పటికే వ్యాన్ రోడ్డు పక్కన నిలిపి ఉండటం.. అందులో ఎవరూ లేకపోవడంతో తప్పించుకొని అక్కడి పోలీసులను ఆశ్రయించాడు. విజయవాడ పోలీసులు యశ్వంత్ తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు అక్కడికి వెళ్లి యశ్వంత్‌ను తీసుకొచ్చారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
CTN No. 9/2019-20 తేది: 10-03-2020
పనుల సంఖ్య (3) పని పేరు: ఆదిలాబాద్ జిల్లాలోని జ్యాల–సోనారి రోడ్ కి.మీ. 0/0 నుండి 17/0 వరకు డబుల్ లేన్‌కు సింగిల్ లేన్ వెడల్పు చేయుట ద్వారా అభివృద్ధి పనులు. ఉప పని: నిర్మల్ జిల్లాలో కి.మీ. 3/0 నుండి 17/0 వరకు జ్యాల–సోనారి రోడ్ పై రోడ్ సేఫ్టీ ఇంటర్వెన్షన్ ఏర్పాటు, మమడ–కామల్‌కోట్ రోడ్ కి.మీ. 4/7 నుండి 13/8 వరకు డబుల్ లేన్‌కు సింగిల్ లేన్ వెడల్పు ద్వారా అభివృద్ధి పనులు. ఉప పని: నిర్మల్ జిల్లాలో కి.మీ. 4/7 నుండి 13/8 వరకు మమడ–కామల్‌కోట్ రోడ్‌పై రోడ్ సేఫ్టీ ఇంటర్వెన్షన్ ఏర్పాటు. కి.మీ. 0/0 నుండి 9/0 వరకు కంకాపూర్–చింతల్ చంద రోడ్ కోసం జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు మండల హెడ్ క్వార్టర్స్ కలుపుతూ డబుల్ లేన్ రోడ్‌కు సింగిల్ లేన్ వెడల్పు చేయుట. మొత్తం ECV: రూ. 19.75 లక్షలు. టెండరుదారు 16-3-2020 నుండి టెండరు షెడ్యూలును www.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 24-3-2020న మ. 3.30గం.వరకు.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) డివిజన్, నిర్మల్
DIPR RO. No. 2643DP/CL/Advt/1/2019-20, Dt: 12/03/2020

తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా అటవీ అధికారి కార్యాలయం, రాజన్న సిరిసిల్ల & కరీంనగర్**
టెండరు ప్రకటన
Rc.No.826/2017/S3, తేది: 06-03-2020
2020–21 సం|| కాలవ్యవధిలో డీర్ పార్క్, LMD, కరీంనగర్ నందు పక్షులు మరియు జంతువులకు ఆహారం సరఫరా చేయుటకు మరియు పార్కింగ్ ప్లేస్, బోటింగ్ పాయింట్, క్యాంటీన్ నిర్వహణ యొక్క లీజు కొరకు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లు/ సంస్థల నుండి విడి సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. ప్రతి డాక్యుమెంట్/ టెండర్‌కు రూ|| 1000/–ల టెండర్ ఫీజును ఏదేని జాతీయ బ్యాంక్ నుండి D.D. రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. D.D. రూపంలో బయానాతో పాటుగా టెండర్ ఫారాల స్వీకరణకు చివరి తేది : 18-03-2020న మ|| 3.00 గం||వరకు. సీల్డు టెండర్లు తేది : 18-03-2020న సా|| 4.00 గం||లకు తెరువబడును. తదుపరి వివరాలు దిగువ కార్యాలయం నుండి పొందవచ్చు.
సం/– జిల్లా అటవీ అధికారి, రాజన్న సిరిసిల్ల & కరీంనగర్
DIPR RO No. 2641-DP/CL/Advt/1/2019-20, Dt: 12/03/2020

**తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
ఇ.నం. 3-6-184, ఉర్దుగల్లి, స్ట్రీట్ నం.17, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
టెండరు ప్రకటన
Rc.No. A1/121/G.H.Insurance/2020 తేది: 11-03-2020
TSHCL ఉద్యోగుల కొరకు '' గ్రూప్ మెడి క్లెయిమ్ ఫ్యామిలీ ఇన్సూరెన్స్ పాలసీ (GMC)'' కొరకు అన్ని IRDA నమోదిత జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి. కాగోరు ఇన్సూరెన్స్ కంపెనీలు (NIT)ను www.tshousing.cgg.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవలసిందిగా సూచించబడుచున్నారు. టెండర్ డాక్యుమెంట్‌ను 14-3-2020 నుండి 24-3-2020 వరకు మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం, తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఇ.నం. 3-6-184, ఉర్దుగల్లి, స్ట్రీట్ నం.17, హిమాయత్‌నగర్, హైదరాబాద్–500029 వద్ద ఉచితంగా పొందవచ్చును. టెండర్ దాఖలుకు చివరి తేది: 26-3-2020న మ. 1.00గం.కు. తదుపరి వివరాలకు జనరల్ మేనేజర్ (Admn),TSHCL, హైదరాబాద్ వారిని కార్యాలయ వేళలలో ఉ. 10.30గం. నుండి సా. 5.00గం.వరకు సంప్రదించవచ్చును. మొబైల్ నెం. 7995024214.
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్–I, TSHCL, హైదరాబాద్
DIPR RO. No. 891-PP/CL/Advt/1/2019-20, Dt: 12/03/2020

**శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా**
ఆర్.సి. నెం. బి4/1341/2019, ఇ-టెండర్- పేపర్ టెండర్-కమ్-బహిరంగ వేలం నోటిఫికేషన్ తేది: 11-03-2020
దేవస్థానమునకు చెందియున్న ఈ క్రింది అంశాలకు ఇ-టెండర్-పేపర్ టెండర్-కమ్-బహిరంగ వేలం నిర్వహించబడును.
1) దేవస్థానం స్టోర్సునందు నిరుపయోగంగావున్న విరిగిన/పాడైపోయిన ఇనుప మంచాలు, కుర్చీలు, ఇత్తడి/అల్యూమినియం వంటసామగ్రి, బ్రాస్ వాటర్ ట్యాప్స్, ఎలక్ట్రానిక్ సామగ్రి మరియు ఇతరముల విక్రయం.
2) వేములవాడ పట్టణ జాతర గ్రౌండునందు దేవస్థానమునకు చెందివున్న డార్మేటరి–I & డార్మేటరి–I లను వేరువేరుగా రెండు సంవత్సరాల కాలపరిమితిపై మినీ కళ్యాణ మంటపంగా వివాహాది శుభకార్యాలకు మాత్రమే నిర్వహించుకొనుటకు లీజుకిచ్చుట.
3) కరీంనగర్ పట్టణంలో జిల్లా కోర్టు భవనం ప్రక్కన దేవస్థానమునకు చెందివున్న శ్రీ రాజ రాజేశ్వర కళ్యాణ మంటపమును రెండు సంవత్సరాల కాలంపాటు నిర్వహించుకొనుటకు లీజుకిచ్చుట.
4) శ్రీ బద్దిపోచమ్మ దేవాలయంనందు అమ్మవారికి భక్తులు సమర్పించు బోన దీపం నూనెను రెండు సంవత్సరాల కాలంపాటు ప్రోగుచేసుకొను లైసెన్స్ హక్కును ఇచ్చుట.
పై అంశాలకు బహిరంగ వేలం జరుగు తేది: 27/03/2020. తదుపరి, శ్రీరామ నవమి 2020 సందర్భంగా దేవస్థానంనందు పారిశుద్ధ్య నిర్వహణకుగాను మూడు రోజులపాటు స్వీపర్లను సరఫరా చేయుటకు కోరుచూ ఇ-టెండర్ నిర్వహించబడుచున్నది. ఆసక్తిగలవారు https://tender.telangana.gov.inనకు లాగాన్ చేసి పూర్తి వివరాలు పొందవచ్చును. అట్టే దేవస్థానం లీజుల విభాగంనందు కూడా పూర్తి వివరాలు తెలుసుకొనవచ్చును. పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9490525578, 8121269879 & 9963607403.
DIPR RO.No. 896-PP/CL/ADVT/1/2019-20, Dt: 12-03-2020 సం/– కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఏ.సి)

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి**
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

| ఇ–టెండరు నం. & తేది | పని పేరు | శ్రేణి (సుమారుగా) | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది |
|---|---|---|---|
| EP No.165/CGM(E)/ TC / T3 /1200mm dia MS pipeline/ GHMC /Falaknuma/ 2019-20, Dtd: 11.03.2020. | O&M డివిజన్ నం. XI, సాహెబ్‌నగర్ యొక్క KWS మానిటరింగ్ సెక్షన్ SD–II పరిధి క్రింద AI– జుబలి కాలనీ ఫలక్‌నుమా వద్ద ప్రస్తుత ROBకి GHMC శాఖ వారిచే సమాంతర ROB నిర్మాణం కోసం KDWSP ఫేజ్–I 1200mm డయా MS పైప్‌లైన్ షిఫ్టింగ్ | రూ. 262.619 లక్షలు | 12/03/2020న ఉ.10.30 గం. |

టెండరుదార్లు సమాచారాన్ని ముఖ్యంగా ZIP నమూనాలో అప్‌లోడ్ చేయాల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడండి.
సం/-చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.
టెండరు నం. C/C/Misc/Pay & Use Toilets/17stns/20 Dt. 11.03.2020
మూడు (03) సంవత్సరాల కాలానికి 17 స్టేషన్ల వద్ద పే అండ్ యూజ్ క్రింద టాయిలెట్స్ ఆపరేషన్, మెయింటనెన్స్ కొరకు కాంట్రాక్టు ఇచ్చుటకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు వ్యక్తులు, సహకార సంఘాలు మరియు భాగస్వామ్య/ యాజమాన్య సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరుతున్నారు.

| | |
|---|---|
| టెండరు జారీ కొరకు ఆఖరి తేది: | 07.04.2020న 17.45 గం||వరకు |
| టెండర్ల దాఖలు కొరకు ఆఖరి తేది: | 08.04.2020న 15.00 గం||వరకు |
| టెండరు తెరుచు తేది, సమయం: | 08.04.2020న 15.30 గం||వరకు |

తదుపరి వివరాలకు మీరు ఏ పని రోజునైనా దిగువ సంతకందారు కార్యాలయాన్ని సంప్రదించవచ్చును. టెండరు వివరాలు టెండరు ఫారాన్ని వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్
A0402/20
తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

మాటలకందని ఉత్పాతం.. భయం గొలిపే పతనం.. లక్షల కోట్ల సంపద ఆవిరి.. గురువారం భారతీయ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ ముఖచిత్రం ఇది. కరోనా దెబ్బకు షేర్ మార్కెట్ షేక్ అవుతున్నది. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ ప్రాణాంతక వైరస్.. మార్కెట్లపైనా పంజా విసురుతున్నది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, తీసుకుంటున్న నిర్ణయాలు ఈక్విటీ మార్కెట్లను నిలువునా ముంచేస్తున్నాయి. ఈ మహమ్మారి మోగిస్తున్న మరణ మృదంగం.. ఇప్పుడు గ్లోబల్ స్టాక్ మార్కెట్లనే కకావికలం చేస్తున్నది. సోమవారం భీకర నష్టాలు మరువక ముందే స్టాక్ మార్కెట్లు మరో భారీ కుదుపునకు లోనయ్యాయి. గతంలో ఎన్నడూ లేనంతగా దేశీయ సూచీలు చారిత్రాత్మక నష్టాలను మూటగట్టుకున్నాయి. కరోనా నేపథ్యంలో యూరప్ రాకపోకలపై అమెరికా తీసుకున్న నిర్ణయం కూడా షాకిచ్చింది.

# మహా బలి

## భీకర నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

### చారిత్రాత్మక స్థాయికి దిగజారిన సూచీలు




## సెన్సెక్స్ 2,919 పాయింట్లు పతనం

### నిఫ్టీ సైతం 868 పాయింట్లు క్షీణత

### చమురు, విమానయాన షేర్లు ధమాల్

### మాంద్యం భయాలతో మదుపరులు బెంబేలు

### దెబ్బ తీసిన అమెరికా-యూరప్ రాకపోకలపై ట్రంప్ నిర్ణయం

**ముంబై, మార్చి 12:**

భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలో మరో చీకటి రోజు ఆవిష్కృతమైంది. మునుపెన్నడూ లేని నష్టాలతో సూచీలు రోదించాయి. కరోనా వైరస్ భయాల మధ్య బిక్కుబిక్కుమన్న మదుపరులు.. భారీ ఎత్తున అమ్మకాలకు తెగబడ్డారు. కరోనాను మహమ్మారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చేసిన ప్రకటన గ్లోబల్ మార్కెట్లలో ప్రకంపనల్ని రేపింది. కరోనా వైరస్ నేపథ్యంలో అమెరికా-యూరప్ (బ్రిటన్ మినహా) మధ్య రాకపోకలను వచ్చే 30 రోజులపాటు నిషేధిస్తున్నట్లు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దేశీయ స్టాక్ మార్కెట్లనూ ప్రభావితం చేసింది. పెట్టుబడులను మదుపరులు ఉపసంహరించుకుంటూ పోవడంతో బేర్ అధీనంలోకి మార్కెట్ జారిపోయింది. మదుపరుల లాభాల స్వీకరణ నష్టాల విస్ఫోటనానికి దారితీయగా.. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్ 2,919.26 పాయింట్లు లేదా 8.18 శాతం పతనమైంది. చివరకు 32,778.14 వద్ద స్థిరపడింది. కేవలం ఒక్కరోజే సెన్సెక్స్ ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. ఇక ఒకానొక దశలో 3,204.30 పాయింట్ల నష్టాలను నమోదు చేయడం గమనార్హం. ఇంట్రాడేలోనూ ఈ స్థాయి నష్టాలు రావడం ఇదే ప్రథమం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం రికార్డు స్థాయిలో 868.25 పాయింట్లు లేదా 8.30 శాతం క్షీణించింది. ఆఖరుకు 10వేల స్థాయిని కోల్పోయి 9,600 మార్కుకు దిగువన 9,590.15 వద్ద నిలిచింది. ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడుతున్న సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ మరింతగా దిగజారాయి. ప్రారంభంలో 1,800 పాయింట్ల నష్టాలను చూసిన సెన్సెక్స్.. మధ్యాహ్నం 3,200 నష్టాల్లో కూరుకుపోయింది. ముగింపు సమయానికి 2,900 పాయింట్లకుపైగా కోల్పోయింది. ఫలితంగా ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.11 లక్షల కోట్లకుపైగా హరించుకుపోయింది. బుధవారం రూ.1,37,13,558.72 కోట్లుగా ఉన్న బీఎస్ఈ సంస్థల విలువ.. గురువారం రూ.1,25,86, 398.07 కోట్లకు పరిమితమైంది. దీంతో రూ.11,27,160.65 కోట్లు నష్టపోయినట్లైంది. చమురు, గ్యాస్, రియల్టీ, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ, ఐటీ రంగాల షేర్లు భారీగా నష్టాలను ఎదుర్కొన్నాయి. యెస్ బ్యాంక్ షేర్ విలువ 13 శాతానికిపైగా నష్టపోయింది.

**బేర్ జోన్‌లోకి మార్కెట్లు**

వరుస భీకర నష్టాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు బేర్ జోన్‌లోకి ప్రవేశించాయి. ఇటీవలి గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతానికిపైగా పడిపోవడంతో సూచీలపై బేర్ మార్కెట్ల ముద్ర పడింది. ఈ ఏడాది జనవరి 14న సెన్సెక్స్, నిఫ్టీలు తమ జీవనకాల గరిష్ఠ స్థాయిలను అందుకున్న విషయం తెలిసిందే. అయితే గురువారం నష్టాలతో రెండున్నరేండ్లకుపైగా కనిష్ఠ స్థాయికి పతనమైయ్యాయి. దీంతో బేరిష్ జోన్‌లోకి వెళ్లిపోయాయి. సోమవారం సెన్సెక్స్ 1,942 పాయింట్లు, నిఫ్టీ 538 పాయింట్లు క్షీణించిన విషయం తెలిసిందే.

**ప్రపంచ స్టాక్ మార్కెట్లూ ఫట్**

ఆసియా, ఐరోపా స్టాక్ మార్కెట్లన్నీ గురువారం కుప్పకూలాయి. జపాన్ 4.4 శాతం, ఆస్ట్రేలియా 7.4 శాతం, హాంకాంగ్ 3.7 శాతం, చైనా 1.5 శాతం, సింగపూర్, ఇండోనేషియా సూచీలు 3 శాతం చొప్పున పడిపోయాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లు 4.5 శాతం, జర్మనీ 5 శాతం, గల్ఫ్ మార్కెట్లు 4 శాతానికిపైగా నష్టపోయాయి. ఓవైపు కరోనా భయా లు, మరోవైపు యూరప్ ప్రయాణంపై అమెరికా విధించిన ఆంక్షలు.. మదుపరులను పెట్టుబడు ల ఉపసంహరణకు ఉసిగొల్పాయి. ప్రపంచవ్యాప్తంగా 107 దేశాల్లో కరోనా మరణాలు 4,200లకుపైగా ఉండగా, బాధితులు సుమారు 20వేలుగా ఉన్నారు. భారత్‌లో 73 మంది ఈ వైరస్ బారినపడ్డారు.

**చమురు, విమానయాన షేర్లు ధమాల్**

చమురు రంగ షేర్లను మదుపరులు వదిలించుకునే ప్రయత్నం చేశారు. దీంతో గ్యాస్, ఆయిల్ సూచీ అత్యధిక నష్టాలను నమోదు చేసింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ షేర్ విలువ 14.71 శాతం పడిపోయి రూ.345.15 వద్ద నిలువగా, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్ 12.83 శాతం క్షీణించి రూ.183.85 వద్ద నిలిచింది. ఓఎన్జీసీ షేర్ విలువ కూడా 12.83 శాతం మేర కోల్పోయింది. గెయిల్ 11.62 శాతం, ఇండియన్ ఆయిల్ 9.58 శాతం, రిలయన్స్ 7.95 శాతం, ఇంద్రప్రస్థ 6.46 శాతం, క్యాస్ట్రాల్ 5.49 శాతం, గుజరాత్ పెట్రోనెట్ 4.57 శాతం చొప్పున నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 5.76 శాతం పడిపోయి 33.73 డాలర్ల వద్ద కదలాడటంతో దేశీయ మార్కెట్లలో చమురు షేర్లు మదుపరుల నిరాదరణకు గురైయ్యాయి. ఇది ధరలను ప్రభావితం చేస్తున్నది. ఇండిగో, స్పైస్‌జెట్, జెట్ ఎయిర్‌వేస్ షేర్లూ 19 శాతానికి పైగా కోల్పోయాయి.

## 52 వారాల కనిష్ఠానికి 1,180 స్టాకులు

కరోనా వైరస్ దెబ్బకు వెయ్యికి పైగా స్టాకులు ఏడాది కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు కలుపుకొని 1,180 స్టాకులు 52 వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. వీటితోపాటు హీరో మోటో కార్ప్, గెయిల్, ఏసీసీ, ఏబీబీ, బీఈఎంఎల్, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్, జిల్లెట్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, బ్యాంక్ ఆఫ్ బరోడా, భెల్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, అరబిందో ఫార్మాలు కూడా ఉన్నాయి. మరోవైపు రుచి సోయా ఇండస్ట్రీస్, అపోలో ఫిన్‌వెస్ట్(ఇండియా)లిమిటెడ్‌తోపాటు మరో 11 షేర్లు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరుకోవడం విశేషం. 546 కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. కరోనా వైరస్‌ను ప్రపంచ మహమ్మారిగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించడంతో మరోమారు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం గుప్పిట్లోకి జారుకుంటుండటంతో మదుపరులు భారీ అమ్మకాలకు మొగ్గుచూపారని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వీటికి తోడు పలు దేశాలు విదేశీ పర్యాటకులను రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయం భయం గుప్పిట్లోకి నెట్టిందని చెప్పారు.

**గత 12 రోజుల్లో దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఏకంగా రూ.29 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 9 లోపు ఈక్విటీల నుంచి రూ.29,262 కోట్ల (4.02 బిలియన్ డాలర్లు) నిధులను వెనక్కి తీసుకున్నారు**

## బంగారం తరిగింది!

బంగారం మరింత తగ్గింది. ఒకవైపు స్టాక్ మార్కెట్లు కుదేలవుతుండటం, మరోవైపు రూపాయి బక్కచిక్కుతుండటంతో పసిడి ధర రూ.120 తగ్గి రూ.44,490 వద్ద నిలిచింది. బుధవారం ఈ ధర రూ.44,610గా ఉన్నది. వెండి అయితే ఏకంగా రూ.300 దిగొచ్చి రూ.46,860 వద్ద పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలు ఒక్కసారిగా పతనమవడం, దేశీయంగా రూపాయి భారీగా క్షీణించడం వల్లనే బంగారం, వెండి ధరలు దిగొచ్చాయని హెచ్‌డీఎఫ్‌సీ వర్గాలు వెల్లడించాయి. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,645 డాలర్లకు, వెండి 16.73 డాలర్లకు పడిపోయాయి.

## రూపాయి నష్టాలు తీవ్రం

**డాలర్‌తో** పోల్చితే రూపాయి మారకం విలువ గురువారం మరింతగా దిగజారింది. 60 పైసలు పడిపోయి 17 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 74.28 వద్ద స్థిరపడింది. ఉదయం ప్రారంభంలోనే నష్టాలతో 74.25 వద్ద మొదలైన రూపాయి.. ఒకానొక దశలో 73.68 స్థాయికి బలపడింది. అయితే మళ్లీ 82 పైసల పతనంతో 74.50 వద్దకు క్షీణించింది. చివరకు 74.28 వద్ద నిలిచింది. మదుపరుల నుంచి డాలర్‌కు డిమాండ్ ఏర్పడటంతో రూపాయి నష్టపోక తప్పలేదని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. కరోనా వైరస్‌ను డబ్ల్యూహెచ్‌వో మహమ్మారిగా ప్రకటించడం, యూరప్ నుంచి రాకపోకలపై అమెరికా నెల రోజుల నిషేధం విధించడం ప్రభావితం చేశాయన్నారు.



## 'టూరిజాన్నీ వదలని కరోనా'




**హైదరాబాద్, మార్చి 12:** కరోనా వైరస్‌తో గడిచిన కొన్ని నెలల్లో భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ టూరిస్టుల సంఖ్య 25 శాతం నుంచి 30 శాతం వరకు పడిపోయారని పౌర విమానయాన శాఖ జాయింట్ కార్యదర్శి ఉషా పాధీ తెలిపారు. అంతర్జాతీయ టూరిస్టులతోపాటు దేశీయ ప్రయాణికులు కూడా భారీగా తగ్గారని, అత్యవసరం అయితే తప్పా పర్యాటక ప్రాంతాలను సందర్శించడం లేదని ఆమె చెప్పారు.

**వారానికి ఒకటే విమానం: ఎయిర్‌బస్**

దేశీయంగా విమానయానం చేసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రముఖ విమానతయారీ సంస్థ ఎయిర్‌బస్ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ ఏడాదిలో వారానికి ఒక్క విమానాన్ని దేశీయ విమానయాన సంస్థలకు అందచేయనున్నట్లు కంపెనీ ఇండియా ఎండీ ఆనంద్ స్టాన్లీ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్ ఇండియా 2020 సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాదిలో 510కి పైగా విమానాలను అందించనున్నట్లు, వీటిలో రెండింట మూడోవంతు ఇండిగోకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండంతో దీనికి తగ్గట్టుగా 2038 నాటికి కొత్తగా 1,900 నూతన ప్యాసింజర్, కార్గో ఎయిర్‌క్రాఫ్ట్‌లు అవసరమవుతాయన్నారు.

## మీ సొమ్ము భద్రం

### డిపాజిట్లను వెనక్కి తీసుకోకండి • ప్రైవేట్ బ్యాంకులపై రాష్ర్టాలతో ఆర్బీఐ

**న్యూఢిల్లీ, మార్చి 12:** ప్రైవేట్ రంగ బ్యాంకు ల్లో సొమ్ము భద్రంగానే ఉంటుందని, భయాలు అక్కర్లేదని ఆర్బీఐ ఓ ప్రకటన చేసింది. డిపాజిట్లను ఉపసంహరించుకోవద్దని రాష్ర్టాలకు సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ర్టాల చీఫ్ సెక్రటరీలకు ఆర్బీఐ లేఖలు రాసింది. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ల ఉపసంహరణ.. మొత్తం బ్యాంకింగ్, ఆర్థిక రంగాల సుస్థిరతనే దెబ్బ తీస్తుందని చెప్పింది. యెస్ బ్యాంక్ సంక్షో భం నేపథ్యంలో ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఉన్న నిధులను ప్రభుత్వ రంగ బ్యాంకులకు బదిలీ చేసుకోవాలని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత ప్రభుత్వ శాఖలు, సంస్థలకు సూచిస్తున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆర్బీఐ పైవిధంగా స్పందించింది. మరోవైపు జూన్ నాటికి ఆర్బీఐ కనీసం 65 బేసిస్ పాయిం ట్ల మేర కీలక వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.




వచ్చే నెల ద్రవ్యసమీక్షలో కొంత, ఆపై సమీక్షలో మరికొంత రెపో రేటుకు కోత పెట్టవచ్చని చెబుతున్నారు. ఇదిలావుంటే సోమవారం 2 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా డాలర్లను ఆర్బీఐ విక్రయించనున్నది. దేశీ య ఫారెక్స్ మార్కెట్ స్థిరీకరణలో భాగంగానే బ్యాంకులకు డాలర్లను ఆర్బీఐ అమ్మాలని నిర్ణయించింది. ఇకపోతే ఆర్బీఐ సెంట్రల్ బోర్డులోకి ఆర్థిక సేవల శాఖ సెక్రటరీ దేబాశిష్‌ను నామినేట్ చేశారు.

## కోలుకున్న పారిశ్రామికం

### జనవరిలో 2 శాతం వృద్ధి • గత 6 నెలల్లో ఇదే గరిష్ఠం

**న్యూఢిల్లీ, మార్చి 12:** గత కొన్ని నెలలుగా నేల చూపులు చూసిన పారిశ్రామికం ఎట్టకేలకు కోలుకున్నది. గనులు, పవర్ రంగాలు వృద్ధిని నమోదు చేసుకోవడంతో జనవరి నెలకుగాను పారిశ్రామిక వృద్ధి 2 శాతంగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఐఐపీ 1.6 శాతం వృద్ధిని కనబరిచింది. అలాగే జూలై 2019లో నమోదైన 4.9 శాతం వృద్ధి తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ఆగస్టులో -1.4 శాతం, సెప్టెంబర్‌లో -4.6 శాతం, అక్టోబర్‌లో -6.6 శాతానికి పడిపోయిన పారిశ్రామికం తిరిగి కోలుకోగలిగింది. ఆ తర్వాత నెలల్లో 1.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన నివేదికలో తయారీ రంగం 1.5 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా..విద్యుత్ రంగంలో 3.1 శాతం, గనులు 4.4 శాతం పెరిగాయి. ఏప్రిల్ 2019 నుంచి జనవరి 2020 మధ్యకాలంలో పారిశ్రామిక రంగం 0.5 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నది.

### శాంతించిన ధరలు

**ఫిబ్రవరిలో 6.58 శాతంగా ద్రవ్యోల్బణం**

ఆహార పదార్థాల ధరలు ఎట్టకేలకు శాంతించాయి. గత నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం 6.58 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 2.57 శాతంతో పోలిస్తే మాత్రం రెండు రెట్లు అధికంగా ఉండగా, అదే జనవరిలో నమోదైన 7.59 శాతంతో పోలిస్తే మాత్రం తగ్గుముఖం పట్టింది. ఆహార పదార్థాలకు సంబంధించిన ధరల సూచీ 10.81 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఇది 13.63 శాతంగా ఉన్నది.



అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరీని అందజేస్తున్న చైర్మన్ ఎర్రోళ్ల, సభ్యులు

## అట్రాసిటీ కేసుల పరిష్కారం హర్షణీయం

■ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మారుమూల తండాలు, గ్రామాల్లో పర్యటించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించడం హర్షణీయమని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు ప్రశంసించారు. గురువారం అసెంబ్లీ వద్ద మంత్రి కేటీఆర్‌తోపాటు మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి, కమిషన్ ప్రచురించిన డైరీ, సావనీర్, క్యాలెండర్లను అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. మంత్రులను కలిసినవారిలో కమిషన్ సభ్యులు విద్యాసాగర్, రాంబల్‌నాయక్, నీలదేవి ఉన్నారు.

## పాత అసెంబ్లీ భవనంలోకి కౌన్సిల్!

■ మండలి చైర్మన్ ఆధ్వర్యంలో పరిశీలించనున్న కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనమండలి సభా మందిరం.. పాత అసెంబ్లీ భవనంలోకి మారనున్నది. ప్రస్తుతం జూబ్లీహాల్‌లో కొనసాగుతున్న కౌన్సిల్ సమావేశాలను శాసనసభ పాత భవనంలోకి మార్చడానికి ప్రభుత్వం సమ్మతించినట్టు తెలిసింది. ప్రస్తుత కౌన్సిల్ సమావేశాలు పూర్తికాగానే శాసనమండలి చైర్మన్ ఆధ్వర్యంలో కమిటీ.. పాత అసెంబ్లీ హాల్‌ను పరిశీలించనున్నది. ప్రస్తుత శాసనసభా మందిరాన్ని ఆనుకుని ఉన్న పాత భవనంలో 1985 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభా సమావేశాలు జరిగేవి. 1985 తర్వాత కొత్తగా నిర్మించిన ప్రస్తుత శాసనసభా మందిరంలోకి మారింది. అప్పటినుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సభలు కొత్త భవనంలోనే నిర్వహించారు. ఏపీ అసెంబ్లీ అమరావతికి మారాక పాత అసెంబ్లీ భవనం ఖాళీగానే ఉంటున్నది. జూబ్లీహాల్‌లో ఇబ్బందులున్నాయని సీఎం కేసీఆర్‌కు తెలిపిన సభ్యులు.. భవనం మార్పునకు విజ్ఞప్తిచేశారు. మండలి చైర్మన్, శాసనసభా వ్యవహారాల మంత్రి పాత అసెంబ్లీ భవనాన్ని పరిశీలించాలని, ఆర్‌అండ్‌బీ అధికారులతో నివేదిక తెప్పించుకోవాలని సీఎం సూచించారు. వచ్చే కౌన్సిల్ సమావేశాలను పాత అసెంబ్లీ భవనంలో నిర్వహించే అవకాశం ఉన్నదని పలువురు ఎమ్మెల్సీలు అసెంబ్లీ లాబీలో విలేకరులకు తెలిపారు.



# పౌల్ట్రీకి బాజాప్తా సహకారం

■ రాయితీలిస్తే కుంభకోణమంటారా?

■ కాంగ్రెస్‌పై సీఎం కేసీఆర్ ఆగ్రహం

■ మక్కల స్కాం దుష్ప్రచారమే

■ భట్టి వ్యాఖ్యలపై మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ ఉంటుందని.. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ ఉండేదేనని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. అలాగే రాష్ట్రంలో దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న పౌల్ట్రీరంగానికి బేజాప్తాగా కాదు.. బాజాప్తాగా సహకరిస్తామని స్పష్టంచేశారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ పౌల్ట్రీరంగం గురించి మాట్లాడుతుండగా.. సీఎం కేసీఆర్ కలుగజేసుకున్నారు. పౌల్ట్రీరంగంపై కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, రాయితీలు ఇస్తే కుంభకోణం జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి తీరుతోనే కాంగ్రెస్‌ను అన్నిఎన్నికల్లోనూ ప్రజలు తిరస్కరించి, టీఆర్‌ఎస్‌కు పట్టం కడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు. 'నాదాన్ దుష్మన్' తరహాలో కాంగ్రెస్ నేతలున్నారని, ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోవడం లేదని అసహనం వ్యక్తంచేశారు. అంతకుముందు మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తప్పుడు వార్తల వల్లే పౌల్ట్రీరంగం కుప్పకూలిపోయిందని అన్నారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే రూ.1000 కోట్లు నష్టం జరిగిందని.. గడిచిన 45 రోజుల్లో తనపౌల్ట్రీయే రూ.10 కోట్లు కోల్పోయిందని తెలిపారు. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. పరిశ్రమను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ పక్ష నాయకులు భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా ఈటల తిప్పికొట్టారు. పౌల్ట్రీరంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి సాయం చేస్తే.. స్కాంలు జరిగాయని ఆరోపించడం సరికాదన్నారు. పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో చేసిందని గుర్తుచేశారు. పౌల్ట్రీ వ్యాపారి రామిరెడ్డికి లక్షా 24 వేల మెట్రిక్ టన్నుల మక్కలు ఇచ్చినట్టు ఆరోపిస్తున్నారని.. ఆయనకు ఇచ్చింది 62వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని అన్నారు. ఎస్సార్ హేచరీస్‌కు కూడా ఇచ్చింది 98,500 మెట్రిక్ టన్నులు కాదని.. 35 వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని చెప్పారు. పౌల్ట్రీ బ్రీడర్స్, రైతులకు కలిపి వినియోగం ప్రకారమే మక్కలు కేటాయించినట్టు తెలిపారు. మక్కలపై ఒక్క పైసా కూడా సబ్సిడీ ఇవ్వలేదని.. టన్నుకు రూ.18 వేల చొప్పున విక్రయించామని తెలిపారు. ఎవరికీ ఉచితంగా ఇవ్వలేదని, వందల కోట్ల స్కాం జరిగిందనడం అర్థరహితమని ఈటల కొట్టిపారేశారు.



## భిక్షకాదు మా హక్కు

➤ మొదటిపేజీ తరువాయి...

కూడా బీజేపీ దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. దేశాన్ని పాలించడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ అట్టర్‌ఫ్లాప్ అయ్యాయన్నారు. దేశంలో పన్నుల పద్ధతి, వాటిని ఎవరు వసూలు చేయాలనే అంశాలను రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారని సీఎం తెలిపారు. ఐటీ వంటి పన్నులు వసూలు చేసే బాధ్యతను కేంద్రానికి కల్పించిందని, వసూలయిన పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిందేనని సూచించారన్నారు. అయితే రాష్ట్రాలకు వాటా ఇవ్వడంలో కేంద్రంలో అధికారంలో ఉండే ప్రభుత్వాలు మొదట్నుంచీ మోసం చేస్తూనే ఉన్నాయని మండిపడ్డారు. జీఎస్టీ నష్టపరిహారం, ఐజీఎస్టీ బకాయిలు ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదని.. సరైన సమయంలో ఇవ్వడం లేదని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే వీటితోనే ప్రతిరాష్ట్రం ఉద్యోగుల వేతనాలు, ఇతరత్రా అత్యవసర నిధులకు వాడుకుంటాయని ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించారు.

### కేంద్రాన్ని నమ్ముకుంటే శంకరగిరిమాన్యాలే..

కేంద్రం సరిగా, సరైన సమయంలో విధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. కేంద్రం నుంచి వచ్చే బకాయిలు, జీఎస్టీ రిటర్న్స్‌పై ఆశలు పెట్టుకుంటే శంకరగిరి మాన్యాలే దిక్కవుతుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన విధంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.3,900 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం వెనుకాడుతున్నదన్నారు. కానీ. రూ.1,400 కోట్ల అప్పు తీసుకోవాలని సలహా ఇస్తూ మనచేతులు మన నెత్తిపైనే పెడుతున్నదని మండిపడ్డారు. ఐదేండ్లుగా కేంద్రం నుంచి వచ్చే నిధులు ఏటా రూ.10 వేల కోట్లు దాటలేదన్నారు. కొన్నినిధులను కేంద్రం నేరుగా రాష్ట్రాల్లో వినియోగించడం సాధ్యం కాదని.. నరేగా, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర నిధులను రాష్ట్రప్రభుత్వంతో కలిసే ఖర్చు చేస్తుందన్నారు. దీనిలో 70:30 శాతం లేదా 60:40శాతంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఖర్చుచేయాలని, దీనికోసం రాష్ట్రప్రభుత్వం తరపున యూసీలు, నివేదికలన్నీ ఇస్తేనే తిరిగి ఇస్తారన్నారు. మన దగ్గర నుంచి వసూలుచేసిన వాటిల్లోనే రాష్ట్రాలకు నిధులు ఇస్తుందనే విషయం గుర్తుపెట్టుకోవాలని, కేంద్రం దయాదాక్షిణ్యంతో ఇవ్వడంలేదని సూచించారు. దేశాన్ని భ్రమింపజేసే పిచ్చి ప్రయత్నంలో కాంగ్రెస్ ఉండేదని, ప్రస్తుతం బీజేపీ దాని తాతలా మారిందని ఎద్దేవాచేశారు. దేశాన్ని సాకే ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి మూడు స్థానాల్లో ఉంటుందని చెప్పారు. రూ.50 వేల కోట్లకుపైగా పన్నులు రాష్ట్రం నుంచి పోతే.. కేంద్రం నుంచి వచ్చే అన్నిరకాల పన్నుల వాటా కలిపినా రూ.24 వేల కోట్లు దాటదన్నారు. రాజ్యాంగంలో ట్యాక్స్ అనే దానికి ఒక పద్ధతి, విభజన అనేవి ఉంటాయని.. కేంద్రం ఏదో ఇస్తుందని, ఏదేదో చేస్తుందని ఇష్టంవచ్చినట్టు చెప్పితే నమ్మడానికి మనది చదువురాని రాష్ట్రం కాదని మండిపడ్డారు. బీజేపీ నేతలు అనవసర ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ ఇవ్వడం లేదని, ఏదైనా ఇచ్చినా అది రాష్ట్ర ప్రజల సొమ్మేనని, ఆకాశం నుంచి రావడం లేదని స్పష్టంచేశారు.

# 45 డయాలసిస్ కేంద్రాలు

■ రాష్ట్రవ్యాప్తంగా 22 ఐసీయూలు

■ ప్రశ్నోత్తరాల్లో మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పేద కిడ్నీ బాధితులకు వైద్యం అందించాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటుచేసినట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 45 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ప్రభుత్వ దవాఖానల్లోనూ ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అవసరమైతే మరిన్ని సెంటర్ల ఏర్పాటుకు కూడా నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈటల సమాధానమిస్తూ.. ఒక్కో కిడ్నీ రోగికి ఏడాదికి రూ.1.2 లక్షలు ఖర్చుచేస్తే తప్ప జీవించడం కష్టమని, అంత ఖర్చు చేయలేని ఎంతోమందికి డయాలసిస్ సెంటర్ల ద్వారా వైద్యం అందిస్తున్నామన్నారు. ఐసీయూల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, డాక్టర్ ఎం సంజయ్, డాక్టర్ మెతుకు ఆనంద్ అడిగిన ప్రశ్నలకు ఈటల స్పందిస్తూ.. ప్రభుత్వ దవాఖానలు,



ఏరియా దవాఖానల్లో ప్రభుత్వ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఐసీయూ)ను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.41.12 కోట్లతో 22 చోట్ల ఐసీయూలు నెలకొల్పినట్టు పేర్కొన్నారు. త్వరలోనే టెక్నికల్, నర్సింగ్ సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అడిగిన ప్రశ్నకు ఈటల సమాధానమిస్తూ.. కరోనా నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కరోనా అంశంపై సభలో స్వల్పకాలిక చర్చను పెట్టాలని కోరారు.

## కేసీఆర్‌ను కోరుకుంటున్న దేశం

■ ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు.. అభివృద్ధి, సంక్షేమానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఇదే విషయాన్ని అనేక నివేదికలు వెల్లడించడంతోపాటు కేంద్రమంత్రులు పార్లమెంటులో ప్రస్తావించారని పేర్కొన్నారు. దేశ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాల్సివస్తే అది కేసీఆర్ వల్లనే సాధ్యమవుతుందని దేశ ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. పెండింగు ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని గువ్వల చెప్పారు.

### పథకాలపై బీజేపీ ఎమ్మెల్యే ప్రశంసలు

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్.. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ పథకాలపై ప్రశంసలు కురిపించారు. ఇవి చాలా మంచి పథకాలని కొనియాడారు.

## పల్లెప్రగతితో గ్రామాల్లో స్వచ్ఛ కళ : మంత్రి ఎర్రబెల్లి



పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల్లో స్వచ్ఛకళ కనిపిస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వ్యర్థాలను తీసుకెళ్లడానికి, మొక్కలకు నీళ్లు పెట్టడానికి ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రతినెలా అన్ని గ్రామ పంచాయతీలకు ఉపాధి నిధులతోపాటు రూ.339 కోట్లను విడుదలచేస్తున్నదని చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, మహారెడ్డి భూపాల్‌రెడ్డి, అజ్మీరా రేఖ, అనసూయ దనసరి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

## 18,100 హెక్టార్లలో ఆయిల్‌పామ్: మంత్రి నిరంజన్‌రెడ్డి



రాష్ట్రంలో 2.78 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని కేంద్రకమిటీ ఇప్పటికే తెలిపిందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. 2021-2022 ఏడాదికి 18,100 హెక్టార్లలో సాగుకు అనుమతి లభించిందన్నారు. ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు బాల్కసుమన్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, భాస్కర్‌రావు, గొంగిడి సునీత అడిగిన ప్రశ్నలకు మంత్రి నిరంజన్‌రెడ్డి సమాధానమిస్తూ.. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.20,800 సబ్సిడీ ఇస్తున్నదన్నారు. విత్తనసాగుపై ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, అంజయ్యయాదవ్ అడిగిన ప్రశ్నకు నిరంజన్‌రెడ్డి సమాధానమిస్తూ.. దేశంలో 35 లక్షల టన్నుల విత్తనాలు అవసరం కాగా, 22 లక్షల నుంచి 24 లక్షల టన్నులు తెలంగాణనే అందిస్తుందని చెప్పారు.

## రామప్పకు యునెస్కో గుర్తింపు

■ ఆలయం ఎదుట చెరువులో జ్ఞానకేంద్రం ఏర్పాటు

■ శాసనమండలిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

■ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నకు సమాధానం





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్‌లోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించేవిధంగా సీఎం కే చంద్రశేఖర్‌రావు కృషిచేస్తున్నారని పర్యాటక, ఆబ్కారిశాఖమంత్రి శ్రీనివాసగౌడ్ చెప్పారు. ప్రపంచ వారసత్వకట్టడంగా గుర్తింపుపొందడానికి కావాల్సిన అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుందని, ఈ మేరకు ప్రతిపాదనలు కూడా పంపిందని తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో రామప్ప దేవాలయంపై పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఆలయం ఎదుటనున్న చెరువులోని చిన్నదీవిలో జ్ఞానకేంద్రాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. వరంగల్‌లోని ఇంకా అనేకప్రాంతాలను పర్యాటకకేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సీఎం కేసీఆర్ చెరువులను పునరుద్ధరిస్తూ, పలుచోట్ల రిజర్వాయర్లు నిర్మిస్తున్నారని, ఈ క్రమంలో కాళేశ్వరం నుంచి అన్ని ప్రాంతాలు కలిపేవిధంగా పర్యాటక ప్రాజెక్టును ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. మెదక్ చర్చిని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

## రెండేండ్లలో 1.5 లక్షల డబుల్ ఇండ్లు

■ గృహనిర్మాణశాఖ మంత్రి వేముల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే రెండేండ్లలో ఒకటిన్నర లక్షల డబుల్‌బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శాసనమండలిలో చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, ఇప్పటికి 39,321 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని వాటికి రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఈ పథకానికి కేంద్రం నుంచి నిధులు చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. ప్రస్తుతం 1.40 లక్షల ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఖాళీస్థలాలు ఉన్న వారికి మరో లక్ష ఇండ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణాల కోసం రూ.10,500 కోట్లు ప్రతిపాదించామని తెలిపారు.

## ఏటా రూ.365 కోట్ల ఆదాయం

■ కార్గో, పార్సిల్ సర్వీసులతో.. : మంత్రి పువ్వాడ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి సొంతంగా నిధుల సేకరణ కోసం కార్గో, పార్సిల్ సేవలు ప్రారంభించబోతున్నామని, వీటిద్వారా ఏటా రూ.365 కోట్లు సమీకరించుకుంటామని రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గత రెండునెలల్లో ఆర్టీసీకి దాదాపు రూ.13 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు సొంత నిధులతో జీతాలు ఇచ్చే స్థాయికి ఎదిగిందన్నారు.

## ఎంబీసీలకు 500 కోట్లు : గంగుల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంబీసీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించామని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఎంబీసీలో మొత్తం 18 కులాలు ఉన్నాయన్నారు. అవసరమైతే ఎంబీసీ కార్పొరేషన్‌కు నిధులు పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ క్రమంలో కులవృత్తులపై ఆధారపడినవారికి అన్నిరకాల వసతి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# సుస్థిరాభివృద్ధిలో మనమే టాప్

■ ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల ప్రకారమే అప్పు ■ గణనీయంగా పెరిగిన తలసరి ఆదాయం

■ సంక్షేమానికి ఒక్కరూపాయీ తగ్గించలేదు ■ కాంగ్రెస్ భ్రమలను బడ్జెట్ బద్దలుకొట్టింది

■ బడ్జెట్‌పై జనంలో ఆశ.. ప్రతిపక్షాల్లో నిరాశ ■ బడ్జెట్‌పై చర్చకు మంత్రి హరీశ్ సమాధానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే అప్పు తెస్తున్నామని, జీఎస్డీపీ వృద్ధిరేటును బట్టే రుణాలు వస్తాయని ఆర్థికమంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. అవగాహన లేకే అప్పుల రాష్ట్రం అంటూ ప్రతిపక్షాలు హేళన చేస్తున్నాయని విమర్శించారు. ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలు కాదని ఎక్కడా అప్పు చేయలేదని పేర్కొన్నారు. దేశంలోని 19 రాష్ట్రాలు ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలను పాటించకుండా ఎక్కువ అప్పు తీసుకున్నాయన్నారు. జీఎస్డీపీ పెరిగితే రుణ పరిమితి కూడా పెరుగుతుందన్న మంత్రి గోబెల్స్ ప్రచారం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవుపలికారు. ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల ప్రకారం రుణాలు తీసుకున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జాబితాలో దిగువ నుంచి మనది ఆరోస్థానమని చెప్పారు. కమర్షియల్ ట్యాక్స్‌ల విషయంలో కోర్టు కేసులకు కూడా వన్‌టైం సెటిల్‌మెంట్ కల్పిస్తామన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఆర్థిక మంత్రి గురువారం శాసనసభలో సమాధానమిచ్చారు. నాలుగు కోట్ల మంది ప్రజలు బడ్జెట్‌పై సంతోషంగా ఉంటే ప్రతిపక్షాలు మాత్రం నిరాశలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా భ్రమల్లో పెట్టే బడ్జెట్ తమది కాదని, సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో రూపొందిన బడ్జెట్ కాంగ్రెస్ భ్రమలను బద్దలు కొట్టిందని చెప్పారు. మాంద్యంలోనూ సంక్షేమానికి రూపాయి తగ్గించలేదని స్పష్టంచేశారు.

### మన రైతుబంధు ఆదర్శం

సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ 82 పాయింట్లతో తొలిస్థానంలో ఉన్నట్టు స్వయంగా నీతి ఆయోగ్ వెల్లడించిందని మంత్రి హరీశ్ వివరించారు. రైతుబంధును ఆదర్శంగా తీసుకున్న కేంద్రం పెట్టుబడి వ్యయం కింద 12% బడ్జెట్‌లో పెడితే.. తెలంగాణలో 30% పెట్టామని తెలిపారు. పదేండ్ల కింద 13.56 శాతం ఉన్న వృద్ధిరేటు ఇప్పుడు 21.47కు పెరిగిందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ. 54,052గా ఉన్న తలసరి ఆదాయం.. రూ.2,11,800కు పెరిగిందన్నారు. ఉమ్మడి పాలనలో పెట్టుబడుల వ్యయం రూ.1,29,683 కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.2,11,800 కోట్లు ఉన్నదని తెలిపారు. జీఎస్డీపీ గతంలో రూ.8,57,364 కోట్లు ఉంటే, రూ.9,69,604 కోట్లకు చేరిందని వివరించారు.

### ఇసుక ఆదాయం పెరిగింది

ఉమ్మడి పాలనలో ఏటా ఇసుక మీద రూ.10 నుంచి రూ.12 కోట్లు ఆదాయం వచ్చేదని, ఇప్పుడు రూ.800 కోట్లకు చేరిందని మంత్రి హరీశ్‌రావు వివరించారు. స్వగృహ, దిల్ ఆస్తులను అమ్ముతామని బహిరంగంగానే చెప్తున్నామన్నారు. కోకాపేట వంటి ప్రాంతాల్లో ప్రభుత్వం కేసులు గెలిచిందని, ఆ భూములను కూడా అమ్ముతామని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటికి పదేండ్లలో రూ. 1,42,792 కోట్లు కేటాయించారని, ఇందులో అధిక శాతం ఆంధ్రాకే ఇచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాత పది జిల్లాల్లో సాగునీటిరంగానికి రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. రైతుబంధుకు బడ్జెట్‌లో గతం కంటే రూ.2 వేల కోట్లు అదనంగా కేటాయించామని వివరించారు. 2014-15లో 34,96,087 ఎకరాల్లో వరి సాగుచేస్తే.. ప్రస్తుతం 78,46,619 ఎకరాలకు పెరిగిందని చెప్పారు. 2014-15లో 68,16,662 టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, రూ.9,270 కోట్ల ఆదాయం వచ్చిందని, 2019-20లో 2,23,18,576 టన్నుల ధాన్యం ఉత్పత్తికాగా, రూ.40 వేల కోట్లు వచ్చాయని తెలిపారు.

### పేదవర్గాలకు అండ

ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలకు పదేండ్లలో రూ.5,558 కోట్లు పెన్షన్ల కింద ఇచ్చారని, తెలంగాణ ప్రభుత్వం ఈ ఐదున్నరేండ్లలో రూ. 42,470 కోట్లు ఖర్చు పెట్టిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఐటీరంగానికి సమైక్య పాలనలో పదేళ్లలో రూ.5,644 కోట్లు కేటాయిస్తే, ఈ ఐదున్నరేండ్లలో రూ.4,389 కోట్లు ఖర్చు చేశామన్నారు. సింగరేణి కార్మికులకు పదేండ్లలో రూ.9,571 కోట్లను రాయల్టీగా ఇస్తే, ఈ ఐదేండ్లలో రూ.13,105 కోట్లను రాయల్టీగా ఇచ్చామని పేర్కొన్నారు. విద్యుత్‌రంగంలో ఎనలేని ప్రగతిని సాధించామన్నారు. గతంలో హైదరాబాద్ గాంధీ, వరంగల్ ఎంజీఎం దవాఖానల్లో మాత్రమే డయాలసిస్ సేవలు ఉండేవని, స్వరాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలు, 20 ఐసీయూ యూనిట్లు ఏర్పాటుచేశామని చెప్పారు. కేసీఆర్ కిట్, అమ్మఒడి వాహనాలతో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయని వివరించారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లి కోసం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా రూ. 1,00,116 ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించామని, మూసీ ప్రక్షాళనచేసి కానుకగా ఇస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో గృహ నిర్మాణాల పేరుతో ప్రజలకు అప్పులు మిగిల్చారని, కానీ సీఎం కేసీఆర్ రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఐటీరంగంలో తెలంగాణ గ్రోత్ సాధించిందని, టీహబ్‌ను ప్రపంచమే హర్షించిందన్నారు. ఈ ఐదేండ్లలో 43 ఐటీ పార్కులు, రూ.1,25,578 కోట్ల పెట్టుబడులు, 9,71,106 మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. విద్యారంగానికి రూ. 16,450 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నా రు. 2014 వరకు 298 గురుకులాల్లో 1,45,254 మంది విద్యార్థులు ఉండేవారని, ఇప్పుడు 671 గురుకులాల్లో 4,41,497 మంది విద్యార్థులున్నారని వివరించారు. సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం పెడుతున్నామని, ప్రతిపక్ష నేతలంతా అక్కడికి వెళ్లి తిని రావాలని సూచించారు. ఇప్పటివరకు 1,52,260 ఉద్యోగాలకు అనుమతి తీసుకున్నామని, వాటిలో 1,32,889 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేశామని చెప్పారు. ఇందులో 1,23,075 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. త్వరలోనే వర్సిటీల్లో పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించారు. ఎంఐఎం కోరినట్టు మూసీ, హైదరాబాద్ అభివృద్ధిపై తప్పకుండా సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నిర్ణయాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కేవలం ఆరోపణలు చేయడమే లక్ష్యంగా మాట్లాడితే ప్రజలే గుణపాఠం చెప్తారని ప్రతిపక్షాలకు సూచించారు.

# మాంద్యంలోనూ అభివృద్ధి

## ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే

■ కేంద్రం అనాలోచిత నిర్ణయాలవల్లే మాంద్యం

■ శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చలో సభ్యులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశమంతా ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే విధంగా బడ్జెట్‌కు రూపకల్పన చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ ప్రశంసించారు. శాసనమండలిలో గురువారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. గత 60 ఏండ్లలో ఏ ప్రభుత్వమూ ఎంబీసీలను పట్టించుకోలేదని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈసారి ఎంబీసీలకు రూ.500 కోట్లను కేటాయించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తేరా చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలవల్లే దేశంలో ఆర్థికమాంద్యం నెలకొన్నదని విరుచుకుపడ్డారు. 2007-08లో ఇదేవిధంగా ఆర్థిక మాంద్యం ఎదురైనప్పుడు సమర్థంగా ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. సింగపూర్ వంటి చిన్న దేశం ఆర్థికంగా వృద్ధి చెందడానికి అక్కడున్న అధినాయకుడి నిర్ణయాలే ప్రధాన కారణమని, ఉన్నత లక్ష్యాలున్న నాయకుడు మన రాష్ట్రానికి ఉండటంతో.. తెలంగాణ కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు.

### సీఎం కేసీఆర్‌కు పూర్తి అవగాహన



రాష్ట్రాభివృద్ధి విషయంలో సీఎం కేసీఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉన్నదని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కల్యాణలక్ష్మి పథకం వల్ల రాష్ట్రంలో బాల్యవివాహాలు నిలిచిపోయాయని చెప్పారు. కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని, మత్స్యకారులకు ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. ఇన్ని విశిష్టమైన పథకాలు అమలవుతూ, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతుంటే.. 'ఇది రైతు రాజ్యం, ప్రజా రాజ్యం'గా అనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు.

### హ్యాపీనెస్ కార్యక్రమాలతో మెరుగైన ఫలితాలు

ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో హ్యాపీనెస్ కార్యక్రమాల్ని నిర్వహించడం వల్ల అక్కడి విద్యాసంస్థల్లో మెరుగైన ఫలితాలొచ్చాయని కాటేపల్లి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకూ.. విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలుచేశారని చెప్పారు. అక్కడ తొమ్మిదో తరగతి నుంచే ఉద్యోగాల్ని సృష్టించే స్థాయికి ఎదిగేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. 2003 డీఎస్సీ ఉత్తీర్ణులైనవారికి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలని అభ్యర్థించారు. గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని చెప్పారు.

### ఎయిడెడ్ స్కూళ్ల అభివృద్ధి..

రాష్ట్రంలో ఎయిడెడ్ స్కూళ్లను అభివృద్ధి చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సూచించారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం త్వరగా పూర్తిచేయాలని, సాగర్ వరదకాలువకు అదనపు నిధుల్ని వెచ్చించి, త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. మరో సభ్యుడు నారదాసు లక్ష్మణరావు చర్చలో పాల్గొంటూ రాష్ట్రంలో తొమ్మిదివర్గాలకు పెన్షన్లు ఇస్తున్నారని, ఇందుకోసం 40లక్షల మందికి రూ.40 కోట్లను కేటాయించారని తెలిపారు. బడ్జెట్ సంక్షేమానికి అద్దం పడుతున్నదన్నారు.

## భట్టిపై మంత్రి హరీశ్ ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తప్పుడు ఆరోపణలతో సభను సైతం పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్కపై మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. సభకు బేషరుతగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో భట్టి విక్రమార్క పలు అంశాలను ప్రస్తావించారు. అనంతరం మంత్రి హరీశ్ స్పందిస్తూ.. 'ఉమ్మడి ఏపీలో నీలం తుఫాన్ వస్తే ఆంధ్రా జిల్లాలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. కానీ తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ రోజు మేం కిరణ్‌కుమార్‌రెడ్డి చాంబర్ ముందు నిరసన తెలిపితే.. మమ్మల్ని తొక్కుకుంటూ వెళ్లారు తప్ప రూపాయి ఇవ్వలేదు. పదవుల్లో కూర్చొని పెదవులు మూసుకున్నారు. ఐయామ్ చాలెంజింగ్ మిస్టర్ భట్టి విక్రమార్క.. తెలంగాణ వచ్చిన తర్వాత మేం రూ.480 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. సభను ఘోరంగా తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. దానికి మీరు క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్‌చేశారు. మేడిగడ్డపై చుక్క నీరుఎత్తలేదని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం దారుణమని, 52 టీఎంసీల నీటిని మేడిగడ్డ నుంచి ఎత్తినట్టు హరీశ్ చెప్పారు.




epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
ఆట
11
[ కరీంనగర్ ]
శుక్రవారం 13 మార్చి 2020
WWW.NTNEWS.COM

# తలుపులు మూసి తలపడాల్సిందే..

- మైదానాల్లో ప్రేక్షకుల్లేకుండానే ఐపీఎల్ మ్యాచ్‌లు
- కరోనా భయంతో జనసమూహానికి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ 'నో'
- ఏప్రిల్ 15 వరకు విదేశీ క్రికెటర్లకు అనుమతి నిరాకరణ



**ఐపీఎల్ అంటేనే.. ఉత్సాహం, ఉల్లాసం, కేరింతలు, భారీ జనసందోహం.. అభిమాన ఆటగాళ్ల విన్యాసాలు చూసేందుకు బారులు తీరే ప్రేక్షక గణం. అబ్బురపరిచే మ్యాచ్‌లను ప్రత్యక్షంగా ఎలాగైనా తిలకించి తీరాలనుకునే ఫ్యాన్ బ్యాచ్.. ఇసుకేస్తే రాలని జనజాతర..!**

**ఇదంతా ఒకప్పటి మాట.. ఈసారి మాత్రం లీగ్‌కు ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చింది. కరోనా వైరస్ అంతకంతకు ప్రబలుతుండటంతో.. భారీ సంఖ్యలో జనాలు ఒక్క చోట చేరడం మంచిది కాదని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ప్రేక్షకుల్లేకుండా ఖాళీ స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహించుకోవాలని తేల్చిచెప్పింది. దీనికి తోడు విదేశీ క్రికెటర్లకు వచ్చే నెల 15వరకు వీసాలు దొరకని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో అటు విదేశీ ఆటగాళ్లు లేక ఇటు ప్రేక్షకులు లేక కాసులతో గలగలలాడే ఐపీఎల్ కళా విహీనంగా తయారైంది. అసలు లీగ్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇలాగే వైరస్ విజృంభణ కొనసాగితే ఈయేడాది ఐపీఎల్ నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు. శనివారం జరిగే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీలో లీగ్ భవిష్యత్‌పై కీలక నిర్ణయం వెలువడనుంది. మరోవైపు కరోనా వైరస్ కరాళ నృత్యంతో ఇప్పటికే పలు టోర్నీలు వాయిదా పడగా, మరికొన్ని రద్దయ్యాయి.**

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)పై కరోనా ప్రభావం గట్టిగా పడింది. కొవిడ్-19 వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా ఇప్పటికే విదేశీ ఆటగాళ్ల వీసాలపై ఆంక్షలు విధించిన భారత ప్రభుత్వం.. తాజాగా స్టేడియాల్లోకి ప్రేక్షకులను అనుమతించకూడదని నిర్ణయించింది. వచ్చే నెల 15 వరకు క్రీడాపోటీలు వీక్షించేందుకు భారీగా జనాలు గుమిగూడకుండా కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనలు చేసింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో పాటు జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికే విదేశీ ఆటగాళ్లు లేక లీగ్ కళ తప్పుతుందనే అనుమానాలు వ్యక్తమవుతుండగా.. తాజా నిర్ణయంతో మైదానాలు కూడా బోసిపోనున్నాయి. ఈ అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శనివారం జరిగే ఐపీఎల్ పాలక మండలి సమావేశం అనంతరం 13వ సీజన్ నిర్వహణపై ఓ స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

### ఒక్కచోట చేరొద్దనే..

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29న వాంఖడే వేదికగా.. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ 13వ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే కరోనా వైరస్ ప్రభావం వల్ల ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 4 వేల మంది మృత్యువాత పడగా.. లక్ష మందికి పైగా చికిత్స పొందుతున్నారు. మనదేశంలో వైరస్ సోకిన వారి సంఖ్య 70కి చేరడంతో కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలకు దిగింది. 'ఏ క్రీడా పోటీల కోసమైనా భారీ జన సమూహాలు ఒక్కచోట చేరకుండా చూడాలి. వీలైతే టోర్నమెంట్‌లను రద్దు చేయాలి. అలాంటి పరిస్థితి లేనప్పుడు ఖాళీ స్టేడియాల్లో ఆటలు నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రేక్షకులను అనుమతించొద్దు. బీసీసీఐ సహా అన్నీ క్రీడా సమాఖ్యలు వైద్య, ఆరోగ్య శాఖ తాజా ఆదేశాలు పాటించాలని కోరాం' అని కేంద్ర క్రీడా శాఖ కార్యదర్శి రాధేశ్యామ్ జులానియా స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం బుధవారమే దౌత్య, ఉద్యోగ సంబంధిత వీసాలు మినహా.. అన్ని రకాల వీసాలను రద్దు చేసింది. దీంతో వాణిజ్య వీసాల విభాగంలోకి వచ్చే విదేశీ ఆటగాళ్లు భారత్‌కు రావడం కష్టమైపోయింది. ఏప్రిల్ 15 వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అప్పటివరకు లీగ్ తొలి దశ పూర్తయ్యే అవకాశాలున్నాయి. మరి కీలక ఆటగాళ్ల సేవలు కోల్పోవడంతో పాటు ఖాళీ మైదానాల్లో మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఫ్రాంచైజీలు అంగీకరిస్తాయా లేక.. లీగ్ వాయిదాకు పట్టుబడుతాయా అనేది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ పాలక మండలి సమావేశం తర్వాతే ఈ అంశంపై క్లారిటీ రానుంది.

### కరోనా బారిన క్రీడా టోర్నీలు

కరోనా వైరస్ కారణంగా దేశంలో టోర్నీలు వాయిదా పడుతూనే ఉన్నాయి. వైరస్ అంతకంతకు వ్యాప్తిచెందకుండా ఉండేందుకు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నారు. ఇందులో భాగంగా ప్రేక్షకులు లేకుండా జరిపేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు కరోనా వైరస్ బారిన పడ్డ కొన్ని టోర్నీలు ఇవి.

**అథ్లెటిక్స్:** ఫెడరేషన్ కప్ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్(ఏప్రిల్ 6-8)

**బ్యాడ్మింటన్:** ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్(మార్చి 24-29)

**బాస్కెట్‌బాల్:** ఫిబా అర్హత టోర్నీ(మార్చి 18-22)

**క్రికెట్:** ఏప్రిల్ 15వరకు ఐపీఎల్‌లో విదేశీ క్రికెటర్ల ప్రాతినిధ్యంపై సందేహం.

- దక్షిణాఫ్రికాతో లక్నో, కోల్‌కతాలో జరిగే వన్డేలు ప్రేక్షకులు లేకుండానే సాగే అవకాశం
- ప్రేక్షకులు హాజరు లేకుండానే రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ చివరి రోజు ఆట
- రోడ్‌సేఫ్టీ వరల్డ్ సిరీస్ రద్దు(మార్చి 7-22)

**ఫుట్‌బాల్:** ఖాళీ స్టేడియంలో కోల్‌కతా, చెన్నై మధ్య ఐఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్(మార్చి 14)

- భారత్, ఖతార్ మధ్య భువనేశ్వర్‌లో ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్ మ్యాచ్ వాయిదా(మార్చి 26), భారత్, ఆఫ్ఘనిస్థాన్(జూన్ 9)
- సంతోష్ ట్రోఫీ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లు వాయిదా(ఏప్రిల్ 14-27)
- ఐ లీగ్ మిగిలిన 28 మ్యాచ్‌లు ఖాళీ స్టేడియాల్లో నిర్వహణ

**గోల్ఫ్:** ఇండియా ఓపెన్ వాయిదా(మార్చి 19-22)

**పారాస్పోర్ట్స్:** ఆల్ నేషనల్, స్టేట్ చాంపియన్‌షిప్‌లు ఏప్రిల్ 15వరకు వాయిదా

**షూటింగ్:** న్యూఢిల్లీలో ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ ప్రపంచకప్ వాయిదా(మార్చి 15-25)

### ఫ్రాంచైజీలకు ఇబ్బందేంలేదు!

భారీ జన సమీకరణ జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను ఖాళీ మైదానాల్లో నిర్వహించడం కొత్తగా అనిపించినా.. ఈ నిర్ణయం వల్ల ఫ్రాంచైజీలకు వచ్చే నష్టమేమీ లేదు. వాయిదా వేయడం లేదా రద్దు చేయడం కన్నా.. ప్రేక్షకుల్లేకుండా మ్యాచ్‌లు జరిగితేనే మంచిదని ఫ్రాంచైజీ యజమానులు భావిస్తున్నట్లు సమాచారం. టికెట్ల ఆదాయాల్లో ఫ్రాంచైజీలకు వాటా ఉన్నా.. దాని వల్ల వచ్చే నష్టం తక్కువే. ఈ నష్టాలను భర్తీ చేసుకునేందుకు ముందస్తు బీమా సైతం ఉంటుంది. ఇక మైదానంలో యాడ్ రెవెన్యూ రూపంలో కాస్త దెబ్బపడినా.. దానికి రెండింతల మొత్తాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తిరిగి పొందొచ్చు.

### వాళ్లు లేకుంటే..

ఇప్పటి వరకు జరిగిన ఐపీఎల్ 12 సీజన్‌లను గమనిస్తే.. ప్రతిసారి ఎవరో ఒక విదేశీ ఆటగాడు స్టార్‌గా ఎదిగిన విషయం అవగతమవుతుంది. ప్రతి టీమ్‌లో నలుగురు విదేశీ ఆటగాళ్లకు తుది జట్టులో ఉండే చాన్స్ ఉండటంతో.. ప్రపంచవ్యాప్తంగా మంచి పేరున్న ఆటగాళ్లకే ఫ్రాంచైజీలు ఫైనల్ ఎలెవన్‌లో చోటు కల్పిస్తాయి. అలాంటిది విదేశీ ఆటగాళ్లు లేకుంటే మ్యాచ్‌లను చూసే వారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. ఇది లీగ్ మనుగడకే ముప్పు తెచ్చే ప్రమాదం లేకపోలేదు. ప్రేక్షకులను అనుమతించకున్న ఫర్వాలేదు కానీ.. విదేశీ ఆటగాళ్లను ఆడనిస్తే అదే పదివేలు అని ఫ్రాంచైజీల యజమానులు భావిస్తున్నారు.

### ఆటలు అవసరమా..!

మహమ్మారి కారణంగా ప్రాణాలు పోతుంటే ఆటలు అవసరమా అనేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు లీగ్ నిర్వహణకు మొగ్గు చూపడం లేదు. ప్రస్తుతం దేశరాజధాని ఢిల్లీకి వైరస్ భయం పట్టుకోవడంతో అరుణ్‌జైట్లీ-ఫిరోజ్ షా కోట్లాలో మ్యాచ్‌ల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

### బాక్సర్లకు స్పెషల్ వెల్‌కమ్

ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో దుమ్మురేపి తొమ్మిది టోక్యో (2020) బెర్తులు ఖరారు చేసుకొని స్వదేశానికి తిరిగివచ్చిన మన బాక్సర్లను భారత బాక్సింగ్ సమాఖ్య ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచింది.

### ఐఎస్ఎల్ ఫైనల్లో ప్రేక్షకులకు నోఎంట్రీ..

మార్చి 14న గోవా వేదికగా జరుగాల్సిన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫైనల్ మ్యాచ్ కూడా ఖాళీ కుర్చీల మధ్యే జరుగనుంది. ఇక రంజీ ఫైనల్ చివరి రోజు ఆటతో పాటు.. ఇండియా ఓపెన్ కూడా ప్రేక్షకులను అనుమతించకుండానే నిర్వహించనున్నారు. ఇక మహమ్మారి కారణంగా వాయిదా పడ్డ టోర్నీల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది. ఈ వైరస్ ప్రభావం ఇలాగే సాగితే.. టోక్యో ఒలింపిక్స్‌పై ఎఫెక్ట్ పడే అవకాశాలు లేకపోలేదు.



## సింధు ముందడుగు

**సైనా, లక్ష్యసేన్ నిష్క్రమణ**

**బర్మింగ్‌హామ్:** ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆరో సీడ్ సింధు 21-19, 21-15తేడాతో సంగ్ జీహ్యున్(కొరియా)పై విజయం సాధించింది. తొలి రౌండ్ పోటీలో మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ 11-21, 8-21 మూడో సీడ్ అకానే యమగూచి(జపాన్) చేతిలో 28నిమిషాల్లో ఓడి నిరాశ పరిచింది. దీంతో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలంటే ఏప్రిల్ 28లోగా జరిగే టోర్నీల్లో సైనా తప్పనిసరిగా మెరుగ్గా రాణించాల్సిందే. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అద్భుత విజయం సాధించిన భారత యువ కెరటం లక్ష్యసేన్ ప్రిక్వార్టర్స్‌లో 17-21, 18-21తేడాతో రెండో సీడ్ ఆటగాడు విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు. తొలి రౌండ్ పోటీలో పారుపల్లి కశ్యప్ గాయం కారణంగా కాసేపటికే నిష్క్రమించగా.. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత బి సాయిప్రణీత్ 12-21, 13-21తేడాతో జువా జున్‌పెంగ్(చైనా) చేతిలో ఓడాడు.

## 'నిర్బంధం'లో రొనాల్డో



**లిస్బన్:** ప్రమాదకరమైన కరోనా వైరస్ సోకిందేమోననే అనుమానంతో ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను గదికే పరిమితం చేసిన సంఘటన వెలుగు చూసింది. ఇటలీ డిఫెండర్ డానియల్ రుగానికి వైరస్ పాజిటివ్ అని తేలడంతో.. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా రొనాల్డోను అతడి గది నుంచి బయటకు రాకుండా ఆంక్షలు విధించారు. ఇటీవల వీరిద్దరూ మైదానంలో కలిసి ఆడారు. దీనిపై పోర్చుగల్ అధికారులు స్పందిస్తూ.. 'కొద్ది రోజుల క్రితమే రొనాల్డో ఇటలీ నుంచి వచ్చాడు. అతడిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించడం లేదు. అయినా.. రుగానితో కలిసి ఆడిన ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ప్రస్తుతం రొనాల్డో అతడి కుటుంబసభ్యులు మదీరాలో ఉండనున్నారు' అని తెలిపారు.



గురువారం గ్రీస్‌లోని పురాతన స్టేడియంలో సూర్యరశ్మి ఆధారంగా టోక్యో ఒలింపిక్స్ జ్యోతిని వెలిగిస్తున్న గ్రీక్ హీరోయిన్ జార్జియో. కరోనా వైరస్ కారణంగా కొంతమంది ప్రత్యేక ఆహ్వానితుల మధ్య ఈ కార్యక్రమం జరిగింది.

## వర్షార్పణం

**భారత్ -దక్షిణాఫ్రికా తొలి వన్డే రద్దు**

**ధర్మశాల:** న్యూజిలాండ్‌తో వరుస పరాజయాల తర్వాత స్వదేశంలో సత్తాచాటుదామనుకున్న టీమ్‌ఇండియా ఆశలపై వరుణుడు నీళ్లు జల్లాడు. భారీ వర్షం కురువడంతో భారత్ -దక్షిణాఫ్రికా మధ్య గురువారం ఇక్కడి హెచ్‌పీసీఏ మైదానంలో జరగాల్సిన తొలి వన్డే టాస్ కూడా పడకుండానే రద్దయింది. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఇరు జట్ల మధ్య ధర్మశాలలో జరగాల్సిన టీ20 రద్దు కాగా.. ఆరు నెలలు తిరగకముందే వన్డే వర్షార్పణమైంది. బుధవారం భారీ వాన కురవడంతో ఇరు జట్లు ప్రాక్టీస్ సైతం చేయలేకపోగా.. రాత్రి కూడా వర్షం దంచికొట్టింది. దీంతో గురువారం కూడా మైదానాన్ని కవర్లతోనే కప్పిఉంచారు. కాసేపట్లో టాస్ పడుతుందన్న తరుణంలో మళ్లీ వర్షం వచ్చింది. దీంతో మైదానం మరింత చిత్తడిగా మారడం సహా కవర్లపై నీళ్లు భారీగా నిలిచిపోయాయి. దీంతో ఆట సాధ్యం కాదని తేల్చిన అంపైర్లు కటాఫ్ సమయం తర్వాత మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కరోనా వైరస్ భయంతో పాటు వర్షం కారణంగా ప్రేక్షకులు సైతం తక్కువ సంఖ్యలో స్టేడియానికి వచ్చారు.

### ఖాళీ కుర్చీల మధ్యే..

సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేలు లక్నో(మార్చి 15న), కోల్‌కతా(18న) వేదికగా జరుగనున్నాయి. అయితే, కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా క్రీడా పోటీలను జన సమూహం ఏర్పడకుండా నిర్వహించాలని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ సూచనలు జారీ చేసింది. దీంతో భారత్ - దక్షిణాఫ్రికా మధ్య తదుపరి రెండు వన్డేలు ప్రేక్షకులు లేకుండా ఖాళీ కుర్చీల మధ్య జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.



## నిలిచిన బెంగాల్



సాహా (64)

**రాజ్‌కోట్:** బ్యాట్స్‌మెన్ సుదీప్ ఛటర్జీ(241 బంతుల్లో 8), వృద్ధిమాన్ సాహా(184బంతుల్లో 64), అనుస్తూప్ మజుందార్ (134 బంతుల్లో 58నాటౌ ట్) రాణించడంతో రంజీ ట్రోఫీ తుదిపోరులో బెంగాల్ పోటీలోకి వచ్చింది. మ్యాచ్ నాలుగో రోజైన గురువారం ఆట ముగిసే సమయానికి బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కోల్పోయి 354పరుగులు చేసి, సౌరాష్ట్రకు 71పరుగుల దూరంలో నిలిచింది. క్రీజులో మజుందార్, అర్నబ్ నంది(82 బంతుల్లో 28నాటౌట్) ఉన్నారు. 134పరుగులకు 3వికెట్ల వద్ద బెంగాల్ బరిలోకి దిగగా..సుదీప్ ఛటర్జీ, వృద్ధిమాన్ సాహా సహనంతో పోరాడారు. సౌరాష్ట్ర బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి సెషన్‌లో వికెట్ పడకుండా 89పరుగులు జోడించారు. ఆ తర్వాత ఛటర్జీ ఔట్ కాగా, కాసేపటికే సాహా పెవిలియన్ చేరడంతో బెంగాల్‌కు కష్టాలు పెరిగాయి. ఆ తర్వాత వచ్చిన మజుందార్ సాధికారికంగా ఆడాడు. నదీమ్(16) వెనుదిరిగినా కఠినతమైన పిచ్‌పై సహనం ప్రదర్శించాడు. ఆ తర్వాత అతడికి నంది సహకరించడంతో మరో వికెట్ పడలేదు.

## మత్తులో.. దంచికొట్టాడు

*జొహాన్నెస్‌బర్గ్: వన్డే చరిత్రలో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని బద్దలుకొట్టిన జట్టుగా దక్షిణాఫ్రికా సంచలనం సృష్టించి 14ఏండ్లు పూర్తయ్యాయి. 2006 మార్చి 12న జొహాన్నెస్‌బర్గ్‌లో జరిగిన వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 434పరుగులు బాదితే.. సఫారీ బ్యాట్స్‌మెన్ విశ్వరూపం చూపి జట్టును గెలిపించారు. ఆ చరిత్రాత్మక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆటగాడు హర్షల్ గిబ్స్(111 బంతుల్లో 175పరుగులు; 21ఫోర్లు, 7సిక్స్‌లు) సునామీ ఇన్నింగ్స్‌తో విజయంలో కీలకపాత్ర పోషించాడు. అయితే ఆ మ్యాచ్ ముందురోజు గిబ్స్.. స్నేహితుడితో కలిసి అర్ధరాత్రి వరకు ఫుల్‌గా మందుకొట్టాడట. ఆ తర్వాతి రోజు హ్యాంగ్‌ఓవర్‌తోనే బ్యాటింగ్‌కు దిగి, ఆసీస్ బౌలర్లపై విధ్వంసం సృష్టించాడు. ఈ విషయాన్ని గిబ్స్ స్వయంగా తన ఆత్మకథ 'టు ద పాయింట్'లో వెల్లడించాడు. కాగా, ఇప్పటికీ వన్డేల్లో 400 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఛేదించిన అరుదైన రికార్డు దక్షిణాఫ్రికా పేరిటే ఉంది.*




హర్షల్ గిబ్స్



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టులోకి ఉరకలేస్తున్న కాళేశ్వరం జలాలు

# అన్నపూర్ణలోకి 0.22 టీఎంసీలు

- మహాబావి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ శివారులోని మహాబావి నుంచి అన్నపూర్ణ జలాశయంలోకి జలాల ఎత్తిపోత కొనసాగుతున్నది. ఎస్సారార్ క్రస్టుగేట్ల ద్వారా 11.186 కిలోమీటర్ల దూరంలోని అతిపెద్ద సర్జ్‌పూల్‌కు చేరుతున్నాయి. ఇక్కడి నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు జలాలను తరలించేందుకు నాలుగు పంపులు (ఒక్కో మోటర్ 106 మెగావాట్ల సామ ర్థ్యం) ఉండగా, మొ దటిమోటర్ ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం ఆరుగంటలపాటు 1వ నంబర్ మోటర్ నడిపించారు. జలాశయంలోకి 0.22 టీఎంసీల నీరు చేరింది.










## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఈ నెల 4న ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఇంటర్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం (గణితం-1బీ, జంతుశాస్త్రం-1, చరిత్ర-1) పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 4,02,921 మంది నమోదు చేసుకోగా, 3,86,664 మంది పరీక్షలకు హాజరయ్యారని, 96.97 శాతం హాజరు నమోదైందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 29 మంది విద్యార్థులను పట్టుకున్నారని తెలిపారు.

## ఎస్‌ఏ పీహెచ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) పీహెచ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను 17న పరిశీలించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ గురువారం ప్రకటించింది. భౌతికశాస్త్రం, తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమం ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులకు 17న 10.30 గంటలకు, గణితం తెలుగు ఉద్యోగాలకు ఎంపికైనవారికి మధ్యాహ్నం 2.30 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. నాంపల్లిలోని ప్రతిభభవన్‌కు అన్ని ధ్రువపత్రాలతో రావాలని, పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది.

## గ్రాంటుగా నిధులు కేటాయించాలి

### ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు రోడ్ సేఫ్టీ అథారిటీ అధికారుల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రుణం రూపంలో కాకుండా గ్రాంటుగా నిధులు కేటాయించాలని ప్రపంచబ్యాంకు ప్రతినిధులను రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ టీ కృష్ణప్రసాద్ కోరారు. దేశంలో, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ కార్యాలయంలో అధికారులు ప్రాథమికస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రమాదాల నివారణ చర్యలపై చైర్మన్ కృష్ణప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రోడ్ల మరమ్మతు, ఇతర చర్యలకు ప్రపంచ బ్యాంకు రూ.15 వేలకోట్లు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో నిధులను ఏయే రాష్ట్రాలకు ఏ ప్రాతిపదికన కేటాయించాలనే అంశంపై ప్రపంచబ్యాంకు ప్రతినిధులు చర్చించారు.






నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
# జిందగీ
శుక్రవారం 13 మార్చి 2020
/nt.zindagi

ఫొటో.. ఓ అందమైన జ్ఞాపకం. మధురమైన తీపిగుర్తు. ఎంత ఒత్తిడి, బాధలో ఉన్నా.. మనసుకు నచ్చిన ఓ ఫొటోను చూస్తే.. క్షణాల్లోనే నాటి మధుర స్మృతులు గుర్తుకొస్తాయి. ముఖంపై చిరునవ్వు వెలుగుతుంది. అవి తమ బిడ్డల న్యూబార్న్ ఫొటోలైతే.. ఆ ఫీలింగ్ మాటల్లో వర్ణించలేం. అలాంటి మధుర స్మృతులను చాలా అందంగా బంధిస్తున్నది స్మరిత. ఎంతోమంది చిన్నారుల జీవితాల్లో ఈమె మొదటి ఫొటోగ్రాఫర్. ఏమిటీ ఈమె ప్రత్యేకత అంటే.. న్యూబార్న్ బేబీ ఫొటోగ్రఫీ.

# ఆ తీపిగుర్తు స్మరితదే!

**శిశువు పుట్టిన** 14 రోజుల లోపు వారిని అందంగా అలంకరించి ఫొటోలు తీయడాన్నే 'న్యూ బార్న్ బేబీ ఫొటోగ్రఫీ' అంటారు. చాలామంది ప్రెగ్నెన్సీ దగ్గర్నుంచి బిడ్డ పుట్టేవరకూ వివిధ సందర్భాల్లో ఫొటోలు తీయించుకుంటూనే ఉంటారు. ఈ న్యూబార్న్ ఫొటోగ్రఫీ చాలా రిస్క్‌తో కూడుకున్న పని. ఎక్కడ అజాగ్రత్తగా ఉన్నా.. చాలా నష్టం జరుగుతుంది. పిల్లలను ఎత్తుకోవడం దగ్గర్నుంచి, వాతావరణానికి అనుకూలంగా వారికి ఎలాంటి ఫ్రాక్స్ వేయడం, శిశువుల కంఫర్ట్ చూడడం చాలాముఖ్యం. ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలి. ఈ విభాగంలో అన్నింటికీ మించి ఓపిక చాలా అవసరం. ఈ న్యూబార్న్ బేబీ ఫొటోగ్రఫీపై స్మరిత పట్టు సాధించి అందరితో 'వావ్.. అద్భుతం' అనిపించుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'సేఫ్టీ వర్క్‌షాపు'కు వెళ్లింది స్మరిత. ఆ తర్వాత పిల్లలను ఫొటోలు తీయడంపై ఆన్‌లైన్‌లోనే కొంత వెతికింది. ఆమెకు తెలిసిన ఫొటోగ్రాఫర్ల ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకుంది.

**పిల్లలపై ఇష్టంతోనే..**

పిల్లల ఫొటోలు తీయడమంటే స్మరితకు చాలా ఇష్టం. అందుకే కొత్తగా పుట్టిన పిల్లలను ఫొటోలు తీయడం హాబీగా ఎంచుకున్నది. ఆమె గర్వించే మరో విషయం ఏంటంటే.. ఆ చిన్నారుల లైఫ్‌లో ఆమె మొదటి ఫొటోగ్రాఫర్. వారి మొదటి తీపిగుర్తు స్మరిత తీసిన ఫొటోనే. పుట్టిన 14 రోజులు పిల్లలు చాలా కోమలంగా, అందంగా ఉంటారు. అందుకే న్యూబార్న్ బేబీ ఫొటోగ్రఫీపై ఇష్టం పెంచుకున్నది స్మరిత. ఈ విభాగంలో ఆమెకంటూ ప్రత్యేక గుర్తింపు రావడంతో ఎంతోమంది సెలబ్రిటీలు తమ పిల్లల మొదటి ఫొటోలు స్మరితతో తీయించుకున్నారు. వారిలో ప్రముఖంగా మంచు విష్ణు కుమార్తె, మెగాస్టార్ మనవరాలు, శ్రీజ-కళ్యాణ్‌దేవ్ కుమార్తె, దిల్‌రాజు మనవరాలు, అశ్వనీదత్ మనవరాలు ఉన్నారు.

**సోషల్ మీడియానే కారణం..**

స్మరితకు ఇప్పటికీ వారంలో 3-4 ఫొటోగ్రఫీ షూట్‌లు చేయడానికి ప్రధాన కారణం సోషల్ మీడియా. దీని ద్వారానే ఆమెకు 50శాతం అవకాశాలు వస్తున్నాయి. తను తీసిన ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పంచుకుంటున్నది స్మరిత. మంచి లొకేషన్, కలర్‌ఫుల్‌గా, వివిధ యాంగిల్స్‌లో స్మరిత తీసే ఫొటోలు చూసి ఎంతోమంది అభిమానులవుతున్నారు. ఆమె ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో వేలాదిగా ఫాలో అవుతూ.. ప్రోత్సహిస్తున్నారు. కేవలం అభిమానుల కోరిక మేరకే అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చారు స్మరిత. భాగ్యనగరంలో అడుగుపెట్టి కొద్ది నెలలే అయినా.. చాలా పేరు సంపాదించుకున్నది. ఇప్పటివరకు దాదాపు 500లకు పైగా శిశువులకు ఫొటోషూట్ చేసింది స్మరిత.

**యూఎస్‌లో ఏం చేశారు?**

స్మరిత విన్నకోట పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. ఫొటోలు తీయడమంటే ఎంత ఇష్టమో తాను తీసిన ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. ఆ తర్వాత మాస్టర్స్ చేయడానికి యూకే వెళ్లింది. అక్కడ 'ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ డిజైనింగ్'లో మాస్టర్స్ పూర్తి చేసుకున్న తర్వాత హైదరాబాద్‌కు వచ్చింది. అనంతరం అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న నవీన్‌ను పెండ్లి చేసుకొని.. అమెరికాలో 'న్యూబార్న్‌బేబీ ఫొటోగ్రఫీ' చేయడం మొదలుపెట్టింది. కొద్దికాలంలోనే మంచి పేరు సంపాదించింది. యూఎస్‌లో 'బ్యూటీ అండ్ లైఫ్‌స్టైల్ మమ్మీ' మ్యాగజైన్‌లో స్మరిత సభ్యురాలు. ఆ మ్యాగజైన్‌లో వచ్చిన ఫొటోలకు 2017లో 'పేరెంట్స్ చాయిస్ అవార్డ్' వచ్చింది. అదేయేటాబేబీ ఫొటోగ్రఫీ పోటీల్లో రెండోస్థానంలో నిలిచింది. అమెరికాలోని కొన్ని ప్రముఖ మ్యాగజైన్స్‌లో ఆమె తీసిన ఫొటోలు పబ్లిష్ అయ్యాయి. కొన్ని మైల్‌స్టోన్ సెషన్స్ కూడా చేస్తుంటుంది స్మరిత.



© కోనేటి వెంకట్

**మొదట నేనే గుర్తుకురావాలి..**

న్యూబోర్న్ బేబీ ఫొటోగ్రఫీ అంటే మొదట నా పేరే వినిపించాలి. అదే నా లక్ష్యం. నా పని నచ్చి.. నన్ను మళ్లీ ఫొటోషూట్‌కు పిలవడమే నా సక్సెస్. పిల్లలపై చాలా ఇష్టం, ఫొటోగ్రఫీపై ప్యాషన్ ఉంటేనే ఈ రంగంలోకి రండి. ఇందులో విస్తృత అవకాశాలున్నాయి. ఎక్కడ అజాగ్రత్తగా ఉన్నా నష్టాన్ని మాటల్లో వర్ణించలేం. నా ప్రయాణంలో నా భర్త నవీన్, కుటుంబం సపోర్ట్ మర్చిపోలేనిది. ఎవరైనా మీ పిల్లలకు ఫొటోషూట్ చేయించుకోవాలంటే www.smaritavinnakota.com వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

**- స్మరిత విన్నకోట**
**ఫొటోగ్రాఫర్**









... డప్పు రవి



## ఒక్క పోస్టు.. రెండు కోట్లు

మీరు సాధారణంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెడుతుంటారు కదా? వాటికి డబ్బులేమైనా వస్తాయా? కానీ బాలీవుడ్ యాక్టర్ ప్రియాంక చోప్రా పోస్టు పెట్టిందంటే ఆమెకు డబ్బులు వస్తాయి. ఒక్క పోస్టు పెట్టి ఆమె రెండు కోట్లు సంపాదిస్తుంది. అవును.. పెద్ద పెద్ద కంపెనీలు తమ బ్రాండ్‌ల ప్రమోషన్ కోసం ప్రియాంకతో పోస్టు చేయిస్తుంటాయి. ఆమెతోనే ఎందుకంటే.. ఇండియాలోనే ఎక్కువ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్‌ను కలిగిఉన్న హీరోయిన్ ప్రియాంక చోప్రా. ఆమెకు ఐదు కోట్ల డెబ్బైలక్షల ఫాలోవర్లున్నారు. ఆమె పోస్టును కోట్లాది మంది చూస్తూ ఉంటారు. దీంతో ప్రియాంక ఇన్‌స్టాగ్రామ్‌తో బ్రాండ్లను ప్రమోట్ చేసుకుంటున్నాయి. ప్రియాంక అలా ప్రమోట్ చేయాలంటే ఒక్క పోస్టుకు రూ. 2కోట్లు తీసుకుంటున్నది. హోపర్ హెచ్‌క్యూ అనే సోషల్‌మీడియా అనలటిక్స్ సంస్థ ప్రకారం ఇన్‌స్టా గ్రామ్ రిచ్‌లిస్టులో ప్రియాంక 23వ స్థానంలో ఉన్నారు. ప్రియాంక కేవలం బ్రాండింగ్ ప్రమోటర్ మాత్రమే కాదు.. పాంటీన్, గ్లోబల్ సిటిజన్ బట్టల కంపెనీతోపాటు మరెన్నో కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

**వంటింటి చిట్కాలు**

- వేసవి వచ్చేసింది. ఫ్రిజ్‌లో ఐస్‌క్యూబ్స్ పెట్టేముందు ఆ నీటిని కాచి, వడపోయండి.
- గుడ్డును ఓవెన్ 160 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తినొచ్చు.
- ఐస్‌క్రీమ్ బాక్స్‌కు ఓ కవర్ చుట్టి డీప్ ఫ్రీజ్‌లో పెడితే ఎప్పుడైనా తినేందుకు వీలుంటుంది.
- నిమ్మకాయను బాగా నలిపిన తర్వాత కోస్తే.. రసం సులువుగా వస్తుంది.
- చేపల్ని గ్రిల్ చేసేముందు నిమ్మకాయ ముక్కల్ని పరిచి వాటిపై కాల్చితే బాగా రుచిగా ఉంటాయి.

## గర్భిణుల సంరక్షణకు ఓ కోర్సు

**గర్భిణులు ఏం తినాలి? ఎలాంటి బట్టలు ధరించాలి? ఎన్ని గంటలు నిద్రపోవాలి? యోగా చేయొచ్చా ఇలాంటి ప్రశ్నలు ఎదురవుతుంటాయి. తెలిసో తెలియకో చాలా మంది కొన్ని పాటించి అనర్థాలు కొనితెచ్చుకుంటారు. అలాంటి సందేహాలన్నీ తీర్చేందుకు ఓ కోర్సునే ప్రవేశపెట్టింది లక్నోలోని ఓ యూనివర్సిటీ.**



'గర్భ్‌సంస్కార్' పేరుతో లక్నో యూనివర్సిటీ ఈ విద్యా సంవత్సరం నుంచి ఓ డిప్లమా కోర్స్‌ను తీసుకురానుంది. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. యూనివర్సిటీ అధికారులు కోర్సుకు సంబంధించిన గైడ్‌లైన్స్ సిద్ధం చేశారు. ఈ కోర్సులో భాగంగా గర్భంతో ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్యామిలీ ప్లానింగ్, న్యూట్రిషన్ విలువలు, ఎలాంటి మ్యూజిక్ గర్భిణులకు అవసరం. వారితో కుటుంబీకులు ఎలా వ్యవహరించాలి. గర్భిణి కుటుంబీకులతో ఎలా వ్యవహరించాలి, ఫిట్‌గా ఉండటం ఎలా వంటి అంశాల్ని బోధిస్తారు. దంపతులకు ఆరోగ్యకరమైన బిడ్డను అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కోర్సును చాలామంది మాతృమూర్తులు, గైనకాలజిస్టులు సపోర్ట్ చేస్తున్నారు. ఆడ, మగ తేడా లేకుండా ఎవ్వరైనా ఈ కోర్సులో చేరవచ్చు.



## హస్తకళ.. బహుమతికి కొత్తకళ



భువనేశ్వర్‌కు చెందిన నజీయ హస్తకళా నైపుణ్యంతో గుర్తింపు పొందుతున్నది. కస్టమైజ్డ్ వస్తువుల స్టార్టప్‌తో బహుమతులకు కొత్త అర్థాన్ని ఇస్తున్నది. చిన్నగా మొదలైన ఆమె కళాకృతుల తయారీ కార్పొరేట్ కంపెనీలను సైతం ఆకర్షించింది. సెరామిక్ వస్తువులు, అందమైన యాంటిక్స్, మినియేచర్ బహుమతులు అన్నీ చేతితో తయారు చేసినవే. మొదట్లో వీటి గురించి చెప్పినా ఎవరూ వినడానికి సిద్ధంగా ఉండకపోయేవారనీ, ఇప్పుడు మాత్రం స్పందన వస్తున్నదని నజీయా చెప్పున్నది. 2014లో భువనేశ్వర్‌లో ప్రారంభించిన ఆమె తర్వాత రోజుల్లో ఢిల్లీకి వెళ్లింది. అక్కడ ఆర్టిస్టులను సంప్రదించి కస్టమైజ్డ్ వస్తువుల తయారీ స్టార్టప్ 'లవ్లీ అబెషన్స్'ను ప్రారంభించింది. దీన్ని భిన్నమైన బహుమతులతో కస్టమర్లను ఆకర్షిస్తున్నది. మహిళగా ఆమె స్వయం కృషిని గుర్తించిన మైక్రో, స్మాల్ మీడియమ్ డిపార్ట్‌మెంట్ నజీయాకు ఉత్తమ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును అందించింది. 'నేను ఒక అభిరుచినీ, లక్ష్యాన్ని ఎంచుకున్నాను.. దాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నా 'అని నజీయా అంటున్నది.



## అరచేతిలో అరుదైన పుస్తకాలు

పురాతన పుస్తకాలు కావాలంటే గ్రంథాలయాలకు పరుగెడతాం. సమయం, శ్రద్ధ పెట్టి చూస్తే ఏదో ఓ షెల్ఫ్‌లో కనిపిస్తాయి. అవి కూడా దుమ్ముపట్టి, చిరిగిపోయి ఉంటాయి. అలాంటి పుస్తకాల్లో పేజీలు తిరగేయడమూ కష్టంతో కూడుకున్న పనే. కానీ ఆ బాధలు లేకుండా ఎంత పాత పుస్తకాలైనా ఫోన్‌లోనే చదువుకోవచ్చు. బెంగళూరులో ఇటీవలే 'ఈ-సార్వజనిక గ్రంథాలయ' ఆప్‌ను ప్రారంభించారు. ఇందులో 15వ శతాబ్దం నుంచి ప్రచురించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లో 1.13 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ వివిధ లైబ్రరీల నుంచి సేకరించి పొందుపర్చిన పుస్తకాలు. ఒక పుస్తకానికి వారం రోజులకు రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది. యాప్ ద్వారా, ఇంటర్నెట్‌లో ఎక్కడైనా చదువుకోవచ్చు. ఇందులోని పుస్తకాలు డౌన్‌లోడ్ చేసుకోవడానికి మాత్రం వీలుండదు.




## స్లీవ్‌లెస్ వేసుకుంటున్నారా?

**మహిళల వ్యక్తిత్వాన్ని, వారిలోని ఆధునికతను బయటపెట్టే వస్త్రధారణల్లో స్లీవ్‌లెస్ ఒకటి. సందర్భాన్ని బట్టి చీర, జీన్స్ మొదలు పలు వస్త్రధారణలకు టాప్‌గా స్లీవ్‌లెస్ బాగుంటుంది.**

- సన్నగా, పొడుగ్గా ఉన్న వారి అందాన్నిస్లీవ్ లెస్ రెట్టింపు చేస్తుంది .
- సాదా లేదా ప్రింటెడ్ చీరలు ధరించే వారు స్లీవ్ లెస్ ధరిస్తే మరింత అందంగా కనిపిస్తారు.
- జీన్స్ మీద స్లీవ్‌లెస్ టాప్ వేసుకొంటే అమ్మయిలూ అదుర్స్.
- చేతులు, భుజాల కింద వేక్సింగ్ చేసుకోవాలి.
- మంచి బాడీ లోషన్‌తో చేతులకు మసాజ్ చేసుకోవాలి.
- నెలలో 2 సార్లు మేనిక్యూర్ చేయించాలి.
- ఎండ వల్ల చేతులు నల్లబడితే సన్ స్క్రీన్ లోషన్ వాడాలి.
- భుజాల కింద పౌడర్ లేదా డియోడ్రెంట్ వాడాలి.
- డీప్‌నెక్ లేదా స్లీవ్‌లెస్ కాటన్ సూట్ ధరించడం వల్ల ఎండ వేడిని తప్పించుకోవచ్చు.



## కాళ్లు లేకపోతేనేం.. కష్టపడి టీచరైంది

**ఆమె కాళ్లు ఫ్లోరైడ్‌వల్ల చిన్నప్పుడే చచ్చుబడిపోయాయి. అయినా బాధపడలేదు. సంకల్ప బలం ముందు ఎంతటి సమస్య అయినా తలవంచాల్సిందే అని నిరూపించింది. కష్టపడి చదివి.. లక్ష్యాన్ని ముద్దాడి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సంపాదించింది.**

**కామారెడ్డి** జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేడు గ్రామానికి చెందిన పట్లోళ్ల రేణుక విజయగాథ ఇది. చిన్నప్పుడే ఫ్లోరోసిస్ వ్యాధి సోకడంతో ఎటూ కదల్లేని స్థితి. తల్లిదండ్రులు లక్ష్మారెడ్డి, గంగలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. సంపాదించిందంతా రేణుక జబ్బు కోసమే ఖర్చు పెట్టారు. అయినా ఫలితం శూన్యం. తిరగడం వృథా అన్నారు డాక్టర్లు. ఇక బిడ్డను చదివించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ఓడిన వైకల్యం :** ఇరవై ఎనిమిదేళ్ల రేణుక చిన్నతనం నుంచి చాలా చురుకు. నడవడానికి కాళ్లు లేకపోయినా అన్నింట్లోనూ పోటీ పడేది. ఒకటో తరగతి నుంచే చదువుల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంది. నాలుగో తరగతి వరకు స్థానిక పాఠశాలలో చదివిన ఆమె.. ఐదు నుంచి పదో తరగతి వరకు అచ్చంపేటలో చదివింది. నిజామాబాద్‌లో ఇంటర్మీడియెట్.. హైదరాబాద్ ఆంధ్ర మహిళాసభ కాలేజీలో డిగ్రీ.. బీఈడీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ.. సిద్ధిపేటలో డైట్ చదివింది. ఇలా అలుపెరగని చదువులతో రేణుక నిత్యం ఉక్కు సంకల్పంతో చదివేది.

**ఫలించిన కష్టం:** రేణుక ఇప్పటికీ తల్లిదండ్రులకు పసిపాపే. విధి ఆడిన నాటకంలో తన బిడ్డకు సంక్రమించిన ఫ్లోరోసిస్ వల్ల వారు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అన్నీ వదిలేసి బిడ్డే సర్వస్వంగా బతికారు. స్కూల్ నుంచి మొదలుపెట్టుకుంటే ఇప్పటివరకూ రేణుక ఏమి చేయాలన్నా వారే. ఎక్కడికి వెళ్లాలన్నా వాళ్లే తోడు. కష్టాన్ని దిగమింగుకొని బిడ్డకు వైకల్యం తెలియకుండా అలారుముద్దుగా పెంచారు రేణుకను. తల్లిదండ్రుల కష్టం తెలిసిన బిడ్డగా రేణుక ఏనాడూ సమయాన్ని వృథా చేయలేదు. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. ఎస్జీటీ గ్రేడ్-2 ఉద్యోగం పొంది నేడు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నది. సొంత జిల్లా కామారెడ్డిలోనే పోస్టింగ్ పొందింది. నిజాంసాగర్ మండలానికి 30 కిలో మీటర్ల దూరంలోని పెద్ద కొడప్‌గల్ మండలం కాస్లాబాద్‌లో పోస్టింగ్ దక్కింది. ఉపాధ్యాయురాలిగా మూడ్రోజుల క్రితం విధుల్లో చేరి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది.

**పట్టరాని ఆనందం:** రేణుక చిన్నప్పుడే ఫ్లోరోసిస్‌కు గురవడం.. భవిష్యత్ ఏమవుతుందో అని భయపడటం నుంచి నేడు ఆ సమస్యను ఎదుర్కొని విజేతగా నిలవడం పట్ల తల్లిదండ్రులు పట్టరాని ఆనందంతో ఉన్నారు. తనతో చదువుకున్న విద్యార్థులు.. స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేణుక సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి సోదరి ఉద్యోగం సాధించడం గర్వంగా ఫీలవుతున్నాడు. తల్లిదండ్రులు పడిన కష్టానికి ఫలితం దక్కిందని అన్నారు.

**తల్లిదండ్రుల కృషి ఫలితం**

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. నాకీ ఉద్యోగం రావడం కన్నా నన్ను కంటికి రెప్పలా చూసుకున్న నా తల్లిదండ్రుల కృషికి ఫలితం దక్కిందనే ఆనందం ఎక్కువగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి పాటుపడతాను.

**-రేణుక**





... జూపల్లి రమేష్
కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

II.
నమస్తే తెలంగాణ
జిందగీ+
[ కరీంనగర్ ]
శుక్రవారం 13 మార్చి 2020

నేడు వరల్డ్ స్లీప్ డే



# నిదురపో.. కమ్మగా!

ఒకప్పుడు.. ఉదయం 4 గంటలకు లేచేవాళ్లు.. రాత్రి 8 గంటలకు పడుకునేవాళ్లు. కాని ఇప్పుడు అంతా ఉల్టా పుల్టా. ఐటి ఉద్యోగాల పుణ్యమా అని ఇప్పుడు చాలామందికి రాత్రి పగలు.. పగలు రాత్రి. దాంతో శరీర జీవగడియారం దెబ్బతింటోంది. పిల్లలు కూడా రాత్రిపూట ఎక్కువసేపు మెలకువతో ఉండి చదువుకోవడమో, టీవీ చూడడమో చేస్తున్నారు. పెద్దలు మొబైల్‌లోనే రాత్రంతా గడిపేస్తున్నారు. ఇలా అలవాట్లన్నీ మారడంతో సుఖంగా నిద్రించడం ఇప్పుడు అందని ద్రాక్ష అయింది. నిద్ర పట్టడం లేదనీ, సరిపోవట్లేదనీ అనేవాళ్ల సంఖ్య పెరిగింది. మనదేశంలో 17 శాతం జనాభా నిద్రకు సంబంధించిన సమస్యలతో సతమతం అవుతున్నారు. 10 శాతం మందికి అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా ఉంటోంది. దురదృష్టవశాత్తు ఆహార, వ్యాయామాలకు ఇచ్చినంత ప్రాముఖ్యతను నిద్రకు ఇవ్వం. నిద్ర లేకపోవడాన్ని ఒక సమస్యగానే పరిగణించం. కానీ నిద్రలేమి, గురక లాంటి సమస్యలు గుండెజబ్బుల్లాంటి సమస్యలనూ తీసుకు రావొచ్చు. నిద్ర బావుంటే.. జీవితం బావుంటుందన్న సందేశం ఇస్తున్న వరల్డ్ స్లీప్ డే సందర్భంగా సుఖంగా నిద్రించాలంటే ఏం చేయాలో చూద్దాం.



**ఏ యంత్రం** అయినా ఆగకుండా పనిచేస్తే వేడెక్కిపోతుంది. కొద్దిసేపు రెస్ట్ ఇస్తే మరింత బాగా పనిచేస్తుంది. మానవ యంత్రం కూడా అంతే. దానికీ రెస్ట్ కావాలి. కానీ ఇప్పుడెవరికీ ఆ విశ్రాంతి ఉండడం లేదు. మనకు ఉన్న 24 గంటల్లో 16 గంటలు మెలకువతో ఉంటాం. 8 గంటలు నిద్రకు కేటాయించాలి. మనం నిద్రించే సమయంలోనే మన శరీరం తన లోపాలన్నీ సవరించుకుంటుంది. శరీరం అంతటా మరమ్మతులు చేసుకుని, మర్నాటి ఉదయానికి సరికొత్త శక్తితో రెడీ అవుతుంది. ఈ 8 గంటల నిద్ర సరిగా లేకపోతే మిగిలిన 16 గంటల మెలకువ సమయం అంతా డిస్టర్బ్ అవుతుంది. ఈ సమయంలో మన రోజువారీ పనులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. ఆరోగ్యం గురించి అవగాహన ఉన్న వాళ్లు కూడా ఆహార, వ్యాయామాలకు ఇచ్చిన ప్రాముఖ్యత నిద్రకు ఇవ్వడం లేదు. అందుకే నిద్రకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయి.

## నిద్ర అంటే?

**నిద్రలో రెండు స్థాయిలు ఉంటాయి.**

ఆర్ఇఎం (ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్) స్లీప్, ఎన్ఆర్ఇఎం (నాన్ ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్) స్లీప్ అని రెండు స్థాయిల్లో నిద్ర ఉంటుంది. ఈ రెండు రకాల నిద్ర స్థాయిలు ఒకదాని తరువాత ఒకటిగా వరుసగా వస్తుంటాయి. ఒక ఎన్ఆర్ఇఎం, ఒక ఆర్ఇఎం కలిపి ఒక నిద్ర వలయంగా చెప్తారు. ఈ నిద్ర వలయాలు 5 పూర్తయితేనే మనకు నిద్ర పూర్తిగా సరిపోయిందని అర్థం. ప్రతి సైకిల్‌కి 90 నుంచి 100 నిమిషాల టైం పడుతుంది. 5 సైకిల్స్ పూర్తవడానికి 8 గంటలు పడుతుంది. కాబట్టి రోజుకి 7 నుంచి 8 గంటల నిద్ర అవసరం అవుతుంది. ఎన్ఆర్ఇఎం స్లీప్‌లో ఎన్1, ఎన్2, ఎన్3 అని మూడు స్టేజిలుంటాయి. ఎన్3 స్టేజిలోనే మనం గాఢనిద్రలో ఉంటాం. ఎన్ఆర్ఐఎం మూడు స్టేజిల తర్వాత ఆర్ఇఎం స్లీప్ ప్రారంభం అవుతుంది. ఆర్ఇఎంలో ఉన్నప్పుడు కళ్లు మూసుకునే అటూ ఇటూ కదులుతాయి. శరీరంలో డయాఫ్రమ్ తప్ప ఏ భాగంలోనూ కదలిక ఉండదు. ఎన్3, ఆర్ఇఎం స్టేజిలో ఉన్నప్పుడే శరీరంలో రిపేర్లు జరుగుతాయి. అందుకే ఈ నిద్ర డిస్టర్బ్ కావొద్దు. నిద్రలో సమస్యలు ఉన్నవాళ్లు ఎన్1, ఎన్2 స్టేజిల్లో మాత్రమే ఉంటారు. ఎన్3, ఆర్ఇఎం స్లీప్ స్థాయికి వెళ్లరు. అందుకే వాళ్లకు అనేక సమస్యలు వస్తాయి.

## నిద్ర సమస్యలు

నిద్ర ఆటంకాలు – ఉద్యోగం, అలవాట్ల వంటి కారణాల వల్ల ప్రతిరోజు నిద్ర ఆలస్యం అవుతుంటుంది. 7–8 గంటల నిద్ర కన్నా తక్కువ ఉంటుంది. టెక్నాలజీ రాత్రిపూట వాడేవాళ్లు, రాత్రి డ్యూటీలు చేసే డ్రైవర్లు, డాక్టర్లు, ఇతర వృత్తుల వాళ్లు, విద్యార్థులలో ఈ సమస్య ఉంటుంది. తగినంత నిద్ర లేకపోయినా ఏదో ఒక విధంగా నెట్టుకొస్తుంటారు. దాంతో రోజువారీ పనులపై ప్రభావం పడి, నైపుణ్యాలు తగ్గుతాయి. క్రమంగా మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది.



నిద్రలేమి (ఇన్‌సామ్నియా) – నిద్ర రావడమే కష్టం అవుతుంది. ఒకవేళ నిద్ర పట్టినా దాన్ని పూర్తిగా మెయిన్‌టెయిన్ చేయలేరు. మధ్యలో మెలకువ వచ్చేస్తుంది. ఇది ముఖ్యంగా ఐటి ఉద్యోగులు, మహిళల్లో ఎక్కువగా ఉంటుంది.

### కారణాలు

- ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకుని, లేవకపోవడం
- డ్రగ్స్, కొన్నిరకాల మందులు తీసుకోవడం
- కాఫీ, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం
- క్రానిక్ ఫాటిక్ సిండ్రోమ్
- అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా
- స్ట్రెస్ సంబంధ సమస్యలు
- డిప్రెషన్, యాంగ్జయిటీ
- ఎండోక్రైన్ సమస్యలు
- హైపర్ థైరాయిడ్, పార్కిన్‌సన్స్
- దీర్ఘకాల నొప్పులు

### నిద్రలేమి - రకాలు

**అడ్జస్ట్‌మెంట్ ఇన్‌సామ్నియా** – స్ట్రెస్, కొత్త పరిసరాలకు సర్దుబాటు కాకపోవడం
**పారాడాక్సికల్ ఇన్‌సామ్నియా** – అసలు నిద్రే పట్టదు.
**ఇడియోపతిక్ ఇన్‌సామ్నియా** – ఏ కారణమూ ఉండదు.
**సైకో సోషల్ ఇన్‌సామ్నియా** – మానసిక, సామాజిక కారణాల వల్ల ఆలోచనలతో నిద్ర పట్టకపోవడం



### స్లీప్ అప్నియా - పరిణామాలు

- మెదడులోని పారాసింపథెటిక్, సింపథెటిక్ యాక్టివిటీల మధ్య సమతుల్యత దెబ్బతినడం వల్ల గుండె కొట్టుకునే రేటు పెరుగుతుంది. బీపీ పెరుగుతుంది.
- ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్ వల్ల ఎండోథీలియల్ పనితీరు దెబ్బతింటుంది. ఫలితంగా అరిథిమియాస్ (హృదయ స్పందన సమస్యలు), సెరిబ్రో వాస్క్యులర్ డిసీజ్ (పక్షవాతం), అథెరోస్క్లెరోసిస్, మయోకార్డియల్ ఇష్కిమిక్ డిసీజ్ (గుండెపోటు) రావొచ్చు.
- రాత్రిపూట నిద్రలో లేవడం వల్ల పగటి సమయం పనిచేయలేరు.
- నీరసంగా తయారవుతారు.

అన్నింటికన్నా బెస్ట్. దీంట్లో హాస్పిటల్‌లో, టెక్నీషియన్ పర్యవేక్షణలో ల్యాబ్‌లో పాలీ సోమ్నోగ్రఫీ చేస్తారు. లెవల్ 2 హాస్పిటల్‌లోనే చేస్తారు గానీ టెక్నీషియన్ ఉండరు. లెవల్ 3, 4లలో ఇంట్లో చేసుకునే పాలీసోమ్నోగ్రఫీ. అయితే డయాబెటిస్, బీపీ లాంటి కాంప్లికేషన్లు ఉన్నవాళ్లు ఇంట్లో చేయొద్దు. డాక్టర్ పర్యవేక్షణలోనే చేయించుకోవాలి.

- అప్నియా–హైపోప్నియా ఇండెక్స్. దీనిలో 5–15 మధ్య మైల్డ్ అనీ, 15–30 ఉంటే మాడరేట్, 30 పైన ఉంటే తీవ్రమైన స్లీప్ అప్నియాగా పరిగణిస్తారు.

### చికిత్స ఉందా?

వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స ఉంటుంది. మైల్డ్ స్లీప్ అప్నియాకు ముక్కుకు సంబంధించిన చిన్న చిన్న సర్జరీలు అవసరం అవుతాయి. బరువు తగ్గాలి. అవసరమైతే సి–ప్యాప్ మెషిన్ వాడాల్సి ఉంటుంది. మాడరేట్, తీవ్రమైన స్లీప్ అప్నియాకు సి–ప్యాప్ మెషిన్ తప్పనిసరి.

సి–ప్యాప్ అంటే కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్‌వే ప్రెషర్ అని అర్థం. ముక్కుకు ఒక మాస్క్ లాగా ఉండే చిన్న పరికరం సి–ప్యాప్. దాని లోపలి నుంచి పాజిటివ్ ప్రెషర్ వచ్చి ముక్కు లోపలి గాలి మార్గాన్ని వెడల్పు చేస్తుంది. దాంతో శ్వాస సక్రమంగా వెళ్లి గురక తగ్గుతుంది.

సి–ప్యాప్ చికిత్సల్లో కూడా కొత్తవి వచ్చాయి. ఆటో సి–ప్యాప్ అయితే దాని నుంచి వచ్చే పాజిటివ్ ప్రెషర్‌ని అవసరానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోవచ్చు. బైలెవల్ పాజిటివ్ ఎయిర్‌వే ప్రెషర్ పరికరం సిఓపీడీ, ఒబెసిటీ ఉన్నవాళ్లకు వెంటిలేషన్‌ని కూడా అందిస్తుంది. ఇటీవల వచ్చిన కొత్త సి–ప్యాప్ పరికరాన్ని డాక్టర్ ఇంటి దగ్గర కూర్చుని కూడా దాన్ని కంట్రోల్ చేయవచ్చు. ఇవి కాకుండా నేసల్, ఓరో నేసల్ ఇంటర్‌ఫేసెస్ కూడా ఉన్నాయి.

బరువు తగ్గించే సర్జరీలు కూడా స్లీప్ అప్నియా సమస్యను తగ్గించే అవకాశం ఉంది. ఈ సర్జరీ చేయించుకుంటే సి–ప్యాప్ పరికరం నుంచి తీసుకోవాల్సిన ప్రెషర్‌ను కూడా తగ్గించుకోవచ్చు.

### సెంట్రల్ స్లీప్ అప్నియా

ఇది చాలా తీవ్రమైన స్లీప్ అప్నియా. పార్కిన్‌సోనిజమ్ లాంటి నాడీ సంబంధ సమస్యలున్నప్పుడు, ఆర్నాల్డ్ చియారీ మాల్ ఫార్మేషన్లు ఉన్నప్పుడు, ఓపియాడ్ డ్రగ్ వాడడం, ఎక్కువ ఎత్తు గల ప్రాంతాల్లో ఉండడం, హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల ఈ సెంట్రల్ స్లీప్ అప్నియా సమస్య వస్తుంది. దీనికి ఏ కారణమూ ఉండకపోవచ్చు కూడా. న్యూరో, గుండె సంబంధిత సమస్యలుండి నిద్రలో సమస్య ఉంటే సెంట్రల్ స్లీప్ అప్నియా ఉండే అవకాశం ఉంటుంది. ఇది ఎమర్జెన్సీ స్థితి. ఈ స్థితి ఉన్నప్పుడు సాధారణ శ్వాస చైన్ స్టోక్స్ బ్రీతింగ్ ప్యాటర్న్‌లోకి మారుతుంది. ఈ బ్రీతింగ్ ప్యాటర్న్ ఉంటే వెంటనే చికిత్స మొదలుపెట్టాలి. చికిత్సలో భాగంగా ఆక్సిజన్ పెడతారు. ఆధునిక పద్ధతుల్లో స్లీప్ ట్రీట్‌మెంట్స్ ఇస్తారు.



### అనుబంధాలు తల్లకిందులు

స్లీప్ అప్నియా వల్ల వచ్చే సున్నితమైన, ముఖ్యమైన సమస్య గురక. గురక పెట్టి నిద్ర పోతున్నారంటే గాఢనిద్రలో ఉన్నారని అనుకుంటుంటారు. నిజానికి గాఢనిద్ర కాదు గదా.. మామూలుగా కూడా వాళ్లు నిద్రసుఖాన్ని అనుభవించలేరు. దాంతో పాటు శ్వాస సరిగా అందక ఇబ్బంది పడుతారు. బాగా అలసిపోయి, నిద్రపోతున్నారులే అనుకుంటే అసలుకే ఎసరు వస్తుంది. స్లీప్ అప్నియా శారీరక సమస్యలనే కాకుండా మానసిక, సామాజిక సమస్యలను కూడా తీసుకొస్తుంది. ఈ గురక వల్ల విడాకులు అయినవాళ్లు కూడా ఉన్నారు. కాంప్లికేషన్లేవీ లేనప్పుడు గురక తాత్కాలికంగా ఉంటుంది. కానీ స్లీప్ అప్నియా వల్ల గురక దీర్ఘకాలం ఉంటుంది. నిద్రపోయే సమయంలో సగం టైం గురక పెడితే, అలాంటివాళ్లకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంది. గురకతో పాటుగా బీపీ, షుగర్, ఒబెసిటీ కూడా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని కలవాలి.

### అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా

మన జనాభాలో 10 శాతం మందికి స్లీప్ అప్నియా ఉన్నట్టు అంచనా. గాలి మార్గాల్లో అడ్డంకు ఏర్పడడం వల్ల శ్వాసలో ఆటంకం ఏర్పడడమే స్లీప్ అప్నియా. సాధారణంగా నిద్రలో ఉన్నప్పుడు ఫారింక్స్ దగ్గరి కండరంలో నాడీ చర్యలు తగ్గిపోతాయి. కండరం పట్టు సడలుతుంది. దాంతో నాలుక వెనక్కి జారుతుంది. ఏదైనా సమస్య ఉన్నవాళ్లకు గాలిమార్గం సన్నగా ఉండడం వల్ల ఇలా వెనక్కి జారిన నాలుక గాలి వెళ్లడానికి ఆటంకాన్ని కలిగిస్తుంది. అందువల్ల శ్వాసలో ఇబ్బంది ఏర్పడి నిద్రలో ఉలిక్కిపడి లేస్తుంటారు. ముక్కు ద్వారా గాలి వెళ్లడానికి అవరోధం వల్ల నోటిద్వారా గాలి పీల్చుకుంటారు. గురక పెడుతారు. క్రేనియో ఫేషియల్ నిర్మాణంలో తేడాలు ఉండడం వల్ల పురుషుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.

### కారణాలు

- స్థూలకాయం
- పొగతాగడం, ఆల్కహాల్
- హైపోథైరాయిడ్
- గడ్డం భాగం లోపలికి ఉండడం (రెట్రోగ్నాథియా)
- పిల్లల్లో అడినాయిడ్స్, టాన్సిల్స్
- పుట్టుకతో వచ్చే జన్యు సమస్యలు

- జ్ఞాపకశక్తిపై ప్రభావం ఉంటుంది.
- లైంగిక ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మధుమేహం ఉన్నవాళ్లకు కంట్రోల్‌లో ఉండదు.
- మెటబాలిక్ సిండ్రోమ్
- పగటి సమయంలో మగతగా ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయి. స్కూల్‌లో, ఉద్యోగాల్లో నైపుణ్యం తగ్గుతుంది.

### ఎలా నిర్ధారిస్తారు?

సమస్య నిర్ధారణలో భాగంగా స్లీప్ స్టడీస్ చేస్తారు. ఇందు కోసం కొన్ని ప్రశ్నలు ఇచ్చి, వాటి రిజల్ట్ ఆధారంగా తీవ్రత గుర్తిస్తారు.

- ఎప్స్ వర్త్ స్లీప్ స్కేల్‌లో రిజల్ట్ 11 పాయింట్ల కన్నా ఎక్కువ ఉంటే స్లీప్ అప్నియా ఉందని అర్థం.
- స్టాప్ బ్యాంగ్ (స్నోరింగ్, టైర్డ్‌నెస్, అబ్సర్వ్‌డ్ ఈవెంట్స్, బీపీ) బిఎంఐ – 35 కన్నా ఎక్కువ, ఏజ్ – 50 ఏళ్ల పైన, నెక్ – చుట్టుకొలత పురుషుల్లో 17 అంగుళాలు, స్త్రీలలో 16 అంగుళాలు, జెండర్ – పురుషుల్లో ఎక్కువ. ఇవి పరీక్షించిన తరువాత ఇచ్చిన ప్రశ్నల్లో 8కి 4 పాయింట్లు వస్తే రిస్క్ ఎక్కువగా ఉన్నట్టు గుర్తించి స్లీప్ స్పెషలిస్టు దగ్గరికి పంపిస్తారు.
- స్లీప్ స్టడీ – ఇది నాలుగు లెవల్స్‌లో ఉంటుంది. లెవల్ 1



### పీడియాట్రిక్ స్లీప్ అప్నియా

చిన్న పిల్లల్లో వచ్చే స్లీప్ అప్నియా ఇది. అడినాయిడ్స్, టాన్సిల్స్ లాంటి సమస్యలున్నప్పుడు పిల్లల్లో నిద్ర డిస్టర్బ్ అవుతుంది. వాచిపోయిన అడినాయిడ్స్, టాన్సిల్స్ గాలి మార్గానికి అవరోధాన్ని కలిగిస్తాయి. దాంతో చిన్న పిల్లలు నోరు తెరుచుకుని నిద్రపోతారు. అంటే నోటి ద్వారా శ్వాస పీల్చుకుంటుంటారు. గురక కూడా వస్తుంది. పదే పదే జలుబు రావడం, పదే పదే అడినో టాన్సిలైటిస్ సమస్య రావడం, దాంతో పాటు ఈ సమస్యలుంటే స్లీప్ అప్నియాకు దారితీయవచ్చు. ఈ సమస్య ఉన్న పిల్లలు హైపర్‌యాక్టివ్‌గా ఉంటారు. అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివ్ డిజార్డర్ రావొచ్చు. చదువులో వెనుకబడుతారు. శారీరకంగా, మానసికంగా నీరసంగా కనిపిస్తారు. ఇలాంటప్పుడు ఇఎన్‌టి డాక్టర్‌ను కలిసి అడినాయిడ్స్, టాన్సిల్స్ చికిత్స తీసుకోవాలి. చాలావరకు వీటిని తీసేసిన తరువాత బాగవుతారు. అయినా సమస్య ఉంటే స్లీప్ స్పెషలిస్ట్‌ని కలవాలి.



### హాయిగా నిద్రపోవాలంటే..

- సుఖవంతమైన నిద్రకు ముఖ్యమైన మార్గం జీవనశైలిలో మార్పులు చేసుకోవడమే. ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పరుచుకోవాలి.
- ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం చేయాలి.
- ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. మసాలాలు, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి.
- ప్రతిరోజూ కనీసం అద్దగంటైనా వాకింగ్ చేయాలి.
- మధ్యాహ్నం తరువాత కాఫీ, టీలు ఇక తీసుకోవద్దు.
- మంచాన్ని పడుకోవడానికి మాత్రమే ఉపయోగించాలి. మంచంలో కూర్చుని లాప్‌టాప్‌లో పనిచేసుకోవడం, మొబైల్ చూడడం, పుస్తకం చదువుకోవడం వంటివి చేయొద్దు.
- పడక గదిలో ఎక్కువ కాంతి లేకుండా చాలా తక్కువ వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- పెద్ద శబ్దంతో మ్యూజిక్ ఉండొద్దు.
- కొంతమంది ఉదయం అయిదింటికి లేవాల్సి ఉంటే 4 గంటల నుంచి అలార్మ్ పెట్టుకుంటుంటారు. ఇలా చేయవద్దు. అనవసరమైన అలారమ్‌లు పెట్టుకోవద్దు.
- ఆల్కహాల్, స్మోకింగ్ లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.
- పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే డిన్నర్ పూర్తి చేయాలి.
- రాత్రిపూట వ్యాయామం, వాకింగ్ చేయొద్దు.

**డా. విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్**
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్
యశోద హాస్పిటల్స్, మలక్‌పేట్
హైదరాబాద్, 8121022333



# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## స్విమ్స్‌లో

**తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 06
- **పోస్టులు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్, ఆక్సలరీ నర్స్ మిడ్‌వైఫ్.
- **అర్హతలు:** పోస్టును బట్టి పదోతరగతి, ఏఎన్ఎం సర్టిఫికెట్, సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎ/ ఎమ్మెస్సీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 22
- **వెబ్‌సైట్:** http://svimstpt.ap.nic.in

## బీవోబీ టెక్నాలజీస్‌లో

**బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) అనుబంధ సంస్థ బరోడాసన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 39
- **పోస్టులు:** టెక్నాలజీ ఆర్కిటెక్ట్, ప్రోగ్రాం మేనేజర్, బిజినెస్ అనలిస్ట్, డేటా ఇంజినీర్, డాటా అనలిస్ట్, ఇంటిగ్రేషన్ ఎక్స్‌పర్ట్, యూఐ/యూఎక్స్ డిజైనర్ తదితర పోస్టులు ఉన్నాయి.
- **అర్హతలు:** బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో , **చివరితేదీ:** మార్చి 27
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

## నిక్‌మర్‌లో ప్రవేశాలు

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ (నిక్‌మర్) పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది.**



- **కోర్సులు:** పీజీ ప్రోగ్రాములు
- **కాలవ్యవధి:** ఏడాది, రెండేండ్లు
- **విభాగాలు:** అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిగ్రీ లేదా డిగ్రీ ఉత్తీర్ణత.
- **ప్రవేశాలు కల్పించనున్న క్యాంపస్‌లు:** హైదరాబాద్, పుణె, గోవా, ఢిల్లీ ఎన్‌సీఆర్.
- **ఎంపిక విధానం:** నిక్‌మర్ కామన్ అడ్మిషన్ టెస్ట్ లేదా క్యాట్/ గేట్ వంటి జాతీయస్థాయి పరీక్షల స్కోర్, ఇంటర్వ్యూ, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 29
- **వెబ్‌సైట్:** https://nicmar.ac.in

## ఐఐఎంలో ఫ్యాకల్టీలు

**బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- **మొత్తం ఖాళీలు:** 20
- **విభాగాలు:** అకౌంటింగ్, కమ్యూనికేషన్స్, ఎకనమిక్స్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** https://www.iimb.ac.in

## కోజికోడ్ ఐఐఎంలో

**కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో పీజీ కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**




- **కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ ఫైనాన్స్
- **కాలవ్యవధి:** రెండేండ్ల ఫుల్‌టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీతో పాటు క్యాట్/జీఆర్ఈ లేదా జీమ్యాట్ స్కోర్.
- **ఎంపిక:** మూడుదశల్లో ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **రాతపరీక్ష/ఇంటర్వ్యూ:** ఏప్రిల్‌లో
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** http://www.iimk.ac.in

# నవీపేట మేకల సంత
# @ 40.77 లక్షలు

**నవీపేట:** నిజామాబాద్ జిల్లా నవీపేట మేకల సంత రికార్డు స్థాయిలో రూ.40.77 లక్షల ధర పలికింది. గురువారం సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన సంత వేలంపాట నిర్వహించారు. 80 మంది ఒక్కొక్కరు రూ.లక్ష దరావతుగా చెల్లించి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 9 నెలలకు రూ.17 లక్షలు పలుకగా, ఈసారి మూడింతలు పెరిగింది. నవీపేటకు చెందిన మదారుద్దీన్ రూ.40.77 లక్షలకు సంతను దక్కించుకున్నారు.



కేరళ లో బర్డ్‌ఫ్లూ వెలుగుచూడటంతో కోజికోడ్ జిల్లా వెంగేరి, కొడియాత్తూర్ ప్రాంతంలో కోళ్లు, పెంపుడు పక్షులను సంహరించేందుకు తీసుకెళ్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

# కోళ్లను చంపుతున్న కేరళ సర్కార్

- బర్డ్‌ఫ్లూ నివారణకు చర్యలు

**తిరువనంతపురం, మార్చి 12:** బర్డ్‌ఫ్లూ నివారణ చర్యల్లో భాగంగా కేరళ ప్రభుత్వం కోళ్లను సంహరిస్తున్నది. కోజికోడ్ జిల్లా వెంగేరి, కొడియాత్తూర్ ప్రాంతంలోని కోళ్లకు ఎవియన్ ఇన్‌ఫ్లుయెంజా సోకింది. దీంతో ఆయా కోళ్ల ఫారాలకు కిలోమీటరు పరిధిలోని కోళ్లు, పెంపుడు పక్షులను సంహరించే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఈ నేపథ్యంలో పౌల్ట్రీ యజమానులకు నష్టపరిహారం చెల్లించనున్నది. రెండు నెలల వయస్సున్న ఒక్కొక్క కోడికి రూ.200, అంతకంటే తక్కువ వయస్సున్న ఒక్కొక్క కోడిపిల్లకు రూ.100 చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నారు. ధ్వంసం చేసిన కోడిగుడ్లకు కూడా ఒక్కొక్కదానికి రూ.ఐదు చొప్పున పరిహారం చెల్లిస్తారు. బర్డ్‌ఫ్లూకు కేంద్రంగా ఉన్న వెంగేరి, పశ్చిమ కొడియాత్తూర్ ప్రాంతాలకు పది కిలోమీటర్ల దూరంలోని కోళ్లఫారాలు, చికెన్, కోడిగుడ్ల దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

## తెలంగాణ ఉద్యమకారుడు
# బీరెల్లి లక్ష్మణ్‌రావు కన్నుమూత

**మాక్లూర్:** తెలంగాణ ఉద్యమకారుడు, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ముల్లంగి(బి) గ్రామానికి చెందిన బీరెల్లి లక్ష్మణ్‌రావు(55) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. 2001 నుంచి చనిపోయే వరకు టీఆర్‌ఎస్‌లోనే ఉన్న బీరెల్లి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సకలజనుల సమ్మె, నిరాహార దీక్షలు, జైల్‌భరోలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత టీఆర్‌ఎస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. లక్ష్మణ్‌రావుకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.



లక్ష్మణ్‌రావు(ఫైల్)



## రెబల్ ఎమ్మెల్యేలకు
# స్పీకర్ నోటీసులు

- రాజీనామాలపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం
- 16న బలనిరూపణకు ఒత్తిడి: బీజేపీ ప్రకటన
- మేము సిద్ధమే.. ముందు ఆ ఎమ్మెల్యేల సంగతి తేలాలి: కాంగ్రెస్

**భోపాల్, మార్చి 12:** మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం మరో మలుపు తిరిగింది. తమ పదవులకు రాజీనామా చేసిన 22 మంది కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలకు స్పీకర్ ప్రజాపతి గురువారం నోటీసులు జారీ చేశారు. శుక్రవారంలోగా తన ముందు హాజరుకావాలని, స్వచ్ఛందంగా రాజీనామా చేశారా.. లేక ఎవరైనా ఒత్తిడి తెచ్చారా అన్నదానిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు సీఎం కమల్‌నాథ్ ప్రభుత్వం బలనిరూపణకు ఆదేశించాలని స్పీకర్‌ను కోరుతామని బీజేపీ తెలిపింది. బీజేపీ చీఫ్ విప్ నరోత్తమ్ మిశ్రా విలేకరులతో మాట్లాడుతూ 'ఈ నెల 16 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. కాబట్టి అదే రోజు కమల్‌నాథ్ ప్రభుత్వం బలాన్ని నిరూపించుకునేలా చూడాలని గవర్నర్‌ను, స్పీకర్‌ను కోరుతాం' అని తెలిపారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, బీజేపీ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మెజారిటీని కోల్పోయిందని ఆరోపించారు. బీజేపీ అధికార ప్రతినిధి రజనీశ్ అగర్వాల్ మాట్లాడుతూ కమల్‌నాథ్ ప్రభుత్వం బలనిరూపణకు ఆదేశించాలని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజునే స్పీకర్‌పై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు. బీజేపీ నేతల డిమాండ్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ స్పందించారు. 'బలనిరూపణకు సిద్ధమేనని సీఎం కమల్‌నాథ్ ఇప్పటికే స్పష్టంగా చెప్పారు. నేను కూడా అదే మాట చెబుతున్నా. కానీ బలనిరూపణ పరీక్ష కంటే ముందే రాజీనామా చేసిన ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. 'రాజీనామా చేసిన ఎమ్మెల్యేలతో స్పీకర్ విడివిడిగా సమావేశమవుతారు. స్వచ్ఛందంగా రాజీనామా చేశారా? ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా? అన్న విషయాలను అడిగి తెలుసుకుంటారు. తర్వాత ఆయన ఓ నిర్ణయం తీసుకుంటారు. ఒకవేళ స్పీకర్ ఆ 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తే.. తర్వాత బలనిరూపణ పరీక్ష నిర్వహించుకోవచ్చు' అని దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల రాజీనామా కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమని బీజేపీ నేతలు చెప్తున్నారని, కానీ ఇదే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా పత్రాలను బీజేపీ నేతలు స్పీకర్‌కు సమర్పించారని విమర్శించారు. దీనిబట్టి ఈ తతంగం వెనుక ఎవరు ఉన్నారో అర్థమవుతున్నదని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బీజేపీ ఎలాంటి ఎత్తుగడలు వేస్తున్నదో.. ఎలాంటి అడ్డదారులు తొక్కుతున్నదో దేశ ప్రజలు అర్థం చేసుకుంటారన్న నమ్మకం తనకు ఉన్నదని పేర్కొన్నారు.



మధ్యప్రదేశ్ స్పీకర్ ప్రజాపతి

# పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేకశ్రద్ధ

## వ్యర్థాల సేకరణకు కొత్తపద్ధతులు

- సిరిసిల్లలో బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు
- ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తున్న సంగారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పురపాలకశాఖ ప్రత్యేకదృష్టి సారించింది. కొత్త మున్సిపాలిటీలు తమ స్థానిక అవసరాలకు తగ్గట్టుగా పారిశుద్ధ్యంపై అత్యుత్తమ పద్ధతులను అవలంబిస్తున్నాయి. కొన్ని మున్సిపాలిటీలు ఘనవ్యర్థాల డంపింగ్ సైట్లను సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కులుగా అభివృద్ధిచేస్తున్నాయి. అందులో మంచినీటి సౌకర్యం, సెక్యూరిటీ, ప్రహరీ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. పార్కుల్లో సువాసనలు వెదజల్లే మొక్కలను నాటుతున్నారు. కంపోస్టును ఆయా పార్కుల్లోనే వినియోగిస్తున్నారు. మున్సిపాలిటీల్లో చెత్తను సేకరించే వాహనాలను జీపీఆర్‌ఎస్‌కు అనుసంధానించి పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ కార్మికులకు బయోమెట్రిక్ హాజరువిధానాన్ని అమలు చేస్తుండటంతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తవుతున్నాయి. సిరిసిల్ల, బోడుప్పల్, సిద్దిపేట వంటి మున్సిపాలిటీలు 100 శాతం ఇండ్లనుంచి చెత్తను సేకరిస్తున్నాయి.

### వ్యర్థాల విక్రయంతో ముగ్గురికి జీతాలు

పొడివ్యర్థాల సేకరణలో మెట్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేకతను చాటుకుంటున్నది. నివాసవాణిజ్య సముదాయాల నుంచి పారిశుద్ధ్యకార్మికులు విధిగా పొడివ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్లాసులు, ప్లాస్టిక్ బాటిళ్లు, థర్మకోల్, అల్యూమినియం క్యాన్లు, బాక్సులు వంటివాటిని మున్సిపల్ ఆవరణలోనే వేరుచేస్తున్నారు. వ్యర్థాలను విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో ముగ్గురు కార్మికులకు జీతాలను చెల్లిస్తున్నారు.

### వినూత్నంగా వ్యర్థాల సేకరణ

వ్యర్థాల సేకరణకు ఆయా మున్సిపాలిటీలు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నాయి. సిరిసిల్లలో 16.25 ఎకరాల్లో బయోగ్యాస్ ట్రీట్‌మెంట్ ప్లాంటును ఏర్పాటుచేసి మార్కెట్, హోటల్‌వంటగదులో లభించే వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. సిద్దిపేట్‌లో ప్రత్యేకంగా కంపోస్టు యార్డును ఏర్పాటుచేసి ప్రతిరోజు సుమారు 28 టన్నుల వ్యర్థాలను సేకరించి శుద్ధీకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఘనవ్యర్థాల నిర్వహణ పార్కును నిర్మించారు. ప్రతిరోజు ఐదు మెట్రిక్ టన్నుల ఘనవ్యర్థాలను పునరుత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. భువనగిరిలో మున్సిపల్ చెత్తను సేకరించి శుద్ధీకరించడానికి వర్మి కంపోస్టు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టీవీలు, రిమోట్‌లు, కూలర్లు వంటి 82 రకాల పాత ఎలక్ట్రానిక్ వస్తువుల సేకరణలో సంగారెడ్డి మున్సిపాలిటీ ముందంజలో ఉన్నది. ఇందుకోసం సంషోధన్, ఈవేస్టఎక్స్ఛేంజ్.కామ్ వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొన్నది. నిటరీ నాప్‌కిన్ల వ్యర్థాలను కాల్చివేసేందుకు పీర్జాదిగూడ కార్పొరేషన్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. షీ టాయిలెట్ల వద్ద ప్రత్యేక యంత్రాలను ఏర్పాటుచేసి న్యాప్‌కిన్లను కాల్చివేస్తున్నారు.



సిద్దిపేటలోని బయోగ్యాస్ ప్లాంట్



ప్లాంట్‌లో వేసేందుకు సిద్ధంగా ఉన్న వ్యర్థాలు

### సేంద్రియ వ్యర్థాలతో కంపోస్ట్

జల్‌పల్లి మున్సిపాలిటీ సేంద్రియ వ్యర్థాలతో కంపోస్టు తయారుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. మున్సిపల్ సిబ్బంది ప్రతి రోజు కూరగాయల మార్కెట్లు, పార్కులు, వీధుల్లో ఎండుఆకులను సేకరిస్తున్నారు. వీటిసాయంతో కంపోస్ట్ ఎరువును తయారుచేసి ఇతర మున్సిపాలిటీలు, నర్సరీలు, ప్రజలకు కిలోకు ఐదురూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతిరోజు గరిష్ఠంగా రెండు టన్నుల కంపోస్టును తయారుచేస్తున్నారు.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం



వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని కృష్ణా పరీవాహక ప్రాంతాల నుంచి అలివి వలలను స్వాధీనం చేసుకుంటున్న మత్స్యశాఖ అధికారులు

# అలివి వలలు స్వాధీనం

## కృష్ణానదీ తీరంలో అధికారుల దాడులు

**చిన్నంబావి:** కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో అధికారులు నిఘా పెట్టడంతో నిత్యం అలివి వలలు దొరుకుతున్నాయి. 'అలివిగాని వల' శీర్షికన ఇటీవల 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు కృష్ణానదీ తీరంలో నిత్యం దాడులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన చెల్లెపాడు, పొలికూరు గ్రామాల్లో గురువారం వనపర్తి జిల్లా మత్స్యశాఖ ఏడీ రెహ్మాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించిన రెండు అలివి వలలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిషేధిత అలివి వలలతో చేపల వేట కొనసాగితే చర్యలు తీసుకుంటామని ఏడీ రెహ్మాన్ హెచ్చరించారు.

# పర్యాటక దరిగా గోదారి

- మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి దాకా అభివృద్ధి
- తాజాగా బడ్జెట్‌లో రూ.300 కోట్లు

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతలతో పునర్జీవం పొందిన గోదావరి తీరం కనులవిందు చేయనున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ నుంచి మొదలుకొని పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి బరాజ్‌దాకా కాళేశ్వరం లింక్-1తో కళకళలాడుతున్న 110 కిలోమీటర్ల గోదావరి పరివాహక ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం తాజా బడ్జెట్‌లో రూ.300 కోట్లు కూడా మంజూరుచేసింది. కాళేశ్వరంతో 110కిలోమీటర్ల గోదావరి సజీవంగా మారింది. దీనికితోడు దట్టమైన చెట్లు, పొలాలతో ప్రకృతి రమణీయతకు ఈ ప్రాంతం అద్దంపడుతున్నది. గత ఫిబ్రవరి 13న కాళేశ్వరం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ విషయమై ఆయన పలుమార్లు పర్యాటక, నీటిపారుదల శాఖల అధికారులతో చర్చలు కూడా జరిపారు. అనుకున్నట్టుగానే బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు. పర్యాటకంలో భాగంగా ఇప్పటికే గోదావరిపై నిర్మించిన బరాజ్‌లను బ్రిడ్జిలుగా అభివృద్ధి చేయడంతో ఇటు జయశంకర్ భూపాలపల్లి, అటు మహారాష్ట్రలోని సిరివంచ జిల్లాలతోపాటుగా.. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణాసౌకర్యం మెరుగుపడనున్నది. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి బరాజ్ దాకా గోదావరి నిండుకుండలా ఉండగా.. లక్ష్మీ, సరస్వతి, పార్వతి బరాజ్‌లు, గోదావరిఖని గోదావరి బ్రిడ్జి, ఎల్లంపల్లి బరాజ్‌లు, పంప్‌హౌజ్‌ల వద్ద పర్యాటకులు ఆహ్లాదాన్ని పొందేలా తీర్చిదిద్దనున్నట్టు అధికారులు చెపుతున్నారు. బోటింగ్, బృందావన్ గార్డెన్‌లా ఫౌంటెయిన్‌లు, అమ్యూజ్‌మెంట్ వాటర్ పార్కులు ఏర్పాటుచేయనున్నారు. నదికి ఇరువైపులా దాల్‌లేక్‌లా ఆకర్షణీయంగా మొక్కలు పెంచనున్నారు.



గోదావరిఖని బ్రిడ్జి వద్ద నిండుగా నదీప్రవాహం



గోదావరి తీరాన పరుచుకున్న పచ్చదనం

## ఢిల్లీ అల్లర్ల కేసులో
# ఇద్దరు పీఎఫ్ఐ సభ్యుల అరెస్టు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో అల్లర్లకు కుట్రపన్ని నిధులు సమకూర్చారనే ఆరోపణలపై పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన ఢిల్లీ శాఖ అధ్యక్షుడు సహా సంస్థ కార్యదర్శిని ఢిల్లీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మహమ్మద్ ఇలియాస్, పర్వేజ్ అహ్మద్‌లను ఢిల్లీ ప్రత్యేక సెల్ పోలీసులు అరెస్టుచేసినట్టు అధికారులు తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో అల్లర్లకు నిధులు సమకూర్చినవారిని గుర్తించినట్టు హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో వెల్లడించిన మరుసటిరోజే ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి. గత నెలలో జరిగిన ఢిల్లీ అల్లర్లలో 50 మందికిపైగా చనిపోగా, 200 మందికిపైగా గాయపడ్డారు. ఇలియాస్ ఢిల్లీలోని శివ్‌విహార్ నివాసి, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరవల్‌నగర్ నియోజకవర్గం నుంచి సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) అభ్యర్థిగా పోటీచేశారు. సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు పీఎఫ్ఐ నిధులు సమకూర్చిన విషయమై ప్రత్యేక సెల్‌తోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. పీఎఫ్ఐపై, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్‌శర్మ హత్య కేసులో అరెస్టయిన తాహిర్ హుస్సేన్‌పై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసులు నమోదుచేసింది. మరో పీఎఫ్ఐ సభ్యుడు మహమ్మద్ డానిష్ ఢిల్లీ అల్లర్ల నేపథ్యంలో గతంలోనే అరెస్టయ్యాడు. సీఏఏ వ్యతిరేక నిరసనల్లో పీఎఫ్ఐ పూర్తిస్థాయిలో పాలుపంచుకుందని డానిష్ పోలీసుల ఎదుట అంగీకరించాడు. అతను 2018 నుంచి పీఎఫ్ఐలో పనిచేస్తూ.. ఢిల్లీలోని త్రిలోక్‌పురి ప్రధాన కార్యదర్శిగా ఉన్నాడు. ఢిల్లీ పోలీస్ క్రైమ్‌బ్యాంచ్ సోమవారం తాహిర్ హుస్సేన్ సోదరుడు షాఆలంను, అతనికి ఆశ్రయం ఇచ్చిన మరో ముగ్గురిని కూడా అరెస్టు చేసింది. ఢిల్లీ అల్లర్ల కేసులో హుస్సేన్‌ను ఈ నెల 6న ఏడురోజుల పోలీస్ కస్టడీకి పంపారు. ముందస్తు బెయిల్ వినతిని ఢిల్లీ కోర్టు గతంలోనే తిరస్కరించింది. దేశవ్యాప్తంగా సీఏఏ వ్యతిరేక నిరసనలకు సుమారు రూ.120 కోట్ల వరకు నిధులు సమకూర్చిన పలు బ్యాంకు ఖాతాలను గుర్తించినట్టు ఈడీ జనవరిలోనే వెల్లడించింది.



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని సురంగల్‌లో చేనులోనే టమాటా పంటను వదిలేసిన రైతు

## దిగుబడి ఘనం..
# ధర శూన్యం

### మార్కెట్‌లో ధరలు పలుకక చేనులోనే టమాట పూలనూ వదిలేస్తున్న రైతులు

**మొయినాబాద్ :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర రాక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పెట్టిన పెట్టుబడిసైతం రావడంలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయలు, పూలతోటల సాగు పెద్దఎత్తున జరుగుతున్నది. ఈ సారి పంటల దిగుబడి ఆశించిన దానికంటే అధికంగా ఉన్నప్పటికీ కోత సమయంలో మార్కెట్‌లో ధర నేలచూపు చూస్తున్నది. చాందిని, బంతి కిలో రూ.10, టమాట రూ.2 నుంచి 3 మాత్రమే పలుకుతున్నది. దీంతో కూలి ఖర్చులు, రవాణా చార్జీలు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చేళల్లోనే పంటను వదిలేస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ముర్తుజాగూడలో చేనులోనే వదిలేసిన గులాబీలు

# సీఎం పదవిపై ఆశ లేదు

- ఓట్లు చీల్చేందుకైతే రాజకీయాల్లోకి రాను
- ప్రజలు సైద్ధాంతిక మార్పు కోరుకుంటేనే పార్టీ పెడతా
- అభిమానులకు తమిళ సూపర్‌స్టార్ రజనీ స్పష్టీకరణ

**చెన్నై, మార్చి 12:** తనకు సీఎం పదవిపై ఆశ లేదని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలిపారు. కేవలం ఓట్లు చీల్చేందుకే అయితే రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం తనకు లేదన్నారు. తమిళనాడు ప్రజలు, యువత సైద్ధాంతిక మార్పు కోరుకుంటేనే పార్టీ పెడతానని స్పష్టం చేశారు. గురువారం చెన్నైలోని ఓ హోటల్‌లో తన అభిమానులనుద్దేశించి రజనీకాంత్ మాట్లాడారు. 'నేను ఎప్పుడూ ముఖ్యమంత్రి కావాలని ఆశపడలేదు. కలలో కూడా అలా ఊహించలేదు' అని వ్యాఖ్యానించారు. రాజకీయంగానూ, పాలనావ్యవస్థలో మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పారు. ఈ మార్పు ఇప్పుడు రాకపోతే ఎప్పుడూ కూడా సాధ్యంకాదన్నారు. 'ఇది మంచి అవకాశం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సైద్ధాంతిక మార్పునకు ప్రజలు, యువత ఉద్యమించాలి. ద్రవిడ నేతలైన జయలలిత, కరుణానిధి లేని రాజకీయ శూన్యతను పూడ్చాలి. అది జరిగితేనే ఏఐఏడీఎంకే, డీఎంకే పక్కకు తప్పుకుంటాయి. అప్పుడే నేను ప్రతిపాదించిన పార్టీ అధికారంలోకి వచ్చి మంచి పాలన అందిస్తుంది. మార్పు కోరుకునే రాజకీయ విప్లవం రావాలని నేను కోరుతున్నా. అది జరుగుతుందని గట్టిగా నమ్ముతున్నా. అలా జరుగని పక్షంలో నా రాజకీయ ప్రవేశం కేవలం 15 నుంచి 20 శాతం ఓట్లు చీల్చేందుకే ఉపయోగపడుతుంది. కేవలం ఓట్లు చీల్చేందుకే నేను రాజకీయాల్లోకి రావాలా? ఆ అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. తన వయసు (71)తోపాటు ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలే 'తనకు చివరి అవకాశమని' రజనీకాంత్ భావోద్వేగంతో చెప్పారు. తన పార్టీలో యువతే కీలమన్నారు. విద్యావంతుడు, నిజాయితీపరుడు, ఆత్మ విశ్వాసం ఉన్న యువకుడ్ని ముఖ్యమంత్రిగా నిలబెడతానన్నారు. సీఎం అభ్యర్థి మహిళ కూడా కావచ్చన్నారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య తాను వారధిగా ఉంటానని రజనీకాంత్ స్పష్టం చేశారు. పార్టీ పేరు, ఎప్పుడు ప్రారంభిస్తారన్నది మాత్రం వెల్లడించలేదు. దీంతో అభిమానులు మరోసారి నిరాశకులోనయ్యారు.



గురువారం చెన్నైలో అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న రజనీకాంత్

# అల్లుడు అదుర్స్



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా సంతోష్ శ్రీనివాస్ రౌతు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. సుమంత్ మూవీ ప్రొడక్షన్స్ పతాకంపై సుబ్రహ్మణ్యం గొర్రెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'అల్లుడు అదుర్స్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నభా నటేష్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. ఏప్రిల్ 30న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'కుటుంబ విలువలకు వినోదాన్ని జోడిస్తూ రూపొందిస్తున్న చిత్రమిది. బెల్లంకొండ శ్రీనివాస్ పాత్ర స్టైలిష్‌గా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం. వేసవిలో అన్ని వర్గాల ప్రేక్షకులకు చక్కటి ఆహ్లాదాన్ని పంచే చిత్రమిది' అని చిత్రబృందం తెలిపింది. ప్రకాష్‌రాజ్, సోనూసూద్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: ఛోటా.కె.నాయుడు, యాక్షన్:రామ్‌లక్ష్మణ్.



రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్ పిలుపునందుకొని గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ జీహెచ్‌ఎంసీ పార్క్‌లో మొక్కలు నాటుతున్న కాదంబరి కిరణ్, ఏడిద శ్రీరామ్, శివాజీరాజా, శివ కందుకూరి, రాజ్ కందుకూరి, బెనర్జీ, ఆర్‌పీ పట్నాయక్, కెయస్ రామారావు, కాశీవిశ్వనాథ్, గ్రీన్ ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, కిషోర్ గౌడ్.

# సాయితేజ్ కొత్త చిత్రం

సాయితేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దేవా కట్టా దర్శకుడు. నివేదా పేతురాజ్ కథానాయిక. జె.జి.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్‌కల్యాణ్ క్లాప్‌నివ్వగా, అల్లు అరవింద్ కెమెరా స్విఛాన్ చేశారు. వంశీపైడిపల్లి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'వినూత్న కథాంశమిది. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరింది. సాయితేజ్‌ను నూతన పంథాలో ఆవిష్కరించే చిత్రమవుతుంది. జగపతిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. రమ్యకృష్ణ, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, సంగీతం: మణిశర్మ, ఎడిటర్: కె.ఎల్.ప్రవీణ్, ఆర్ట్: శ్రీకాంత్ రామిశెట్టి, పాటలు: సుద్దాల అశోక్‌తేజ, రెహమాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సతీష్ బీకేఆర్, కథ, మాటలు, దర్శకత్వం: దేవా కట్ట.



# సూపర్‌హీరో సందేశం



శివ కార్తికేయన్

శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శక్తి'. పి.ఎస్. మిత్రన్ దర్శకుడు. కేజీఆర్ స్టూడియోస్, గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై కోటపాడి జే రాజేష్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. తమిళ చిత్రం 'హీరో'కు అనువాదమిది. కల్యాణి ప్రియదర్శన్ కథానాయిక. అర్జున్, అభయ్ డియోల్, ఇవానా కీలక పాత్రధారులు. ఈ నెల 20న ఈ చిత్రం విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'సూపర్‌మాన్, స్పైడర్‌మాన్ స్ఫూర్తితో తెరకెక్కించిన చిత్రమిది. విద్యావ్యవస్థలోని అసమానతలపై ఓ సూపర్‌హీరో ఎలాంటి పోరాటం సాగించాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. యథార్థ ఘటనల ఆధారంగా రూపొందించాం. అన్ని భాషలకు కనెక్ట్ అయ్యే చక్కటి ఇతివృత్తమిది' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'సార్వజనీన కథాంశమిది. శివకార్తికేయన్ చేసే సాహసాలు రొమాంచితంగా ఉంటాయి. అర్జున్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తించే మంచి సందేశాత్మక సినిమా ఇది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: జార్జి.సి. విలియమ్స్.



రష్మిక మందన్న

# మహిళా ప్రధాన చిత్రంలో..

కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నది పూజాహెగ్డే. తొలిసారి మహిళా ప్రధాన కథాంశంతో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది ఈ మంగళూరు సొగసరి. హను రాఘవపూడి దర్శకత్వంలో పూజా హెగ్డే కథానాయికగా ఓ సినిమా తెరకెక్కబోతున్నట్లు తెలిసింది. లేడీ ఓరియెంటెడ్ ఇతివృత్తంతో స్ఫూర్తిదాయకంగా ఈ సినిమా సాగుతుందని సమాచారం. నటనాపరంగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించుకునే అవకాశం ఉండటంతో పూజా హెగ్డే ఈ సినిమాను అంగీకరించినట్లు చెబుతున్నారు. ప్రయోగాత్మక పంథాలో ఆమె పాత్ర ఉంటుందని తెలిసింది. స్వప్నదత్, ప్రియాంకదత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు చెబుతున్నారు. జూలైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పూజాహెగ్డే ప్రభాస్ సినిమాతో పాటు అఖిల్ సరసన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రంలో నటిస్తున్నది.



పూజాహెగ్డే

# విమర్శలే సోపానాలు

విమర్శల్ని తాను నిర్మాణాత్మకంగా స్వీకరిస్తానని, స్వీయలోపాల్ని సరిదిద్దుకోవడానికి అవి ఉపకరిస్తాయని చెప్పింది కన్నడ సోయగం రష్మిక మందన్న. అయితే ఎదుటివారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కువిమర్శల్ని తాను అస్సలు పట్టించుకోనని అంటోంది. 'విమర్శలు అవసరమే. అవి పనిలో అలసత్వాన్ని దరి చేయకుండా కాపాడుతాయి. నటిగా పరిణితి సాధించడానికి తోడ్పడుతాయి. నేను నటించిన సినిమా విడుదలైన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితుల్ని అడిగి వారి అభిప్రాయాల్ని తెలుసుకుంటాను. కొందరు మోహమాటం కొద్దీ నా నటన సూపర్బ్ అంటూ మెచ్చుకుంటుంటారు. మరికొందరు ఫలానా సన్నివేశంలో నేను తేలిపోయానని ముక్కుసూటిగా తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తారు. అందరి మాటలను నేను సహృదయంతో స్వీకరిస్తాను. మరో సినిమాలో ఆ తప్పులు జరగకుండా చూసుకుంటా. అలా నేను నటనలో కొంతవరకు పరిణితి సాధించా' అని చెప్పుకొచ్చింది రష్మిక మందన్న. ఇటీవల విడుదలైన 'భీష్మ' చిత్రంతో చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం తెలుగులో సుకుమార్-అల్లు అర్జున్ సినిమాలో నటిస్తోంది.

# షడ్రుచుల వినోదం



రాజ్‌తరుణ్, మాళవికా నాయర్

రెండున్నర గంటల పాటు నవ్వించే పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్ ఇదని అన్నారు రాజ్‌తరుణ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా'. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. కొండా విజయ్‌కుమార్ దర్శకుడు. మాళవికా నాయర్ కథానాయిక. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. గురువారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఏ జోనర్‌లో సినిమా చేయాలో అర్థంకాని అయోమయంలో మూడేళ్లు నాలో నేను మథనపడిపోయాను. ఆ సంశయం నుంచి బయటపడి వినోదాత్మక కథాంశాన్ని ఎంచుకొని అందరిని అలరించే సినిమా చేశాను. ఉగాది పచ్చడిలా షడ్రుచులు అన్ని ఉన్న సినిమా ఇది. పక్కింటి కుర్రాడిలా రాజ్‌తరుణ్ కనిపిస్తారు. మాళవికా పాత్ర సహజంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. యువతరంతో పాటు కుటుంబ వర్గాల్ని అలరించే వాణిజ్య హంగులన్నీ ఉన్న సినిమా ఇదని, వందశాతం వినోదాన్ని పంచుతుందని, టైటిల్‌తో పాటు ఇటీవల విడుదలైన పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నదని నిర్మాత తెలిపారు. దర్శకుడు విజయ్‌కుమార్ తనలో స్ఫూర్తిని నింపుతూ మంచి నటనను రాబట్టుకున్నారని మాళవికా నాయర్ చెప్పింది. ఈ కార్యక్రమంలో ఐ ఆండ్రూ, వేణు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవి స్ఫూర్తితో..



జీపీఎస్

'నాకు ఎలాంటి సినీ నేపథ్యం లేదు. చిన్నతనం నుంచే హీరో అవ్వాలనే కోరిక బలంగా ఉండేది. చిరంజీవిగారిని స్ఫూర్తిగా తీసుకొని సినీరంగంలోకి వచ్చాను' అని అన్నారు జీపీఎస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమపిపాసి'. మురళీరామస్వామి దర్శకుడు. నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా హీరో జీపీఎస్ గురువారం పాత్రికేయులతో ముచ్చటించారు.

'నేను కులం, మతం, ప్రాంతం వంటి విషయాల్ని నమ్మను. అందుకే నా అసలు పేరు జ్ఞానప్రకాష్‌ను సంక్షిప్తంగా జీపీఎస్ అని మార్చుకున్నా. నేను ఇంజనీరింగ్ పూర్తిచేశాను. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ చేశాను. దర్శకత్వ శాఖలో కూడా కొంత కాలం పనిచేశా. 'నేనొస్తా' అనే చిత్రంలో ప్రతినాయక ఛాయలున్న పాత్రలో నటించా. దానికి మంచి పేరొచ్చింది. ఆ తర్వాత హీరోగా ప్రయత్నాలు మొదలుపెట్టా.

**ప్రేమ కోసం తపించే యువకుడు..**

'ప్రేమ పిపాసి' కథలో చక్కటి భావోద్వేగాలున్నాయి. నా పాత్ర మూడు పార్శ్వాల్లో సాగుతుంది. ఈ సినిమా కోసం పదికిలోల బరువు తగ్గాను. ఆరుగురు అమ్మాయిలతో ఓ యువకుడు సాగించిన ప్రయాణమేమిటన్నదే చిత్ర ఇతివృత్తం. సినిమాలో పన్నెండు లిప్‌లాక్ సన్నివేశాలుంటాయి. అయితే వాటిలో అశ్లీలత ఏమాత్రం ఉండదు. ప్రేమకోసం తీవ్రంగా తపించే యువకుడిగా నా పాత్ర బలమైన ఉద్వేగాలతో సాగుతుంది. కొన్ని సన్నివేశాలు చూస్తే కన్నీళ్లొస్తాయి. నేటితరం మెచ్చే ప్రేమ కథా చిత్రమిది. 'ప్రేమపిపాసి' హీరోగా నాకు మంచి గుర్తింపునిస్తుందనే నమ్మకం ఉంది.

